
'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 262

మంగళవారం 13-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




### భారత్‌కు మరో విజయం

నేషన్స్ కప్ టోర్నీలో జపాన్‌పై భారత మహిళల హాకీ జట్టు గెలుపు - 12లో




### దాల్మియా చేతికి జేపీ సిమెంట్

రూ.5,666 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువ ప్రకారం డీల్ - 13లో



### శబరిమల కిటకిట

కేరళలోని శబరిమలకు నిత్యం లక్ష మందికి పైగా భక్తులు వస్తున్నారు. దీంతో దర్శనానికి దాదాపు 12 గంటలు నిరీక్షించాల్సి వస్తోంది.

వివరాలు 6లో ▸



### జోడో యాత్రలో ప్రియాంక ఫ్యామిలీ

కాంగ్రెస్ నేత రాహుల్ చేస్తున్న భారత్ జోడో యాత్రలో ఆ పార్టీ నేత ప్రియాంకా గాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా పాల్గొన్నారు.

వివరాలు 6లో ▸



### కళ్ల నుంచి నిప్పులు వస్తాయి

తెలంగాణ ఆడపిల్లల కళ్ల నుంచి నీళ్లు కాదు.. నిప్పులు వస్తాయని, సీబీఐ దాడులకు జడిసేది లేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

వివరాలు 10లో ▸



### వరుసగా రెండో సారి..

గుజరాత్ 18వ సీఎంగా భూపేంద్ర పటేల్‌తో గవర్నర్ దేవవ్రత్ ప్రమాణం చేయించారు. ప్రధాని మోదీ సహా పలువురు హాజరయ్యారు.

వివరాలు 6లో ▸

## ఉక్కు సంకల్పంతో...

# సీమకు స్టీల్ ప్లాంట్

### అతిపెద్ద దిగ్గజ కంపెనీని ఒప్పించి సాధించిన రాష్ట్ర ప్రభుత్వం

- కడపలో రూ.8,800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఉక్కు కర్మాగారం
- మొదటి విడతలో రూ.3,300 కోట్ల పెట్టుబడి.. మొత్తం 3మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం.. అనుబంధ పరిశ్రమల రాకతో మారనున్న సీమ ముఖచిత్రం
- వైఎస్సార్ జిల్లాకు ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం జగన్.. ఉత్తరాంధ్రలో రూ.6,330 కోట్లతో అదానీ గ్రీన్ ఎనర్జీ
- అల్లూరి, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 1,600 మెగావాట్లతో అదానీ పంప్డ్ హైడ్రో స్టోరేజ్
- ఎర్రవరం, సోమశిల వద్ద షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టులు
- రూ.8,855 కోట్లతో రెండు ప్రాజెక్టులతో పెద్ద ఎత్తున ఉపాధి
- సీఎం జగన్ అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశంలో పెట్టుబడులకు ఆమోదం
- మొత్తం రూ.23,985 కోట్ల పెట్టుబడులు.. ప్రత్యక్షంగా పది వేల మందికి ఉపాధి




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా రూ.23,985 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. దీని ద్వారా ప్రత్యక్షంగా పది వేల మందికి, పరోక్షంగా వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వైఎస్సార్ జిల్లాకు ఇచ్చిన హామీ మేరకు గట్టి ప్రయత్నంతో దేశంలో రెండో అతి పెద్ద స్టీల్ దిగ్గజ కంపెనీ జేఎస్ డబ్ల్యూని సీఎం జగన్ ఒప్పించి ఉక్కు కర్మాగారం నెలకొల్పేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో పోర్టులు లాంటి కీలక సదుపాయాలు లేనందున స్టీల్ ప్లాంట్‌పై కొన్ని పెద్ద గ్రూపులు తటపటాయించినప్పటికీ దిగ్గజ సంస్థను ఒప్పించి మరీ కడపలో ఉక్కు కర్మాగారం కలను సాకారం చేస్తుండటం గమనార్హం. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. వైఎస్సార్ జిల్లాలో రూ.8,800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు అదానీ గ్రీన్ ఎనర్జీ, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ నెలకొల్పే పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. వెనకబడ్డ రాయలసీమ ముఖచిత్రాన్ని

మిగతా 2వ పేజీలో ▶

# శరవేగంగా సాయం

- 99 మండలాల్లో 416 గ్రామాలపై భారీ వర్షాల ప్రభావం
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆశ్రయం
- పలు జిల్లాల్లో కురుస్తున్న ఓ మోస్తరు వర్షాలు.. నష్టాలను అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం



పెన్నా బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: మాండూస్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని 99 మండలాల్లో 416 గ్రామాలు వర్షాల ప్రభావానికి గురయ్యాయి. నెల్లూరు జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో 208 మంది, చిత్తూరు జిల్లాలో 416 మంది..

మిగతా 2వ పేజీలో ▶

## మానవత్వంతో..

# ఉదారంగా

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: సీఎం జగన్

- తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనట్లేదనే మాటే వినిపించకూడదు
- రైతులు బయట అమ్ముకుంటే వారికి మద్దతు ధర కన్నా ఎక్కువ రావాలి
- దెబ్బతిన్న చోట మళ్లీ పంటల సాగుకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు
- ముంపు ఇళ్ల బాధిత కుటుంబాలకు రూ.2 వేలతో పాటు రేషన్ సరుకులు
- కూలిన ఇళ్లు, చెట్లు, మరణించిన పశువులకు నిబంధనల ప్రకారం పరిహారం
- వారంలోగా నష్టం అంచనాల ప్రక్రియ పూర్తి చేయాలి
- తుపాను సహాయ చర్యలపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం

2 లో

## న్యూస్‌రీల్

### చిత్తూరులో రూ.250 కోట్లతో.. అమరరాజా కొత్త ప్లాంట్



చిత్తూరు జిల్లా తేనిపల్లి వద్ద రూ.250 కోట్లతో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అమరరాజా గ్రూపు ప్రకటించింది. ఆటో బ్యాటరీ విడిభాగాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. మరో 1,000 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపింది.

వివరాలు 10 ▸

### ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతర కృషి



ఆక్వా రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, రైతులెవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని అప్సడా రాష్ట్ర వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అన్నారు. రైతుల కష్టాలు తెలిసిన వెంటనే సీఎం జగన్ ఎంపవర్ కమిటీ వేశారని.. గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

వివరాలు 14 ▸

### రామోజీ తప్పుడు రాతలు మానుకో



తమపై 'ఈనాడు'లో వచ్చిన తప్పుడు రాతలను నిరసిస్తూ సచివాలయాల వలంటీర్లు అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో సోమవారం భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అసత్య వార్తలతో తమ మనోభావాలు దెబ్బ తీశారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. రామోజీ రావు దిష్టిబొమ్మను దహనం చేశారు.

వివరాలు 3 ▸

# ఎల్‌ఏసీ వద్ద మళ్లీ ఘర్షణ

### భారత్, చైనా జవాన్లకు స్వల్ప గాయాలు

అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ వద్ద భారత్, చైనా సైనికుల మధ్య మళ్లీ ఘర్షణ జరిగింది. ఈ నెల 9న జరిగిన ఘర్షణలో ఇరు దేశాల జవాన్లు కొందరు స్వల్పంగా గాయపడ్డారని భారత సైన్యం వెల్లడించింది. చైనా జవాన్లను మన సైనికులు ధీటుగా ఎదుర్కొన్నారని తెలిపింది. భారత్ కంటే చైనా జవాన్లే అధిక సంఖ్యలో గాయపడినట్లు తెలుస్తోంది.



(ఫైల్)

- వివరాలు 6లో

### సచివాలయ వ్యవస్థకు 'చట్ట' భద్రత

- ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రాజ్యాంగంలోని 11, 12 షెడ్యూళ్లలో పేర్కొన్న విధంగా ప్రత్యేక చట్టం.. తాజా ఆర్డినెన్స్‌తో సచివాలయ వ్యవస్థకు పూర్తి భద్రత

2లో

### అత్యవసర వైద్యం మరింత బలోపేతం



- రాష్ట్రంలో మూడు బోధనాస్పత్రుల్లో క్రిటికల్ కేర్ బ్లాక్‌లు
- నెల్లూరు, కడప, శ్రీకాకుళం రిమ్స్‌లలో ఏర్పాటు చేయబోతున్న వైద్యశాఖ
- ఒక్కోచోట రూ.23.75 కోట్ల వ్యయంతో ఏర్పాటు
- నెల్లూరు, కడప బ్లాక్‌ల డీపీఆర్‌లకు ఆమోదం

3 లో



### వరదల వల్లే పోలవరం ఆలస్యం

- ప్రాజెక్టు నిమిత్తం ఏపీ చేసిన ఖర్చు రూ.15,970.53 కోట్లు.. రీయింబర్స్ చేసింది రూ.13,226.04 కోట్లు
- కేంద్రం స్థాయిలో ఎప్పటికప్పుడు ప్రాజెక్టుపై సమీక్ష
- వైఎస్సార్‌సీపీ ఎంపీ బోస్ ప్రశ్నకు కేంద్రం జవాబు

14 లో

### గుంటూరులో రాష్ట్రంలోనే తొలి టెన్నిస్ అకాడమీ

- శాప్ ఆధ్వర్యంలో ఆధునిక వసతులతో బీఆర్ స్టేడియంలో ఏర్పాటు
- నేడు ప్రారంభం.. అందుబాటులోకి రానున్న అంతర్జాతీయ స్థాయి శిక్షణ
- క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రులూ ఉండేందుకు ఏర్పాట్లు

5 లో



గుంటూరులో శాప్ ఏర్పాటు చేసిన టెన్నిస్ అకాడమీ



## ఇదండీ సంగతి



మళ్లీ వెనక్కి తీసుకోవడం ఇవ్వడం దేనికి సార్.. మరొక సారి నోట్లు రద్దు చేస్తే పోలా!!

## క్లుప్తంగా...

### నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సచివాలయం మొదటి బ్లాకు కేబినెట్ సమావేశమందిరంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఉదయం 11 గంటలకు జరిగే మంత్రివర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

### ఆన్‌లైన్‌లో లడ్డూల బుకింగ్ అవాస్తవం : టీటీడీ

తిరుమల: టీటీడీ వెబ్‌సైట్ ద్వారా లడ్డూలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. టీటీడీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో భక్తులు దర్శన టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే పరిమితంగా అదనపు లడ్డూలు బుక్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. దర్శనంతో సంబంధం లేకుండా లడ్డూలు టీటీడీ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని జరుగుతున్న ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. అవాస్తవ ప్రచారాలు చేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

**శ్రీవారి దర్శనానికి 24 గంటలు**

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 14 నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,466 మంది స్వామిని దర్శించుకోగా, 28,123 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి హుండీ కానుకల రూపంలో భక్తులు రూ.4.29 కోట్లు సమర్పించారు. దర్శన టోకెన్లు లేని భక్తులకు 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

### బంగారు దుకాణాలపై 93 కేసులు

రాష్ట్రంలో తూనికలు, కొలతల శాఖ దాడులు


విజయవాడలోని బంగారు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు చోట్ల బంగారు దుకాణాలపై తూనికలు, కొలతలు శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విశాఖపట్నం, తణుకు, విజయవాడ, నెల్లూరు, తిరుపతిలోని బంగారు దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తున్న దుకాణాలపై మొత్తం 93 కేసులు నమోదు చేశారు. ఇందులో సరైన ధ్రువీకరణ లేకుండా బరువు తూచే పరికరాలను వినియోగిస్తున్నందుకు 48 కేసులు, బంగారం స్వచ్ఛత ముద్రించకపోవడంపై 27 కేసులు, టెస్ట్ వెయిట్ లేకపోవడంతో మూడు కేసులు, ఎంపీఈ పరిమితికి మించి తూకం పరికరాలు ఉపయోగించడంపై 11 కేసులు, ఆభరణాలు ఉండాల్సిన బరువు కంటే తక్కువ ఉండటంతో నాలుగు కేసులు నమోదు చేశారు.

### యాస్పిరేషనల్ జిల్లాలుగా పార్వతీపురం, అల్లూరి, వైఎస్సార్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో జిల్లాల విభజన అనంతరం వెనుకబడిన ప్రాంతాల్లో పథకాల అమలులో ప్రాధాన్యతనిచ్చే యాస్పిరేషనల్ జిల్లాలుగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ జిల్లాలను గుర్తిస్తూ కేంద్రం ఆదేశాలు జారీచేసింది. పేదరిక నిర్మూలన, విద్య, వైద్య సంబంధిత అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వెనుకబడిన ప్రాంతాలను వెనుకబాటుతనం నుంచి బయటకు తెచ్చేందుకు 2018లో కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. వివిధ అభివృద్ధి సూచికల ప్రాతిపదికన దేశవ్యాప్తంగా 112 జిల్లాలను యాస్పిరేషనల్ జిల్లాలుగా గుర్తించారు. పథకం ప్రారంభ సమయంలో మన రాష్ట్రంలో విజయనగరం, విశాఖపట్నం, వైఎస్సార్ జిల్లాలను ఎంపిక చేశారు. అయితే, ఇటీవల జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం ఆ మూడు జిల్లాల స్థానంలో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ జిల్లాలను యాస్పిరేషనల్ జిల్లాలుగా పేర్కొంటూ కేంద్రం సవరణ చేసింది.

# మానవత్వంతో.. ఉదారంగా

**తుపాను సహాయ చర్యలపై ఉన్నత సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం**


తుపాను సహాయక చర్యలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తుపాను, భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల పట్ల అత్యంత ఉదారంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. పంట నష్టాల ఎన్యుమరేషన్ విషయంలో ఉదారంగా ఉండాలని సూచించారు. తుపాను, భారీ వర్షాలు, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి జగన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు.

**ఎక్కడా రైతులు నిరాశకు గురి కాకూడదు**

పంట నష్టాల ఎన్యుమరేషన్‌లో రైతులు ఎక్కడా నిరాశకు గురి కాకూడదని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేశారు. రంగు మారిన ధాన్యమైనా, తడిసిన ధాన్యమైనా సరే కొనుగోలు చేయట్లేదన్న మాట ఎక్కడా రాకూడదన్నారు. తక్కువ రేటుకు కొంటున్నారన్న మాటే ఎక్కడా వినిపించకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ రైతులు బయట విక్రయించదలచినా సరే వారికి రావాల్సిన రేటు (మద్దతు ధర) కంటే ఎక్కువ ధర లభించాల్సిందేనని సూచించారు. ఆ రేటు దక్కేలా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులదేనన్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురిసిన జిల్లాల్లో కలెక్టర్లు అంతా ఈమేరకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

**80 శాతం సబ్సిడీతో విత్తనాలు**

పంటలు దెబ్బ తిన్నచోట మళ్లీ పంటలు సాగు చేసేందుకు వీలుగా 80 శాతం సబ్సిడీతో విత్తనాలను రైతులకు అందించాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. పంటలు దెబ్బతిన్న ప్రతి రైతుకు సబ్సిడీ విత్తనాలు అందాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇళ్లు ముంపునకు గురైతే బాధిత కుటుంబానికి రూ.2 వేలతో పాటు రేషన్ సరుకులు అందించాలని సూచించారు. ప్రభుత్వం పట్టించుకోలేదనే మాటే రాకూడదని, ఇళ్లలోకి నీరు చేరితే కచ్చితంగా వారికి సహాయాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్లు అంతా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

**బాధితులందరికీ సాయం అందాలి..**

పట్టణాలు, పల్లెలతో సంబంధం లేకుండా బాధితులందరికీ సహాయాన్ని అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. గోడకూలి ఒకరు మరణించారనే సమాచారం వచ్చిందని, బాధిత కుటుంబానికి వెంటనే పరిహారాన్ని అందించాలని సూచించారు. ఎక్కడైనా పశువులకు నష్టం జరిగితే ఆ పరిహారం కూడా సత్వరమే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నష్ట పరిహారం అంచనాల నమోదును వెంటనే ప్రారంభించి వచ్చే వారం రోజుల్లో ఈ ప్రక్రియను ముగించాలని నిర్దేశించారు.

పూరిళ్లు/కచ్చా ఇళ్లు కూలిపోయిన బాధితులకు రూ.4,100 చొప్పున, పశువులు చనిపోతే రూ.30 వేలు చొప్పున, చెట్లు కూలిపోతే నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ చేపట్టి వారం రోజుల్లోగా పూర్తి చేసి వెంటనే సాయం అందించాలని నిర్దేశించారు. సమావేశంలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, రెవెన్యూశాఖ(ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్ జీ.సాయి ప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, రవాణాశాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, వ్యవసాయశాఖ కమిషనర్ సి.హరికిరణ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ బీఆర్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

### రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

- దక్షిణ, ఉత్తర కోస్తా, సీమల్లో అక్కడక్కడ..

సాక్షి, విశాఖపట్నం: మాండూస్ తుపాను తీరాన్ని దాటి మూడు రోజులవుతున్నా రాష్ట్రంలో ఇంకా వర్షాలు కొనసాగుతున్నాయి. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో వానలు కురుస్తూనే ఉన్నాయి. గాలిలో తేమ అధికంగా ఉండడం వల్ల వర్షాలు కొనసాగడానికి దోహదం చేస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, వైఎస్సార్, గుంటూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో గాలిలో తేమ 90–95% నమోదవుతోంది. అందువల్లే ప్రస్తుతం అల్పపీడనాలు, ఆవర్తనాలు వంటివి లేకపోయినా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకంటే ఆయా చోట్ల వానలు ఇంకా కురుస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంపైకి ఈశాన్య/తూర్పు గాలులు వీస్తున్నాయి. కొద్ది రోజులకంటే ప్రస్తుతం వీటి వేగం తగ్గింది. ఇలా ఈ గాలుల వేగం, గాలిలో తేమ తగ్గితే వాతావరణంలో పొగమంచు ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల, ఉత్తర కోస్తాంధ్రలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. కాగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలుచోట్ల వర్షాలు కురిశాయి.

# సచివాలయ వ్యవస్థకు 'చట్ట' భద్రత

**ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**



సాక్షి, అమరావతి: గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు కొత్తగా చట్టం తీసుకొస్తూ ప్రభుత్వం సోమవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. 2019 అక్టోబర్ 2వ తేదీ నుంచి రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అప్పట్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నూతన వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చారు. సోమవారం తాజా ఆర్డినెన్స్‌తో.. గ్రామాలు, పట్టణాల్లో ఇప్పటికే అమలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ చట్టం తరహాలోనే సచివాలయ వ్యవస్థకు కూడా చట్ట రూపం వచ్చింది. రాజ్యాంగంలోని 11, 12 షెడ్యూళ్లలో పేర్కొన్న ప్రకారం ప్రజల కేంద్రంగా ప్రభుత్వ సేవలు, ఇతర సదుపాయాలను అందించేందుకు చట్టం ద్వారా గ్రామ/వార్డు సచివాలయాల పేరుతో వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నట్టు ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు.

**స్థానిక సంస్థల చట్టాలకు అదనంగా..**

రాష్ట్రంలో ప్రస్తుతం అమలులో ఉన్న పంచాయతీ రాజ్, మునిసిపల్ చట్టాలకు అదనంగా గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ చట్టం ఉంటుందని ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్‌తో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా అందజేసే ప్రభుత్వ సేవలు, గ్రామ/వార్డు సచివాలయ శాఖ ద్వారా జారీ చేసే ఉత్తర్వులు శాసనాధికారంతో కూడినవిగా ఉంటాయని అందులో పేర్కొన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల నియామకంతో వారి సర్వీస్ అంశాలు కూడా ఆర్డినెన్స్‌లోని నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధత కలిగి ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ ఆర్డినెన్స్‌కు చట్టసభల ఆమోదం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.

**చట్టంతో పూర్తిస్థాయి పటిష్టత**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుపై ప్రకటన చేశారు. అనంతరం.. కొత్తగా 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు మంజూరు చేయడమే కాకుండా ఆ వెంటనే ఉద్యోగాల భర్తీ వంటి చర్యలన్నీ కేవలం 4నెలల వ్యవధిలోనే పూర్తయ్యాయి. 2019 అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ అధికారికంగా ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రెండు వేల జనాభాకు, పట్టణ ప్రాంతాల్లో 4 వేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు కొలువుదీరాయి. అంతకు ముందు కనీసం ఒక్క శాశ్వత ఉద్యోగి కూడా నియామకం జరగని చాలా గ్రామాల్లో కొత్తగా ఏర్పాటైన గ్రామ సచివాలయాల్లో 10 నుంచి 11 మంది వరకు శాశ్వత ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. వీటిలో 545 రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి సచివాలయానికి ఇంటర్‌నెట్ తోపాటు కంప్యూటర్లు, ప్రింటర్లసహా ఫర్నిచర్‌ను ప్రభుత్వం అందజేసింది. ఇప్పటివరకు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలు వారి సొంత ఊరు దాటాల్సిన అవసరం కూడా లేకుండా 5 కోట్లకుపైగా ప్రజలు ప్రభుత్వ సేవలను వినియోగించుకుంటున్నారు. దీనికి మరింత పటిష్టత తెచ్చేందుకు అడ్వకేట్ జనరల్ సూచన మేరకు ప్రభుత్వం ఈ వ్యవస్థకు చట్ట రూపం కూడా తీసుకొస్తూ తాజా ఆర్డినెన్స్ జారీ చేసింది.

# శరవేగంగా సాయం

▶ మొదటి పేజీ తరువాయి

తిరుపతి జిల్లాలోని కేంద్రాల్లో 571 మంది మొత్తం 1,195 మందికి ఆశ్రయమిచ్చి భోజన సదుపాయాలు కల్పించారు. ఇళ్లకు తిరిగి వెళుతున్న బాధితులకు రూ.2 వేల చొప్పున సాయాన్ని అందిస్తున్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు పంట, ఆస్తి నష్టాలను ఆయా శాఖలు అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యాయి.

**వదలని వర్షాలు..**

తుపాన్ ప్రభావిత జిల్లాల్లో వర్షాలు ఇంకా కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం ఉదయం 8.30 నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు నెల్లూరు జిల్లా ఉలవపాడులో అత్యధికంగా 12.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. విశాఖ జిల్లా భీమునిపట్నంలో 10.2 సెంటీమీటర్లు, నెల్లూరు జిల్లా కందుకూరులో 9.8, విశాఖ జిల్లా భీమిలిలో 9.4, ప్రకాశం జిల్లా జరుగుమిల్లిలో 8.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అన్నమయ్య జిల్లా కురబలకోటలో 7 సెంటీమీటర్ల వర్షం పడింది.


బాపట్ల జిల్లాలో రైతులకు భరోసా కల్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

**1,267 బృందాలు**

తుపాన్ ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ 1,267 బృందాలను సిద్ధం చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది సోమవారం శాఖ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మురుగు కాల్వలలో పూడిక తొలగింపు పనులను వెంటనే చేపట్టాలని సూచించారు.

**21 కల్లా నష్టం లెక్కలు**

మాండూస్ తుపాన్ వల్ల జరిగిన పంట నష్టం లెక్కింపు ప్రక్రియను ఈ నెల 21వ తేదీకల్లా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ అధికారులకు సూచించారు. పంట నష్టం జాబితాలను సామాజిక తనిఖీల కోసం 26 కల్లా పూర్తి చేసి డిసెంబర్ 27న ఈ–క్రాప్ ప్రాతిపదికన తుది జాబితాలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. తుపాన్ వల్ల రబీ సీజన్‌లో దెబ్బ తిన్న పంటల స్థానంలో రెండోసారి విత్తుకునేందుకు వీలుగా ప్రతిపాదనలను రెండు రోజుల్లో పంపాలని అధికారులకు సూచించారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మల్లిమడుగు, కాళంగి, అరిణియార్, ఎన్టీఆర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండిపోవటంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. అత్యధికంగా సోమల మండలంలో 37.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2,650 చెరువులు ఉండగా 90 శాతం పూర్తిగా నిండిపోయాయి. అతిపెద్ద చెరువైన తొండమనాడు చెరువు కలుజు పారుతోంది. 10,500 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. చిల్లకూరు మండలం పాలెం గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు ప్రదీప్ నాయుడు ఆక్వా గుంత వద్ద చిక్కుకోవడంతో రెస్క్యూటీం పడవ ద్వారా చేరుకుని రక్షించింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సోమశిల జలాశయానికి సోమవారం సాయంత్రానికి 26 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.

# ఉక్కు సంకల్పంతో సీమకు స్టీల్ ప్లాంట్


రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

▶ మొదటి పేజీ తరువాయి

మార్చే ప్రక్రియలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు గొప్ప ప్రయత్నమని ఈ సందర్భంగా సీఎం జగన్ పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ద్వారా పలు అనుబంధ పరిశ్రమల రాకతో రాయలసీమ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులు ఇవీ**

**దేశంలో రెండో అతిపెద్ద స్టీల్ గ్రూప్ జేఎస్‌డబ్ల్యూ**

వైఎస్సార్ కడప జిల్లా సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ రెండు విడతల్లో రూ.8,800 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. మొదటి విడతలో రూ.3,300 కోట్లతో ఏటా ఒక మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు కానుంది. రెండో విడతలో మరో రెండు మిలియన్ టన్నులతో కలిపి మొత్తం 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో యూనిట్ అందుబాటులోకి రానుంది. స్టీల్, ఎనర్జీ, తయారీ, సిమెంటు, పెయింటింగ్ లాంటి పలు రంగాల్లో విస్తరించిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ విలువ సుమారు రూ.1,76,000 కోట్లు (22 బిలియన్ డాలర్లు) ఉంటుంది. ఏటా 27 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి ద్వారా దేశంలోనే రెండో అతిపెద్ద కంపెనీగా జేఎస్‌డబ్ల్యూ నిలిచింది. కంపెనీకి కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో స్టీల్ ప్లాంట్లున్నాయి. తాజాగా మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏపీలో అడుగు పెడుతోంది.

**ఉత్తరాంధ్రలో అదానీ గ్రీన్ ఎనర్జీ**

ఉత్తరాంధ్రలో అదానీ గ్రీన్‌ఎనర్జీ పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ముందుకొచ్చింది. సుమారు రూ.6,330 కోట్ల పెట్టుబడితో 1,600 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదకోటలో వెయ్యి మెగావాట్లు, అనకాపల్లి – విజయనగరం జిల్లాల పరిధిలో రైవాడ వద్ద 600 మెగావాట్ల సామర్థ్యంతో వీటిని నెలకొల్పనుంది. ప్రత్యక్షంగా 4 వేల మందికి ఉపాధి కల్పించే ఈ యూనిట్ పనులను 2024 డిసెంబర్‌లో ప్రారంభించి నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 4,196 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుబాటులోకి రానుంది.

**ఎర్రవరం, సోమశిల వద్ద రూ.8,855 కోట్లతో హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు**


ఎర్రవరం, సోమశిల వద్ద షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ రూ.8,855 కోట్లతో హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఎర్రవరం వద్ద 1,200 మెగావాట్లు, సోమశిల వద్ద 900 మెగావాట్లతో మొత్తం రెండు ప్రాజెక్టుల ద్వారా 2,100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జూలైలో ప్రారంభమై విడతల వారీగా డిసెంబర్ 2028 నాటికి పూర్తిస్థాయిలో యూనిట్ అందుబాటులోకి రానుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా 2,100 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు**

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్నాథ్, కాకాణి గోవర్ధన్ రెడ్డి, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, రెవెన్యూశాఖ (వాణిజ్య పన్నులు) స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, రెవెన్యూశాఖ(ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) స్పెషల్ సీఎస్ జి.సాయి ప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, జీఏడీ స్పెషల్ సీఎస్ కె.ప్రవీణ్ కుమార్, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ, రవాణాశాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, ఏపీపీసీబీ మెంబర్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, ఏపీ హైగ్రేడ్ స్టీల్ లిమిటెడ్ ఎండీ షన్మోహన్ పాల్గొన్నారు.

# లక్షణంగా 'ఈడబ్ల్యూఎస్'

- ఏడాదిలో దాదాపు లక్ష సర్టిఫికెట్ల జారీ
- ఇక ఇక్కట్లకు ఆస్కారమెక్కడ రామోజీ?
- సచివాలయాల ద్వారా సులభంగా ప్రక్రియ
- ప్రొఫార్మాలే చేరలేదంటూ 'ఈనాడు' తప్పుడు కథనాలు


జారీ అయిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

సాక్షి, అమరావతి: ఏడాది వ్యవధిలో జారీ చేసిన దాదాపు లక్ష సర్టిఫికెట్లు కళ్లెదుటే కనిపిస్తున్నా కబోదుల్లా నటిస్తూ మభ్యపుచ్చే కథనాలు ప్రచురించే వారిని ఏమనాలి? అగ్రవర్ణ పేదలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో జారీ చేసిన ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాల సంఖ్య ఇదీ! రాష్ట్రవ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు సజావుగా జారీ అవుతుంటే అసలు ప్రొఫార్మా సైతం రెవెన్యూ కార్యాలయాలు, సచివాలయాలకు చేరలేదంటూ 'ఈనాడు' యథావిధిగా తనకు అలవాటైన రీతిలో పచ్చి అబద్ధాలను వండి వార్చింది. సర్టిఫికెట్లు జారీ చేయకపోవడం వల్ల పోలీసు నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఈడబ్ల్యూఎస్ సదుపాయాన్ని వినియోగించుకోగలమా? అని మథనపడుతున్నట్లు శోకాలు పెట్టింది.

**జనవరి నుంచే జారీ**

ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను ప్రభుత్వం జారీ చేస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం చేసిన చట్టానికి అనుగుణంగా వీటిని జారీ చేస్తున్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో వీటికోసం దరఖాస్తు చేసుకునే సౌకర్యాన్ని జనవరి ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. జనవరి నుంచి ఈ ఏడాది డిసెంబర్ 12వ తేదీ వరకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల కోసం 1,04,961 లక్షల మంది సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోగా 93,348 జారీ అయ్యాయి. 7,608 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 4,005 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. మరి ప్రొఫార్మాలే రెవెన్యూ కార్యాలయాలకు చేరకుంటే ఇన్ని లక్షల సర్టిఫికెట్లు ఎలా జారీ అయ్యాయి?

**ఇదీ ప్రక్రియ**

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే డిజిటల్ అసిస్టెంట్ వద్దకు వెళుతుంది. అక్కడి నుంచి వీఆర్వో, ఆర్ఐ ద్వారా తహసీల్దార్ వద్దకు చేరుతుంది. ఇందుకోసం రూ.50 సర్వీస్ చార్జీ చెల్లించాలి. దరఖాస్తుతో పాటు నోటరీ అఫిడవిట్, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేయాలి. దరఖాస్తును 30 రోజుల్లోపు కచ్చితంగా క్లియర్ చేస్తారు. రూ.8 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండే అర్హులైన అగ్రవర్ణ పేదలకు నిబంధనల ప్రకారం వీటిని జారీ చేస్తారు. వాస్తవాలు ఇలా ఉండగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీకి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో అమలుకు నోచుకోవడంలేదని, దరఖాస్తుదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఈనాడు దిగజారుడు కథనాన్ని ప్రచురించింది.

# రాజేంద్రసింగ్‌కు అప్పుడెందుకు కన్నీరు రాలేదు?

- అమరావతిలో వేల ఎకరాల పంట పొలాలు నాశనమైనప్పుడు ఆయనెక్కడున్నారు?
- ఆనాడు ఆయనెందుకు ప్రశ్నించలేదు?
- రామోజీ ఫిల్మ్ సిటీ కోసం రామోజీరావు ఎన్ని కొండలు పిండి చేశారు?
- ఉత్తరాంధ్రపై బాబు, రామోజీ డ్రామాలు
- పరిశ్రమలపైనా 'ఈనాడు' తప్పుడు కథనాలు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్



సాక్షి, అమరావతి: రుషికొండలో అక్రమ నిర్మాణాలంటూ చంద్రబాబు, ఈనాడు రామోజీరావు విషప్రచారం చేస్తున్నారని, ఏపీతో సంబంధం లేనివాళ్లను తీసుకొచ్చి అవాస్తవాలు మాట్లాడిస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. పారిశ్రామిక ప్రగతిపై టీడీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని.. ఉత్తరాంధ్రపై చంద్రబాబు, రామోజీరావు డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. పరిశ్రమలపై కూడా ఈనాడు అసత్య ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

చంద్రబాబుకు సంబంధించిన ఈనాడు, ఇతర ఎల్లో మీడియా దారుణంగా వార్తలు రాస్తున్నాయి. విశాఖ మీద విషం కక్కుతూ ఈనాడు వరుస కథనాలు రాస్తోంది. రుషికొండపై నిర్మాణాల గురించి దారుణంగా ఏవేవో రాశారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన సీపీఐ నేత కె. నారాయణ అక్కడ కేవలం ప్రభుత్వ నిర్మాణాలు మాత్రమే సాగుతున్నాయని చెప్పారు. అయితే, ఆయన మాటలు చంద్రబాబుకి, ఈనాడుకు నచ్చలేదు. దీంతో ఎక్కడో రాజస్థాన్‌లో ఉన్న రాజేంద్రసింగ్ అనే ఈనాడు మిత్రుడ్ని పట్టుకొచ్చి మాట్లాడించారు. కానీ, రాజధాని పేరుతో వేల ఎకరాల సారవంతమైన భూములు సేకరించి నాశనం చేసినప్పుడు ఈ రాజేంద్రసింగ్ ఎక్కడున్నారు? అప్పుడెందుకు ఆయన ప్రశ్నించలేదు? అప్పుడాయనకు కన్నీరెందుకు రాలేదు? రామోజీరావు ఆనాడు ఎందుకు స్పందించలేదు?

**రామోజీ ఫిల్మ్ సిటీ ఎలా నిర్మించారు?**

చివరకు రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లే దారి కోసం రామోజీరావు ఎన్ని కొండలు పిండి చేశారు? ఫిల్మ్‌సిటీ నిర్మాణం కోసం ఎన్ని గుట్టలు, కొండలు తవ్వలేదు? అక్కడ నిర్మాణాలు ఎలా చేశారాయన? ప్రజలకు ఇవన్నీ తెలియవు అనుకుంటే ఎలా? విశాఖ వేదికగా ఏ నిర్మాణాలు, అభివృద్ధి పనులూ జరగకూడదు. ఆ ప్రాంతానికి పేరు రాకూడదు.. అలాగే, అక్కడ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ రాకూడదు. అదే వారి టార్గెట్.

**కోవిడ్ కష్టకాలంలోనూ రాష్ట్రానికి పరిశ్రమలు..**

పరిశ్రమలపైనా ఈనాడు తప్పుడు వార్తలు రాస్తోంది. పరిశ్రమలు వెళ్లిపోతున్నాయంటూ దుష్ప్రచారం చేస్తోంది. నిజానికి.. గతంలో కంటే ఎక్కువ పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. కోవిడ్ కష్టకాలంలోనూ పరిశ్రమలు వచ్చిన మాట వాస్తవం. సోమవారం ఎస్ఐపీబీ మీటింగ్ జరిగింది. అందులో దాదాపు రూ.24 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కానీ, చంద్రబాబు మాదిరిగా ఆర్భాట ప్రచారం చేసుకోవడంలేదు. రాష్ట్రం నుంచి అమరరాజా కంపెనీ, కట్ డ్రాయర్ కంపెనీ పోయాయని ఏదేదో రాశారు. కానీ, ఏపీలో తాము వేధింపులకు గురైనట్టు ఎక్కడా అమరరాజా ప్రకటించలేదు. వారు మాట్లాడకుండా, చంద్రబాబు ఎందుకు మాట్లాడుతున్నారు. నిజానికి.. చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ, పవన్‌కళ్యాణ్.. వీరెవ్వరూ రాష్ట్రంలో ఉండరు. వారికి అసలు రాష్ట్రంపై ప్రేమ ఉందా? చివర్లో.. విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అమర్ స్పందిస్తూ.. వచ్చే విద్యా సంవత్సరం నుండి విశాఖపట్నం వేదికగా పాలన ఉంటుందని.. సీఎం జగన్ వెళ్తే సెక్రటేరియట్ కూడా వెళ్లినట్లేనని.. దీనిపై ఇప్పటికే చాలాసార్లు స్పష్టతనిచ్చామన్నారు.

## క్లుప్తంగా...

### టీచర్ల బదిలీ ఉత్తర్వులను సవరించాలి

**మంత్రి బొత్సకు ఎమ్మెల్సీ కల్పలత, వైఎస్సార్ టీఎఫ్, పీఆర్టీయూ వినతి**

**సాక్షి, అమరావతి:** టీచర్ల బదిలీలకు సంబంధించి ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల్లో పలు అంశాలను సవరించాలని ఎమ్మెల్సీ కల్పలత సోమవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరారు. ఎమ్మెల్సీ కల్పలత, వైఎస్సార్‌టీఎఫ్ సహా పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు సోమవారం మంత్రిని కలిసి జీవో 187పై చర్చించారు. వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై స్పందించిన మంత్రి బొత్స మ్యాపింగ్ అయిన పాఠశాలలతోపాటు ప్రభుత్వ విధానం మేరకు రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు స్పెషల్ పాయింట్లు ఇచ్చే ఆలోచన చేస్తున్నామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. 2021లో బదిలీ అయ్యి ఇప్పుడు రీ ఆపోర్షన్మెంట్లో తప్పనిసరి బదిలీ ఉపాధ్యాయులకు కూడా స్పెషల్ పాయింట్లు ఇచ్చేలా విద్యాశాఖ మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో తూర్పు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎంవీ రామచంద్రరెడ్డి, పి.చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు కేసవరపు జాలిరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధర్ రెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జమాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 'విద్య'పై ఖర్చు.. రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడి

- విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి.. ప్రోత్సహించండి
- కళా ఉత్సవ్ ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ



కళా ఉత్సవ్-2022'లో మంత్రి బొత్స సత్యనారాయణ తదితరులు

**సాక్షి, అమరావతి:** విద్యా రంగం మీద రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడి అని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్-2022ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. చదువు మాత్రమే కాకుండా కళలు, క్రీడలవైపు కూడా తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. విద్యా రంగంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాల విజయవంతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అనంతరం పలు కళారూపాలను ప్రదర్శించిన చిన్నారులను మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కాగా, మొత్తం 10 అంశాలలో 260 మంది విద్యార్థులు తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించండి

**కేంద్ర ఎన్నికల సంఘానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల విజ్ఞప్తి**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో నిర్వహించే ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎమ్మెల్సీలు బాలసుబ్రహ్మణ్యం, కత్తి నరసింహారెడ్డి, షేక్ సాబ్జీలు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. బోగస్ ఓట్లు తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరామన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు.

### వైఎస్ హయాంలోనే వడ్డెరలకు సముచిత స్థానం

- ప్రాధాన్యతనిచ్చిన సీఎం జగన్
- ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు మారేష్

**సాక్షి, అమరావతి:** వడ్డెర్లకు సముచిత స్థానం కల్పించింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ పేర్కొన్నారు. వడ్డెర్లకు ఏమీ చేయని చంద్రబాబు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ఇప్పుడు వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ వడ్డెర్లకు మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యే సీటు కేటాయించారని తెలిపారు. ఆ వర్గానికి చెందిన చంద్రగిరి ఏసురత్నం అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైతే ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవి కట్టబెట్టారని గుర్తుచేశారు. వడ్డెర్లకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్‌పర్సన్‌గా ఒక మహిళను, 12 మంది డైరెక్టర్లను నియమించారని పేర్కొన్నారు. తనకు విద్య నేర్పిన వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వెంకట సుబ్బయ్య మాస్టార్ పేరుతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఓ పాఠశాలను ఏర్పాటు చేశారని మారేష్ గుర్తుచేశారు.



చిత్తూరు జిల్లా చిన్నగిరిగపల్లిలో మహిళకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్



తాడేపల్లిగూడెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గడప గడపకు మన ప్రభుత్వం



తూర్పుగోదావరి జిల్లా మర్రిపాలెంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు



ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా బ్రాహ్మణపల్లిలో దివ్యాంగుడి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

# అత్యవసర వైద్యం మరింత బలోపేతం

## రాష్ట్రంలో మూడు బోధనాస్పత్రుల్లో క్రిటికల్ కేర్ బ్లాక్‌లు

**సాక్షి, అమరావతి:** ప్రజలు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నప్పుడు అత్యవసరమయ్యే క్లిష్టమైన సంరక్షణ(క్రిటికల్ కేర్)ను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గుండెపోటు, కార్డియో వాస్కులర్ స్ట్రోక్స్, శ్వాసకోశ రుగ్మతలు, పాయిజన్, సెప్టిక్ షాక్, ఇతర సందర్భాల్లో బాధితులకు నాణ్యమైన వైద్య సేవల కోసం నెల్లూరు జీజీహెచ్, కడప, శ్రీకాకుళం రిమ్స్‌లలో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ)లు ఏర్పాటు చేయడానికి కార్యాచరణ రూపొందించింది. కరోనా వైరస్ మహమ్మారి బారిన పడి దేశవ్యాప్తంగా లక్షల మంది మృత్యువాత పడ్డారు. వైరస్ నుంచి కోలుకున్న అనంతరం పలు రకాల తీవ్ర అనారోగ్య సమస్యలతో



మరికొందరు ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను కరోనా వైరస్ తెలియజేసిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా సీసీబీల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**రూ.71.25 కోట్లతో..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నెల్లూరు, కడప, శ్రీకాకుళంలో ఒక్కోచోట రూ.23.75కోట్ల ఖర్చుతో రూ.71.25 కోట్లతో 50 పడకల సామర్థ్యంతో సీసీబీలను ఏర్పాటుచేస్తున్నాయి. ఇప్పటికే నెల్లూరు జీజీహెచ్, కడప రిమ్స్‌లో సీసీబీల ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించగా, వాటికి ఆమోదం లభించింది. సీసీబీల ఏర్పాటుకు టెండర్‌లను పిలవాలని ఎన్‌హెచ్‌ఎం నుంచి ఏపీఎంఎస్ఐడీసీకి ప్రతిపాదనలను పంపారు. శ్రీకాకుళం రిమ్స్‌లో సీసీబీ ఏర్పాటుకు డీపీఆర్‌ను రూపొందిస్తున్నారు. త్వరగా టెండర్లు పూర్తి చేసి, శరవేగంగా సీసీబీలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ 'సాక్షి'తో చెప్పారు.

**సీసీబీల ఏర్పాటు ఇలా...**

క్రిటికల్ కేర్ సేవల్లో అత్యవసరవైద్యం, శస్త్రచికిత్స, ఇంటెన్సివ్ కేర్ కలిపి ఉంటాయి. బోధనాస్పత్రుల్లో ఏర్పాటుచేస్తున్న సీసీబీలలో 50 పడకలు ఉంటాయి. వీటిలో 10 (రెండు పీడియాట్రిక్స్) బెడ్స్ ఐసీయూ, ఆరు (రెండు పీడియాట్రిక్స్) బెడ్స్ హై-డిపెండెన్సీ కేర్ యూనిట్ (హెచ్‌డీయూ), 24 ఐసోలేటెడ్ బెడ్స్, మిగిలిన పడకల్లో డయాలసిస్, ఎంసీహెచ్, ఎమర్జెన్సీ సేవలు అందిస్తారు. ఆపరేషన్ థియేటర్, లేబర్, డెలివరీ సేవలు వీటిల్లో అందుబాటులోకి తెస్తారు. పడకల సామర్థ్యానికి అనుగుణంగా స్పెషలిస్ట్ వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటారు.

### మాస్టర్ ప్లాన్‌లో మార్పునకు యూడీఏకు అధికారం

**సాక్షి, అమరావతి:** మాస్టర్ ప్లాన్‌లో అవసరమైన మార్పు చేసేందుకు, నేరుగా ప్రభుత్వానికి సూచనలు చేసేందుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)లకు అధికారం కల్పిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు ప్లాన్‌లో మార్పులు చేయాలన్నా, భూ వినియోగ విధానాన్ని మార్చాలన్నా మొదట స్థానిక సంస్థల్లో తీర్మానం చేసి అనంతరం యూడీఏకు పంపేవారు. అనంతరం ప్రభుత్వ సూచనల మేరకు డీటీసీపీకి వచ్చేది. అయితే, మాస్టర్ ప్లాన్‌లో, భూ వినియోగంలోను మార్పులుచేయాలని యూడీఏ భావిస్తే స్థానిక సంస్థల అనుమతి లేకుండానే నేరుగా ప్రభుత్వానికి సిఫార్సు చేసే అధికారం కల్పిస్తూ సోమవారం మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.



## రామోజీ తప్పుడు రాతలు మానుకో



దేవరాపల్లిలో రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

- 'ఈనాడు' నిరాధార వార్తలపై వలంటీర్ల నిరసన హోరు
- అసత్య కథనాలపై ఆగ్రహ జ్వాలలు
- రామోజీరావు దిష్టిబొమ్మ దహనం

**దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా):** గ్రామ వలంటీర్లపై అసత్య కథనాలను ప్రచురించిన రామోజీరావు... ఇకనైనా తప్పుడు రాతలు మానుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వలంటీర్లు హెచ్చరించారు. తమపై 'ఈనాడు'లో వచ్చిన తప్పుడు రాతలను నిరసిస్తూ గ్రామ సచివాలయ వలంటీర్లు అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో సోమవారం భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నిరాధార వార్తలతో తమ మనోభావాలు దెబ్బతీయడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. గౌరవ పారితోషికంతో గ్రామాల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న తమను కించపరిచేలా రాతలు రాయడం వెనుక ఆంతర్యమేమిటంటూ తీవ్రంగా మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం తమ జీవితాలతో చెలగాటం ఆడొద్దంటూ ధ్వజమెత్తారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రామోజీరావు దిష్టిబొమ్మతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడి 'వలంటీర్లపై తప్పుడు రాతలు మానుకోవాలి, వలంటీర్ల మనోభావాలను దెబ్బతీస్తే సహించబోం, రామోజీరావు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. ఈనాడు డౌన్ డౌన్, రామోజీరావు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ సేవాభావంతో సేవలందిస్తున్న తమను కించపరచడం తగదన్నారు. వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాల ప్రశంసలు అందుకోవడం వాస్తవం కాదా... అని ప్రశ్నించారు. ప్రజా మన్ననలు పొందుతున్న తమను కించపరిచేలా ఇలాంటి అవాస్తవ కథనాలు ప్రచురిస్తే సహించబోమని వలంటీర్లు హెచ్చరించారు.

## జగన్ పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట

- క్యాన్సర్‌కు దేశంలోనే అత్యుత్తమ వైద్యవిధానంతెచ్చాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు జీజీహెచ్‌లో త్రీడీ డిజిటల్ మామోగ్రఫీ మెషిన్ ప్రారంభం



త్రీడీ డిజిటల్ మామోగ్రఫీ వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని

**గుంటూరుమెడికల్:** సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించేందుకు దేశంలోనే అత్యుత్తమ వైద్య విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో త్రీడీ డిజిటల్ మామోగ్రఫీ వైద్య పరికరాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. అమృతలూరుకు చెందిన గడ్డిపాటి కస్తూరిదేవి, రామ్మోహనరావు, శివ రామకృష్ణబాబు, నాట్కో ట్రస్ట్-హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.కోటి విలువైన ఈ త్రీడీ డిజిటల్ మామోగ్రఫీ వైద్య పరికరాన్ని జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు అందించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాదికి 50 వేల నుంచి 60 వేల వరకు కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ఆరోగ్య శ్రీ ద్వారా పూర్తి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల ఆస్పత్రులను అత్యాధునిక క్యాన్సర్ కేర్ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు వైద్యులు, సిబ్బందికి శిక్షణ, సాంకేతిక సహకారం కోసం విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి ప్రభుత్వాస్పత్రుల్లో కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కడప, కర్నూలులో రూ.120కోట్లతో రాష్ట్ర స్థాయి క్యాన్సర్ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య విధానాన్ని ఉగాది నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు మోసం చేయడం మాత్రమే తెలుసునని, వైద్య, ఆరోగ్య రంగానికి ఏమీ చేయని ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు షేక్ ముస్తఫా, మద్దాలి గిరి, ఉండవల్లి శ్రీదేవి, నాట్కో ట్రస్ట్ సీఈవో కేపీఎస్ స్వాతి, వైస్ చైర్మన్ సదాశివరావు, కో-ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, డీఎంఈ వినోద్ కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నీలం ప్రభావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుమయ ఖాన్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.




## న్యూట్రిషన్ ఇంటర్నేషనల్‌తో వైద్య శాఖ ఒప్పందం

**సాక్షి, అమరావతి:** అయోడిన్ లోపాన్ని మరింత సమర్థవంతంగా అధిగమించడానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ న్యూట్రిషన్ ఇంటర్నేషనల్‌తో సోమవారం ఆర్థికేతర ఒప్పందం కుదుర్చుకుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ 'నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్' కార్యక్రమం అమలుకోసం న్యూట్రిషన్ ఇంటర్నేషనల్ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. అయోడైజ్డ్ ఉప్పు ఉత్పత్తి, పంపిణీ, ఇప్పటికే ఉన్న వ్యవస్థ బలోపేతానికి సహకారం అందిస్తామని న్యూట్రిషన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్(ఇండియా) మినీ వర్గీస్ తెలిపారు.

## వలంటీర్ల వ్యవస్థపై వ్యతిరేకంగా చెప్పించగలరా?

- టీడీపీ అధ్యక్షుడు, ఎల్లో మీడియాకు ప్రభుత్వ సలహాదారు 'సజ్జల' సవాల్
- సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తారా?
- వలంటీర్లపై వ్యతిరేకంగా అవ్వాతాతల వద్ద మాట్లాడితే మొహాన పేడనీళ్లు చల్లడం ఖాయం
- 65 సీన్ల సినిమాలాగే పవన్‌కళ్యాణ్ రాజకీయం



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ కార్యకర్తలతో కాకుండా ఏ ఒక్కరితోనైనా వ్యతిరేకంగా చెప్పించగలరా? అని తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియాకు ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సవాల్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన సూర్యోదయం కాక ముందే తలుపుతట్టి పెన్షన్ అందిస్తున్న వలంటీర్లపై అవ్వాతాతల వద్ద వ్యతిరేకంగా మాట్లాడితే మొహాన పేడ నీళ్లు చల్లడం ఖాయమని చంద్రబాబును, ఎల్లో మీడియాను హెచ్చరించారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సేవలను ప్రజల గడప వద్దకు చేర్చడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక సంస్కరణలను అమలుచేస్తున్నారని, అందులో భాగమే వలంటీర్ల వ్యవస్థ అని గుర్తుచేశారు. సేవాభావంతో తక్కువ గౌరవవేతనం అందుకుంటూ ఎక్కువ సేవలు అందిస్తున్న వలంటీర్లపై దుష్ప్రచారం చేయడం తగదని హితవుపలికారు. రాష్ట్రంలో నవరత్నాల పథకాలు విజయవంతంగా అమలవుతుండడంతో ముఖ్యమంత్రికి మంచి పేరు వస్తోందనే అక్కసుతోనే విషపురాతలు రాస్తున్నారని సజ్జల మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని... ఇక వలంటీర్ల వ్యవస్థను తమ పార్టీ ప్రయోజనాలకు వాడుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని చంద్రబాబు వాడుకున్నట్లుగా దేశంలో ఇంకెవరూ వాడుకుని ఉండరని విమర్శించారు. టీడీపీ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే సంక్షేమ పథకాలు అరకొరగా అందేవని గుర్తుచేశారు. సైకోలా పరిపాలించడంవల్లే 2019 ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు చెత్తబుట్టలో వేశారన్నారు.

**రైతులకు దన్నుగా సీఎం జగన్**

వైఎస్సార్ రైతుభరోసా ద్వారా పెట్టుబడి, రాయితీపై నాణ్యమైన విత్తనాలు అందిస్తూ.. పంటల సాగులో సలహాలిస్తూ.. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు సీఎం వైఎస్ జగన్ దన్నుగా నిలుస్తున్నారని సజ్జల చెప్పారు. అందుకే రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని, కేంద్రం విడుదల చేసిన నివేదికే అందుకు నిదర్శనమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు మళ్లీ కలిసుండాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తే అంతకంటే కావాల్సింది ఏముందని మీడియా అడిగిన ప్రశ్నకు మాత్రమే తాను అలా సమాధానం చెప్పానని.. ఇందులో ఎలాంటి రాజకీయంలేదని స్పష్టంచేశారు. భూసర్వేపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం తగదని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఎక్కడైనా పోటీచేసే హక్కు ఉంటుందని ఇంకో ప్రశ్నకు సమాధానంగా సజ్జల చెప్పారు. తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని.. ప్రజలతోనే తమ పార్టీకి పొత్తు అని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని.. కర్ణాటక, తమిళనాడులో తెలుగు ప్రజలున్న ప్రాంతాల్లో తాము పోటీచేసే ప్రశ్నే ఉత్పన్నం కాదని తేల్చిచెప్పారు. అలా పోటీచేయాలనుకుంటే తెలంగాణలోనే చేసేవాళ్లం కాదా.. అని అన్నారు. 65 సీన్లతో కూడిన సినిమా తరహాలోనే పవన్‌కళ్యాణ్ రాజకీయం చేస్తున్నారని మరో ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

## న్యాయవాదులు విధులను బహిష్కరించడం కోర్టు ధిక్కారమే

- అలాంటి వారిపై ధిక్కరణ చర్యలు
- హైకోర్టు ధర్మాసనం హెచ్చరిక



**సాక్షి, అమరావతి:** న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించడం కోర్టు ధిక్కారమేనని హైకోర్టు తేల్చిచెప్పింది. కోర్టు విధుల బహిష్కరణ సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధమని స్పష్టంచేసింది. కోర్టు విధులను బహిష్కరించే వారిపై ధిక్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గుంటూరు కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరిస్తున్నారని, దీని వల్ల కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని న్యాయవాది ఎం.సాంబిరెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలుచేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కోర్టులో విధులను బహిష్కరిస్తున్న న్యాయవాదులను ఉద్దేశించి ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆ న్యాయవాదులపై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టేలా జిల్లా ప్రిన్సిపల్ జడ్జిని ఆదేశిస్తామని హెచ్చరించింది. కోర్టు విధులను బహిష్కరించబోమంటూ వచ్చే నెల మొదటి వారంలో తీర్మానం చేస్తామని గుంటూరు కోర్టు న్యాయవాదుల సంఘం తరఫు న్యాయవాది చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను జనవరి 18కి వాయిదా వేసింది.



ఆధ్యాత్మికం అంటే ప్రపంచంలోని అందానికి, ఆనందానికి కళ్లు తెరవడం. పిపీలికం నుంచి ఆకాశం వరకూ ఆనందంతో నింపుకోగల శక్తినివ్వడం.

– చలం



సాక్షి

మంగళవారం, డిసెంబర్, 13

# ఆకాశంలో సగమెక్కడ?

మాటలు కోటలు దాటుతున్నా... చేతలు గడప దాటడం లేదనడానికి ఇది అత్యుత్తమ ఉదాహరణ. మహిళా సాధికారికత, స్త్రీ–పురుష సమానత్వం గురించి గొప్పలు చెప్పే మన ప్రజాస్వామ్య దేశంలో శాసన నిర్మాణ వ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యం ఇప్పటికీ అతి తక్కువగానే ఉంది. పార్లమెంట్ శీతకాల సమావేశాల సాక్షిగా ఇది మరోసారి వెల్లడైంది. మన పార్లమెంట్ ఉభయ సభల్లో మహిళా ఎంపీల వాటా 15 శాతం లోపలే. ఇక, దేశవ్యాప్తంగా రాష్ట్రాల శాసనసభల్లో మహిళా ఎమ్మెల్యేల సగటు సంఖ్య 8 శాతమే. ఇటీవలి గుజరాత్, హిమాచల్ ఎన్నికల్లోనూ ఇదే కథ పునరావృతమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లును మరోసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై కేంద్ర సర్కార్ సమాధానం కోసం సుప్రీమ్ కోర్ట్ ఎదురుచూస్తున్న వేళ తాజా పరిణామాలు చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యంపై చర్చ రేపుతున్నాయి.

న్యాయశాఖ మంత్రి లోక్‌సభలో వెల్లడించిన గణాంకాలు రాజకీయ పార్టీల చిత్తశుద్ధి లేమిని కళ్ళకు కడుతున్నాయి. జనాభాలో సగం ఉన్న మహిళా లోకానికి చట్టసభల్లో 33 శాతం కనీస రిజర్వేషన్ల చట్టం చేయడానికి రాజకీయ నేతలు ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తూనే ఉన్నారు. నిజానికి, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తొలిసారిగా 1996లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. అనేక పరిణామాలు, అపరిమిత ఆలస్యం తర్వాత 2010లో బిల్లును రాజ్యసభ ఆమోదించింది. అయితే, నాటి 15వ లోక్‌సభ కాలపరిమితి తీరిపోవడంతో ఆ బిల్లు మురిగి పోయింది. కొత్తగా మళ్ళీ మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని ఇటీవల సైతం తృణమూల్ సహా పలు పార్టీలు ప్రభుత్వాన్ని కోరాయి. లైంగిక సమన్యాయానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతున్న ఢిల్లీ పెద్దలు పార్లమెంట్‌లో బిల్లు తేవడానికి మాత్రం పార్టీల మధ్య ఏకాభిప్రాయం కావాలనే సాకుతో తాత్సారం చేస్తున్నారు.

మహిళల అభ్యున్నతి, సంక్షేమం గురించి గొప్పగా చెప్పే మన రాజకీయ పక్షాలు వాస్తవంలో అందుకు తగ్గట్టుగా వ్యవహరించడం లేదనేది నిష్ఠురసత్యం. ఇటీవల గుజరాత్ అసెంబ్లీకి ఎన్నికైనవారిలో 8.2 శాతమే మహిళలు. ఇక, 68 మంది సభ్యుల హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క మహిళ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆ మాటకొస్తే ఆ రాష్ట్రంలోని మొత్తం 412 మంది నామినీల్లో కేవలం 24 మందే మహిళా అభ్యర్థులు. అంటే, బరిలోకి దిగిన స్త్రీలు 6 శాతమే. చదువులో, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లు, మహిళా పారిశ్రామికవేత్తలకు వడ్డీ లేని రుణాలు, చదువుకొనే ఆడపిల్లలకు ఉచితంగా సైకిళ్ళు – స్కూటర్లు, నెలవారీ భత్యం – ఇలా ఎన్నికల్లో వాగ్దానాల వర్షానికి అంతు లేదు. పార్టీల టికెట్ల పంపిణీలో మాత్రం మగాళ్ళకే పెద్ద పీట. బీజేపీ ఆరుగురు, ఆప్ అయిదుగురు, కాంగ్రెస్ ముగ్గురు స్త్రీలనే బరిలోకి దింపాయి. చిత్రంగా హిమాచల్‌లో ఓటేసినవారిలో పురుషుల కన్నా స్త్రీలే అధికం.

ఓటర్లలో దాదాపు సగం స్త్రీలే ఉన్న గుజరాత్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ బరిలో మహిళా అభ్యర్థులు 9 శాతమే. బీజేపీ 18 మందినీ, కాంగ్రెస్ 14 మందినీ పోటీలో పెట్టాయి. చివరకు గత అసెంబ్లీలో రికార్డు స్థాయిలో 17 మంది మహిళా ఎమ్మెల్యేలుంటే, తాజా అసెంబ్లీలో ఆ సంఖ్య 14కు పరిమితమైంది. ఈ ధోరణిని మార్చడానికి జరుగుతున్న కృషి అంతంత మాత్రమే. లోక్‌సభలో, శాసనసభల్లో మూడింట ఒక వంతు స్థానాలను స్త్రీలకే రిజర్వ్ చేయడానికి ఉద్దేశించినదే – 2008 నాటి 108వ రాజ్యాంగ సవరణ బిల్లు. ప్రధాన రాజకీయ పక్షాలన్నీ పైకి సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నాయి. తీరా సభలో ఆమోదానికొచ్చేసరికి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. బలహీన వర్గాలకూ, స్త్రీలకూ తగు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుంది. కానీ ప్రపంచ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాల్లో అతిపెద్దదైన భారత్‌లోనే పరిస్థితి తద్భిన్నంగా ఉండడం శోచనీయం.

స్త్రీ పురుషులిరువురూ సమానులే అన్నది రాజ్యాంగ అభిభాషణ. కానీ, భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలంటూ గుండెలు చరుచుకుంటున్న నాటికి కూడా అది వాస్తవంలోకి రాలేదన్నది విషాదం. దేశజనాభాలో సగం ఉన్నవారికి శాసన నిర్మాణంలో అతి తక్కువ స్థానమివ్వడం ఏ రకంగా సబబు? ప్రపంచ పటంపై ఏ రకంగా శోభస్కరం. 2022 మే లెక్కల ప్రకారం అమెరికా, ఐరోపా, సహారా ఎడారికి దక్షిణాన ఉండే సబ్–సహారా ఆఫ్రికా ప్రాంతంలో సైతం జాతీయ పార్లమెంటుల్లో మహిళా ప్రాతినిధ్యం ప్రపంచ సగటు (26.2 శాతం) కన్నా ఎక్కువే. చివరకు నేపాల్ (34 శాతం), బంగ్లాదేశ్ (21), పాకిస్తాన్ (20), భూటాన్ (17)లు సైతం మనకన్నా మెరుగ్గా ఉన్నాయి.

సైనికోద్యోగాల నుంచి ప్రపంచదేశాల ఆధిపత్యం దాకా అన్నిటా మహిళలు ముందున్న రోజుల్లో మన చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉందంటే తప్పు మనదే! సమాజంలో, రాజకీయాల్లో పాతుకుపోయిన పురుషాధిపత్యానికీ, లింగ దుర్విచక్షణకూ అది ప్రతీక. ఇప్పటికీ రిజర్వేషన్ల బిల్లు తేవడానికీ, చట్టం చేయడానికీ ఏకాభిప్రాయమంటూ ఏళ్ళూపూళ్ళూ చేయడం సరికాదు. అసలంటూ మహిళా సాధికారికత పట్ల అంకితభావం ఉంటే, దానికి చట్టం కోసం చూడాల్సిన పనీ లేదు. మనసుంటే మార్గాలెన్నో! పార్టీలన్నీ పెద్ద సంఖ్యలో మహిళలకు టికెట్లిచ్చి, చట్టసభలకు ఎన్నికల బరిలో దింపితే కాదన్నది ఎవరు? ఇన్నేళ్ళలో ఇప్పటికి దేశంలో రెండోసారి ఓ మహిళ రాష్ట్రపతి పీఠాన్ని అధిష్ఠించారు. ఆకాశంలో సగమంటూ మాటల్లో మనం కీర్తిస్తున్న ఆడవారికి చట్టసభల్లోనూ సముచిత ప్రాధాన్యం ఇవ్వడానికి ఇంతకు మించిన సమయం, సందర్భం మరొకటి ఉండదేమో!

# దేశభక్తి అంటే తిరంగా సెల్ఫీ కాదు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**శాసన వేదికల్లో బిల్లుల్ని కృత్రిమంగా ఆపే సంస్కృతిని కేంద్ర పాలకులు ప్రవేశపెట్టారు. అందుకే 'ధిక్కార స్వరంతో వ్యవహరించే పాలకులున్న చోట రాజ్యాంగ చట్ట నిబంధనలను తు.చ. తప్పకుండా అమలు జరిపించడంలో సుప్రీంకోర్టు నిజమైన రాజ్యాంగ రక్షకురాలిగా వ్యవహరించాల్సి ఉంటుంది' అని భారత్ లా కమిషన్ అధ్యక్షుడు ఎ.పి. షా స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణా శక్తిగా ఉండవలసినవాళ్లు ఆ బాధ్యత నుంచి తప్పుకోబట్టే దేశంలో పౌర హక్కులకు రక్షణ లేకుండా పోయింది. అందుకే 'దేశభక్తి అంటే– తిరంగా సెల్ఫీ కాదు, తరాలుగా కూలబడిన పిట్టలకు రెక్క విదిల్చే తెగువనివ్వడం!'**

ఇటీవలనే గుజరాత్‌లో ముగిసిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయానికి రకరకాల కారణాలను ఊహించుకుంటున్న దశలో అనుకోని చిత్రమైన 'విశేషాలు' వెల్లడయ్యాయి. గుజరాత్ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ 'ఆమ్ ఆద్మీ' పార్టీ రంగంలోకి దిగింది. బీజేపీని గెలిపించడానికే పరోక్షంగా పనిచేసిందని కొందరు ఊహిస్తే... కాదు గుజరాత్‌లో కూడా 'ఆమ్ ఆద్మీ' పార్టీ ఉనికిని చాటుకోవడం ద్వారా అఖిల భారత స్థాయిలో తన ఓటు బ్యాంకుని పెంచుకొని జాతీయ స్థాయి రాజకీయ పక్షంగా నిలబడుతుందనీ, ఇది గొప్ప పరిణామమనీ మరికొందరు భావించారు. దీనికి తోడు అటు కాంగ్రెస్ పాలనలో మాదిరే ఇటు బీజేపీ–ఆరెస్సెస్ ఉమ్మడి పాలనలో కూడా తమకు అనుకూలమైన కేంద్ర ఎన్నికల కమిషన్‌లను, కమిషనర్‌లను నియమించుకోవడం దేశ ప్రజలకు అనుభవమే!

ఎందుకంటే, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ ఘడియ ఆఖరిదశ డిసెంబర్ 5న సాయంత్రం 5 గంటలకు ముగిసినప్పుడు 93 నియోజక వర్గాలలో 58.8 శాతం ఓటింగ్ నమోదు అయింది. కానీ ఆ ఓటింగ్ శాతాన్ని మరుసటి రోజు ఎలక్షన్ కమిషన్ 65.3 శాతంగా సవరించింది. మొదటి దశలో నమోదైన ఓటింగ్‌ను ముందు 60.11 శాతంగా చూపించి, తర్వాత దాన్ని 63.14 శాతంగా సవరించారు. అంటే, 2017 ఎన్నికల్లో నమోదైన ఓటింగ్ కన్నా, 2022 ఎన్నికల్లో నాలుగు శాతంపైగా ఓట్లు తగ్గిపోయాయి. కేజ్రీవాల్ 'ఆమ్ ఆద్మీ' పార్టీ కొత్తగా గుజరాత్‌లో రంగంలోకి దిగినందువల్ల ప్రత్యేకించి అది బీజేపీకి పరోక్షంగా సాయపడిందీ లేదు. పైగా తన సత్తాను ఉన్నంతలోనే 'ఆమ్ ఆద్మీ' ఆచరణలో రుజువు చేసుకొంది కూడా!

కాగా, క్రమానుగతంగా బీజేపీ–ఆరెస్సెస్ పాలకుల కనుసన్నల్లో గత ఎనిమిది తొమ్మిదేళ్లుగా దేశంలో జరిగిందని చెప్పుకొంటున్న 'ప్రగతి' ఫలితాలన్నీ – ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశ ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాన్ని పూర్తిగా తారుమారు చేయడం. సంపూర్ణ ప్రైవేటీకరణ దిశగా మరలడం. బహుశా ఈ పరిణామాల దృష్ట్యానే భారత్ లా కమిషన్ అధ్యక్షుడు, ఢిల్లీ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎ.పి. షా ఇలా వ్యాఖ్యానించారు: ''దేశంలో, రాష్ట్రాలలో అధికార బలం చూసుకుని వ్యవహరించే పాలక వర్గాలున్న చోట దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు భారత రాజ్యాంగ మౌలిక ప్రయోజనాల సంరక్షక శక్తిగా వ్యవహరించాల్సి ఉంటుంది.'' ఈ హెచ్చరిక ఎప్పటికీ శిరోధార్యం కావాలి. మూడు రాజధానుల నిర్మాణం ద్వారా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి అవకాశం ఉంటుందని భావించి ఆ ప్రయత్నాలలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలను వెనక్కి కొట్టేందుకు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకించింది. 'హైకోర్టే ప్రభుత్వమైతే, ఇంక ప్రజలెన్నుకున్న మంత్రివర్గం దేనికి? ప్రజా ప్రతినిధులెందుకు?' అని ప్రశ్నించింది. 'ఫలానా ప్రాంతంలోనే రాజధాని ఉండాలని ఆదేశించే అధికారం' కోర్టులకు లేదనీ స్పష్టం చేయవలసి వచ్చింది.

రెండో మాట



అంతేగాదు, కొంతమంది జడ్జీలను హైకోర్టు, సుప్రీంకోర్టులకు ప్రమోట్ చేస్తూ నూతన సుప్రీం ధర్మాసనం చేసిన (నవంబర్ 28) ప్రతిపాదనను పాలకవర్గం అమలు చేయకుండా తొక్కి పట్టినందుకు సుప్రీంకోర్టు ఆగ్రహం ప్రకటించవలసి వచ్చింది. ఇటీవల హైకోర్టులలో నియామకానికి సుప్రీం ధర్మాసనం ప్రతిపాదించిన 20 మంది జడ్జీల పేర్లను పునఃపరిశీలించాలని బీజేపీ పాలకులు ఒత్తిడి చేయడాన్ని సుప్రీంకోర్టు నిరసించిందని మరచిపోరాదు.

అంతేగాదు, శాసన వేదికల్లో బిల్లుల్ని కృత్రిమంగా ఆపే సంస్కృతిని కూడా బీజేపీ పాలకులు ప్రవేశపెట్టారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ భారత తొలి రాష్ట్రపతిగా పదవీ స్వీకారం చేసిన తర్వాత, ఇవాళ్టి లాగా ఎన్నడూ తమకు అనుకూలంగా లేని బిల్లుల్ని కృత్రిమంగా తొక్కిపట్టడానికి గానీ, తాను నియమించిన గవర్నర్లు అలాంటి పనులకు పాల్పడటానికి గానీ అనుమతించలేదు. భారత లౌకిక రాజ్యాంగ నిబంధనలను తు.చ. తప్పక పాటించి తీరాలనీ, కారణాలు చూపకుండా బిల్లుల్ని తమ వద్దే పాలక వర్గాలు ఉంచుకొని సభాధికారాన్ని ధిక్కరించరాదనీ సుప్రీం మాజీ న్యాయమూర్తి, నేషనల్ లా కమిషన్ మాజీ అధ్యక్షులు జస్టిస్ జీవన్ రెడ్డి పదే పదే మొత్తుకొంటూ వచ్చారు.

అంతేగాదు, చివరికి స్వతంత్ర నిర్ణయాలు చేసుకొని రాజకీయ జోక్యానికి దూరంగా నిర్ణయాలను అమలు జరపాల్సిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌లోకి కూడా పాలకులు తలదూర్చే స్థితి వచ్చింది. అందుకనే లా కమిషన్ మాజీ అధ్యక్షుడు జస్టిస్ ఎ.పి. షా అనుభవం మీద 'ధిక్కార స్వరంతో వ్యవహరించే పాలకులున్న చోట రాజ్యాంగ చట్ట నిబంధనలను తు.చ. తప్పకుండా అమలు జరిపించడంలో సుప్రీంకోర్టు నిజమైన రాజ్యాంగ రక్షకురాలిగా వ్యవహరించాల్సి ఉంటుంది' అని స్పష్టం చేయాల్సి వచ్చింది. రాజ్యాంగ పరిరక్షణా శక్తిగా ఉండవలసిన పాలకులు ఆ బాధ్యత నుంచి తప్పుకొని సొంత అజెండాలతో పాలన వెలగ బెడుతూండబట్టే దేశంలో పౌర హక్కులకు రక్షణ లేకుండా పోయింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని పౌర హక్కులకు రాబోతున్న ప్రమాదం గురించి హెచ్చరిక చేసినా, పాలకులకు 'చీమ కుట్టలేదు'! జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జె.ఎస్. వర్మ లాగా నేటి చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నిర్ణయాలలో తన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ దేశ ప్రజలకు ఆశావహమైన నిర్ణయాలతో అకుంఠితంగా ముందుకు సాగడం పాలకులకు 'గొంతులో వెలక్కాయ పడిన'ట్టుగా ఉంది.

పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణకు ఇచ్చిన హామీని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 'మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం లేదా వీటిలో మరే వివక్షతోనూ దేశ పౌరులను వేరుచేసి చూడటం నేరం' అని స్పష్టంగా ప్రకటించారు. అయినా కుల, మత జాడ్యాలకు కళ్లెం పడకపోవడానికి కారణం భారత పార్లమెంటులో 'సవర్ణ హిందువుల' సంఖ్య పెరగడమేనని అంబేడ్కర్ వివరించారు. సుప్రసిద్ధ పార్లమెంటేరియన్ మహావీర్ త్యాగి ఒక సందర్భంలో రాజ్యాంగ ముసాయిదా కమిటీకి ఒక సవాలు విసిరారు: ''రాజ్యాంగం గ్యారంటీ ఇచ్చిన పౌర ప్రాథమిక హక్కులలో భాగంగా, ఆ హక్కులకు విరుద్ధంగా ప్రవర్తించే ప్రభుత్వాలను పడగొట్టే హక్కును కూడా అనుమతిస్తారా, లేదా? అలాంటి హక్కును మీరు కల్పించినట్టు లేదు. ప్రభుత్వ హక్కుల్ని మాత్రమే గుర్తించడంతో సరిపోదు, అదే మోతాదులో ప్రజల హక్కుల్ని గుర్తించాలి'' అన్నారు మహావీర్ త్యాగి! ఈ ప్రతిపాదనతో అంగీకరిస్తూ అంబేడ్కర్ ఇలా స్పష్టం చేశారు: ''రాజకీయ పదవులు లేదా మరొక పద్ధతుల్లో ప్రలోభాలు సభ్యులకు కట్టబెట్టడం ద్వారా ప్రయోజనం లేదు. ఈ రకమైన ప్రలోభాలకు మొత్తం పార్లమెంట్ సభ్యుల్ని అలవాటు చేశామంటే పార్లమెంట్ స్వతంత్ర ప్రతిపత్తే నాశనమౌతుంది. వందిమాగధులకు వత్తాసు పెరిగి సంస్థ నాశనమవుతుంది. పార్లమెంట్‌ను మరొక స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా, బ్రోకర్ల సంస్థగా మార్చకూడదు'' అన్నారు. బహుశా ఇలాంటి అనుభవాలను చవిచూసిన తర్వాతనే కాబోలు కవి కంచరాన భుజంగరావు ఇలా ఆక్రోశించి ఉంటారు:

''అర్ధరాత్రి సంకెళ్లు తెగిన జాతికి/ సూర్యోదయం ఒక సహజమైన ఆశ/ తెల్లవారడం ఒక అనంతమైన భరోసా/... దొరల బూట్లలో కాలు పెట్టినప్పుడే/ అభివృద్ధి నడక ఎక్కడో తప్పటడుగులు వేసింది/ కొండల్ని మేరువులుగా బలిపించి/ కూసుల్ని కురచబార్చింది/ ఇప్పుడు చూడండి/ కేవలం రెండొందల మర్రి చెట్ల (మహాకోటీశ్వర్లు) నీడ దేశాన్ని కమ్మేసింది/ ఎదుగూ బొదుగూ లేని బీదల నేల/ వాడల్లోకి మురికివాడల్లోకి మునగ దీసుకుంది/ నేడు పెట్టుబడి ఒక్కటే వీసా లేకుండా దేశాలు తిరిగేస్తోంది/ ఈ గడ్డమీద పెట్టుబడికి ఉన్నంత స్వేచ్ఛ/ వేరెవరికైనా ఉందంటారా?/ ఇప్పుడిక దేశభక్తి అంటే – తిరంగా సెల్ఫీ కాదు సామీ/ రెక్కల మీది వివక్ష బరువుతో/ తరాలుగా కూలబడిన పిట్టలకు/ రెక్క విదిల్చే తెగువనివ్వడం/ రెండు గుండెల వాళ్ల కపటత్వాన్ని ఎదురొడ్డి/ ఉన్న ఒక్క గుండెను స్వేచ్ఛాకాశం కోసం/ ప్రజా పతాకను చేసి ఎగరేయడం!

abkprasad2006@yahoo.co.in

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### అదే చేస్తారు!



పాకిస్తాన్‌కు కేవలం కశ్మీర్ కావాలి. దానికి కశ్మీరీలు అక్కర్లేదు. వాళ్లకు కశ్మీర్ దక్కితే (లక్ష సంవత్సరాల్లో కూడా దక్కదు కాక పోతే) గనక దాన్ని సింపుల్‌గా డీహెచ్‌ఏ (డిఫెన్స్ హౌజింగ్ అథారిటీ)గా మార్చేస్తారు. జనరల్స్ అందరూ కార్నర్ ప్లాట్లు తీసుకుంటారు.

– గౌరవ్ ఆర్య, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

### ఖండనార్హం



చమన్ వద్ద అఫ్గాన్ సరిహద్దు బలగాల అకారణ కాల్పులు, గుళ్ల వర్షం ఫలితంగా చాలామంది పాకిస్తానీ పౌరులు అమరులయ్యారు. డజన్ల కొద్దీ గాయపడ్డారు. ఇది దురదృష్టకరం. అత్యంత తీవ్రమైన ఖండనకు ఇది అర్హమైనది. అఫ్గాన్ మధ్యంతర ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– షెహబాజ్ షరీఫ్, పాకిస్తాన్ ప్రధానమంత్రి

### చిన్నారిని కష్టపెట్టొద్దు



మీ భాగస్వామిని 'సరిచేసు కోవడానికి/ సంస్కరించుకోవడానికి' పిల్లల్ని కనమని మీకు ఒకవేళ మీ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, కుటుంబ స్నేహితులు చెబితే– ఒక పేరెంట్‌గా ఏ అర్హతా లేని మనిషి ఉన్న ప్రపంచంలోకి మీరు మీ చిన్నారిని తెస్తున్నట్టు! ఒక చిన్నారి కష్టాలు పడాల్సిన అవసరం లేదు. ప్రపంచం ఎట్లాగూ కుళ్లిపోయింది, ఇల్లు కూడా అలాగే ఉండకూడదు.

– చిన్మయి శ్రీపాద, గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్

### దళపతికి శుభాకాంక్షలు



'చిట్టి' కావొచ్చు, లేదా 'శివాజీ: ద బాస్' కావొచ్చు, నటనలో నిజమైన 'దళపతి'కి 'హమ్(మేము)' ఫ్యాన్! వన్ అండ్ ఓన్లీ రజినీకాంత్ సర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ ఏడాదంతా మీరు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా.

– సచిన్ టెండూల్కర్, క్రికెటర్

### తగ్గించితే మంచిది



'స్థూలకాయాన్ని కూడా 'బాడీ పాజిటివిటీ' అని ప్రమోట్ చేయడం మానవత్వానికి వ్యతిరేకంగా చేసే నేరం.

– లయాహ్ హెలిపెర్న్, రచయిత్రి

# మణిరత్నాలు ఈ పుస్తకాలు

సందర్భం



దుర్గమ్ భైతి

ఆడుతూ పాడుతూ కాలం గడిపే పిల్లలను అందమైన ఊహా లోకంలోనికి తీసుకెళ్ళేవి కథలు. కథలు వినడమన్నా, చదవడమన్నా పిల్లలకు చాలా ఇష్టం. భావి భారతాన్ని అందంగా ఆవిష్కరించేది బాల సాహిత్యం. నేటి పిల్లలలో నైతికత, సామాజిక భావం, మానవత్వం, సహృదయత, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ వంటి సుగుణ లక్షణాలు అలవడాలంటే, వారి కల్మషం లేని మనసులను సాహిత్యం వైపునకు మరల్చాలి. అందుకు సరైన వేదిక బాల సాహిత్యం.

పాఠ్యపుస్తకాలు పిల్లలకు విజ్ఞానాన్ని అందిస్తే, కథల పుస్తకాలు వారిలో ఉన్న సృజనాత్మక అంశాలను, జీవన నైపుణ్యాలను అందిస్తాయి. సాహిత్యం ద్వారానే బాలలలో సంపూర్ణ వికాసం కలుగుతుంద ని వారికోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడంలో సదా ముందుంటారు మణికొండ వేద కుమార్. వీరు 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి' ఛైర్మన్‌గా ఉంటూ, దాదాపు మూడు దశాబ్దాలుగా బాల వికాసం కోసం పనిచేస్తున్నారు. 'బాల చెలిమి' పత్రిక, 'బాల చెలిమి' గ్రంథాలయాలు, నెల నెలా 'బాల చెలిమి ముచ్చట్లు' నిర్వహిస్తూ బాల సాహిత్యానికి ఎనలేని సేవ చేస్తున్నారు. తమ అకాడమీ ద్వారా పిల్లలు రాసిన అనేక పుస్తకాలను ముద్రించి, వారి రచనలు వెలుగులోకి తెస్తున్నారు.



వేదకుమార్ సంకల్పానికి, బాల సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, పత్తిపాక మోహన్ తోడయ్యారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బడి పిల్లలు రాసిన కథలను సేక రించారు. గరిపెల్లి అశోక్ రాష్ట్ర కన్వీనర్‌గా ఉంటూ, వివిధ జిల్లాల్లోని కన్వీనర్లను సమన్వయపరుస్తూ, ఉపాధ్యాయుల ద్వారా పిల్లలు రాసిన కథలను సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 900 కథలు రాగా, కథల కార్యశాలలో పాల్గొన్న నిష్ణాతులైన బాల సాహితీవేత్తలు పలుమార్లు కథలను పరిశీలించి తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల వారీగా ప్రచురణ కొరకు కథల్ని ఎంపిక చేశారు.

2020 జనవరి 29న హైదరాబాద్‌లో పది జిల్లాల బడిపిల్లల కథలను బాలల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. అలాగే పిల్లల కోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన 'పెద్దలు రాసిన పిల్లల కథలు' ఉమ్మడి పది జిల్లాల పేరుతో పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించడమనేది బాల సాహిత్యంలో చరిత్రాత్మక ఘట్టం. ఈ బాల సాహిత్య యాగం తెలంగాణకే పరిమితం కాకూడదని ఆంధ్రప్రదేశ్‌లోని బడి పిల్లల నుండీ కథల సేకరణ ప్రారంభించడం ముదావహం.

వ్యాసకర్త ఉపాధ్యాయులు, సిద్దిపేట

# జీ20 అభివృద్ధికి మన స్టార్టప్ మార్గదర్శనం

సందర్భం



డా॥ చింతన్ వైష్ణవ్

ఆవిష్కరణ–ఆధారిత ఆర్థిక పునరుద్ధరణ, పునర్నిర్మాణం, వృద్ధికి స్టార్టప్‌లు ఇంజిన్‌గా మారాయి. ప్రతి దేశంలో పెరుగుతున్న అవసరాలు, భవిష్యత్తు విలువ ఆధారిత పంపిణీ నిర్మాణంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 90 ట్రిలియన్ల డాలర్లుగా ఉంది. దీనిలో స్టార్టప్ ఆర్థిక వ్యవస్థ విలువ దాదాపు 3 ట్రిలియన్ల డాలర్ల వరకు ఉంది. స్టార్టప్ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది.

ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. వేగంగా మారుతున్న పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడానికి వినూత్న ఆవిష్కరణలు సహకరిస్తాయి. పరిస్థితులకు తగిన ఆవిష్కరణలను అందించగల సామర్థ్యం కేవలం స్టార్టప్‌లకు మాత్రమే ఉంది. కోవిడ్ మహమ్మారి సమయంలో స్టార్టప్‌ల ప్రాధాన్యం, సామర్థ్యం స్పష్టంగా వెలుగులోకి వచ్చాయి. స్టార్టప్‌ల పాత్ర ప్రాణాలను రక్షించడంలో మాత్రమే కాకుండా తిరిగి ఆర్థిక చైతన్యం సాధించడానికి ఉపయోగపడింది. సుస్థిర ఆర్థిక లక్ష్యాల సాధనలో ఆర్థిక వ్యవస్థలకు స్టార్టప్‌లు సహాయం చేస్తున్నాయి. దేశాలతో సంబంధం లేకుండా సహకారం, ఆవిష్కరణల రంగంలో స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. దేశాల మధ్య సహకారం, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్టార్టప్‌లు వేదికలనూ, సాధనాలనూ అందిస్తున్నాయి. ఉద్యోగాల కల్పన, సాంకేతిక పురోగతి, దీర్ఘకాలిక వృద్ధి, సంక్షోభ నిర్వహణ పరంగా స్టార్టప్‌లు ప్రపంచవ్యాప్తంగా కీలక పాత్ర పోషించనున్నాయి.

స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ ఏర్పాటుకు 'జీ20'కి అధ్యక్షత వహిస్తున్న భారతదేశం చొరవ తీసుకుంది. స్టార్టప్‌లకు సహకారం అందించడం, స్టార్టప్‌లు, కార్పొరేట్లు, పెట్టుబడిదారులు, ఇన్నోవేషన్ ఏజెన్సీలు, ఇతర కీలక పర్యావరణ వ్యవస్థ వాటాదారుల మధ్య సహకారం పెంపొందించడానికి స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ కృషి చేస్తుంది. భారతదేశ స్టార్టప్ రంగంలో నేడు 107 యునికార్న్‌లు, 83,000 కంటే ఎక్కువ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. వీటి అభివృద్ధికి అవసరమైన ఆవిష్కరణ రంగం సమర్థంగా పనిచేస్తోంది. భారతదేశ స్టార్టప్ రంగం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ రంగంగా గుర్తింపు పొందింది.

కొత్తగా ప్రారంభించిన స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ ద్వారా జీ20 దేశాలలో వ్యూహాత్మక సహకారం ద్వారా వినూత్న స్టార్టప్‌లకు సహకారం అందించి ప్రపంచంలో సమగ్ర స్టార్టప్ వ్యవస్థ అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని భారతదేశం ఆకాంక్షిస్తోంది. జీ20లో సభ్యత్వం ఉన్న ప్రతి దేశం అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పనకు స్వయంగా చర్యలు అమలు చేస్తోంది. స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ అన్ని సభ్య దేశాలతో కలిసి ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం ఉన్న రంగాల్లో సభ్య దేశాల మధ్య సహకారం, సమన్వయం సాధించి ఆర్థిక సహకారానికి అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తుంది.



ప్రారంభ సంవత్సరంలో అమలు చేయాల్సిన మూడు ప్రాధాన్యతా అంశాలను ఎంగేజ్‌మెంట్ గ్రూప్ గుర్తించింది:

**1. పునాదులు, కూటముల ఏర్పాటు :** జీ20 ఆర్థిక వ్యవస్థల అంతటా స్టార్టప్‌లకు బహుళ నిర్వచనాలు ఉన్నాయి. మొదటి ప్రాధాన్యతా అంశంగా ఏకాభిప్రాయం ద్వారా స్టార్టప్ అంటే ఏమిటి అనే అంశానికి స్పష్టత నివ్వాలనీ, దీనికి సంబంధించిన పదజాలం రూపొందించాలనీ ఎంగేజ్‌మెంట్ గ్రూప్ గుర్తించింది. స్టార్టప్‌ల కోసం హ్యాండ్ బుక్‌ను సిద్ధం చేయడానికి ఏకాభిప్రాయ ఆధారిత నిర్వచనాలు, పదజాలం అంచనా వేయబడతాయి. అంతేకాకుండా, జీ20 ఆర్థిక వ్యవస్థల్లో స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ వాటాదారుల మధ్య ప్రపంచ సహకారం పెంపొందించడానికి వ్యవస్థను రూపొందించడం, దేశాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడం తన మొదటి లక్ష్యంగా స్టార్టప్– 20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ పెట్టుకుంది.

**2. ఆర్థిక అంశాలు:** ఆర్థిక అంశాలను రెండవ ప్రాధాన్యతా రంగంగా స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ గుర్తించింది. స్టార్టప్‌లకు సులువుగా నిధులు అందేలా చేయడం, సహకారం అందించడం, నూతన అవకాశాలు గుర్తించడం లాంటి అంశాలకు రెండవ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.

**3. సమగ్ర, సుస్థిర అభివృద్ధి:** కీలకమైన ఎస్డీజీ (సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు) వ్యత్యాసాలను తగ్గించి వేగంగా అభివృద్ధి సాధించడానికి అవసరమయ్యే పరిస్థితులు కల్పించే అంశాన్ని స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ మూడవ ప్రాధాన్యతా రంగంగా గుర్తించింది. దీనిలో భాగంగా ఒకే విధమైన ప్రయోజనాల కోసం వివిధ దేశాల్లో పనిచేస్తున్న సంస్థల మధ్య సమన్వయం (మహిళా పారిశ్రామికవేత్తలు లాంటివి) సాధించే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. జీ20 దేశాల్లో స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్న తన లక్ష్యాన్ని సాధించడానికి స్టార్టప్–20 కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. స్టార్టప్ 20 దీనిలో భాగంగా 6 కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రారంభ కార్యక్రమం 2023 జనవరి 28న (హైదరాబాద్) జరుగుతుంది. శిఖరాగ్ర సదస్సు 2023 జూలై 3న (గురుగ్రామ్‌లో) జరుగుతుంది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో కూడా కార్యక్రమాలు జరుగుతాయి. అదనంగా, భారతదేశ స్టార్టప్ రంగం సాధించిన అభివృద్ధిని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకొని రావడానికి భారీ స్టార్టప్ షోకేస్ నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉంది.

జీ20 సభ్య దేశాలు ఆమోదించి అంగీకరించే విధాన ప్రకటనను స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ సిద్ధం చేసి అందజేస్తుంది. చర్చల ద్వారా మార్గదర్శకాలు, ఉత్తమ విధానాలు, వ్యవస్థలు, ముఖ్యమైన తీర్మానాల లాంటి అంశాలకు సంబంధించి స్టార్టప్–20 ప్రచురణలు తీసుకు వస్తుంది. స్టార్టప్ రంగ అభివృద్ధికి దోహదపడే విధంగా 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన భారతదేశ పరిశీలనలో ఉంది. అభివృద్ధి, సమన్వయ కార్యక్రమాలకు 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' వేదికగా పనిచేస్తుంది.

జీ20 అధ్యక్ష హోదాలో భారతదేశం ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు అనే స్ఫూర్తిని ప్రపంచానికి అందించాలని భావిస్తోంది. అదే స్ఫూర్తితో, స్టార్టప్ 20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ స్టార్టప్‌లకు సహకారం అందించి అన్ని దేశాల మధ్య సమన్వయం సాధించడానికి కృషి చేస్తుంది. విభిన్న భాగస్వామ్యం ద్వారా అందరి భవిష్యత్తులో స్టార్టప్‌ను ఒక భాగంగా చేయడానికి ప్రపంచ దృక్పథంతో పనిచేయాలని స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ ఆకాంక్షిస్తోంది.

వ్యాసకర్త మిషన్ డైరెక్టర్, అటల్ ఇన్నోవేషన్ మిషన్; స్టార్టప్–20 అధ్యక్షుడు

**గ్రహం అనుగ్రహం**

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పంచమి సా.5.47 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** ఆశ్లేష రా.11.53 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.11.31 నుండి 1.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.21 వరకు, తదుపరి రా.10.35 నుండి 11.27 వరకు, **అమృతఘడియలు:** రా.10.05 నుండి 11.51 వరకు : **రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు : **యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు : **సూర్యోదయం** 6.25 : **సూర్యాస్తమయం** 5.24.

## రేపు రాష్ట్ర ఖోఖో జట్టు ఎంపిక

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా ఐదవ యూత్ గేమ్స్–2022కు ఆంధ్రప్రదేశ్ ఖోఖో బాలుర జట్టును బుధవారం ఎంపిక చేయనున్నట్టు శాప్ ఎండీ ప్రభాకరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ఉంటాయని, క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్, టెన్త్, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. 01.01.2004వ తేదీన లేదా ఆ తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

## పదో తరగతి నకిలీ సర్టిఫికెట్ల దందా గుట్టురట్టు

- విజయవాడలోని అన్నామలై వర్సిటీ ఉద్యోగులదే కీలకపాత్ర
- బాధితులు ఒక్కొక్కరినుంచి రూ.2 లక్షలు వసూలు

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పదో తరగతి నకిలీ సర్టిఫికెట్ల దందా తాజాగా వెలుగులోకొచ్చింది. నగరంలోని పీడబ్ల్యూడీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న అన్నామలై యూనివర్సిటీ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా ఈ బాగోతం గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తెలుగు రాష్ట్రాల్లో వేలాది మంది బాధితులు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. యూనివర్సిటీలో పనిచేసే ఉద్యోగులు ఈ నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరతీసినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లా దేవరకోట మండలం పెద్దకోటపాడు గ్రామానికి చెందిన బాధితులు కొక్కు హరిప్రసాద్, బోయ మద్దిలేటి, సుధాకర్, వీరేష్ విజయవాడ సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్న బాధితులకు కర్నూలు రాజాసింగ్‌సెంటర్‌లో నివాసం ఉండే జోళ్ల నాగార్జున పరిచయమయ్యాడు. పోస్టాఫీసులో ఉద్యోగాలు ఇప్పిస్తానని, దానికి పదో తరగతిలో 97, 98, 99 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్లు మార్కుల లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, టీసీలు తానే ఇప్పిస్తానని, మీరు స్కూల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని నమ్మబలికాడు. ఈ మాటలు నమ్మి నాగార్జునకు రెండు విడతలుగా రూ.2 లక్షలు చెల్లించారు. నగదు చెల్లించిన మూడు నెలల్లోనే భారత ప్రభుత్వం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్‌ఓఎస్) నుంచి పదో తరగతి తాజాగా ఉత్తీర్ణులైనట్లు సర్టిఫికెట్లు బాధితులకు జోళ్ల నాగార్జున అందజేశాడు. ఈ సర్టిఫికెట్లతో ఇటీవల పోస్టాఫీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. వెరిఫికేషన్‌లో సర్టిఫికెట్లు నకిలీవని నిర్ధారణ అయ్యాయి. దీంతో సర్టిఫికెట్లు ఇచ్చిన అన్నామలై యూనివర్సిటీ ఉద్యోగులను బాధితులు సంప్రదించారు. వారి నుంచి దురుసుగా సమాధానం రావడంతో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కాగా, నకిలీ సర్టిఫికెట్లను యూనివర్సిటీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు తయారు చేసినట్లు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని సూర్యారావుపేట సీఐ వి.జానకీరామయ్య తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో బాధితులు వేలల్లో ఉండొచ్చని భావిస్తున్నారు.

# రాష్ట్రంలో తొలి టెన్నిస్ అకాడమీ

- శాప్ ఆధ్వర్యంలో ఆధునిక వసతులతో గుంటూరు బీఆర్ స్టేడియంలో ఏర్పాటు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) రాష్ట్రంలోనే తొలి టెన్నిస్ అకాడమీని అందుబాటులోకి తెస్తోంది. క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రులూ ఉండేలా గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఆధునిక వసతులు, అంతర్జాతీయ స్థాయి కోచింగ్ సామర్థ్యంతో టెన్నిస్ అకాడమీని ఏర్పాటు చేసింది. దీనిని మంగళవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది.

**ప్రత్యేక శిక్షణకు ప్రణాళిక..**

గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారుల వరకు అకాడమీలో తక్కువ ఖర్చుతో శిక్షణ పొందేలా ప్రణాళికను రూపొందించింది. దేశ, విదేశాలకు చెందిన కోచ్‌ల సహకారంతో అకాడమీని నిర్వహించనుంది. రోజువారీ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు స్పెషల్ ట్రైనింగ్ కోసం వచ్చే వారికి శాప్ ప్రత్యేక ప్రణాళికను తయారు చేసింది. ప్రస్తుతం అకాడమీలో రెండు సింథటిక్ కోర్టులు అందుబాటులో ఉండగా వీటికి అదనంగా మరో నాలుగు 'క్లే' కోర్టులను తయారు చేస్తోంది. క్రీడాకారుల సౌలభ్యం కోసం ఫ్లడ్ లైట్లతో పాటు జిమ్, జిమ్నాస్టిక్స్, రన్నింగ్ ట్రాక్ సౌకర్యాలను ఏర్పాటు చేసింది.

**కోచ్‌లనూ తయారుచేసేలా..**

ఈ అకాడమీ ద్వారా ఉత్తమ క్రీడాకారులతో పాటు ఉత్తమ కోచ్‌లను కూడా శాప్ తయారుచేయనుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆరు వారాలు/ఆరు నెలల సర్టిఫికేషన్ కోర్సులు అందిస్తోంది. ఇది పూర్తి చేసిన వారికి స్పోర్ట్స్ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇటువంటి కోర్సులు చేయాలనుకునే వారికి నిర్ణీత వ్యవధిలో శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్హతతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్నవారికి శాప్ టెన్నిస్ కోచ్ ఫౌండేషన్ కోర్సు ద్వారా ట్రైనింగ్ ఇచ్చి.. అసిస్టెంట్ కోచ్‌లుగా ఉపాధి కల్పించనుంది.

**తక్కువ ఖర్చుతో అత్యుత్తమ శిక్షణ**

శాప్ దేశ చరిత్రలోనే తొలిసారిగా సొంతంగా స్పోర్ట్స్ లీగ్స్‌కు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఒక్క టెన్నిస్‌లోనే 39 టోర్నమెంట్లు నిర్వహించింది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా 1,100 మంది టెన్నిస్ క్రీడాకారులను రిజిస్టర్ చేశాం. క్రీడాకారుల అవసరాలను గుర్తించి తొలిసారిగా టెన్నిస్ అకాడమీని ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో ఇప్పటివరకు టెన్నిస్ కోచింగ్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు శాప్ ఏర్పాటు చేసిన అకాడమీ ద్వారా క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందుబాటులోకి రాబోతోంది. ఎక్కడెక్కడికో వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి తీసుకుంటున్న ట్రైనింగ్‌ను.. గుంటూరులోనే తక్కువ ఖర్చుతో అందిస్తాం.

– ఎస్.ప్రభాకరరెడ్డి, శాప్ ఎండీ

### శాప్ లీగ్స్‌ను వేగంగా పూర్తి చేయాలి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాప్ లీగ్స్ ఫేజ్–2 పోటీలను వేగంగా పూర్తి చేయాలని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎండీ ప్రభాకరరెడ్డి ఆదేశించారు. శాప్ లీగ్స్ నిర్వహణపై సోమవారం వారిద్దరూ.. కోచ్‌లు, అధికారులకు పలు సూచనలు చేశారు. 19 విభాగాల్లో క్రీడా పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. అనంతరం టోర్నీల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

## రూ.1,073 కోట్లతో రోడ్ల మరమ్మతులు

- పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ అమరనాథ్‌రెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్రంలో పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1,073 కోట్లు మంజూరు చేసినట్లు ఆ శాఖ చీఫ్ ఇంజినీర్ కె.అమరనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో ఆ నియోజకవర్గంలో రోడ్ల పనుల పురోగతి, సమస్యలపై సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మరమ్మతులకు గురైన పంచాయతీరాజ్ రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 1,843 రోడ్లకు సంబంధించి 4,365 కిలోమీటర్ల మేర మరమ్మతు చేయిస్తామని తెలిపారు. 275 ప్యాకేజీలుగా ఈ పనులను విభజించి కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు టెండర్ల ప్రక్రియ సాగుతోందన్నారు. 160 ప్యాకేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేశామని, ప్రస్తుతానికి రూ.30.2 కోట్ల పనులు పూర్తి చేయించామని వివరించారు.



## హైకోర్టు అధికారులు, సిబ్బందిపై
# ధిక్కార వ్యాజ్యం మూసివేత

- సిబ్బంది కొరత, పని భారాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు
- కోర్టు ఆదేశాల అమలు విషయంలో ఇకపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక
- న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ తీర్పు

సాక్షి, అమరావతి: కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్) ఆలపాటి గిరిధర్, మరో రిజిస్ట్రార్ ఎన్.మురళీధర్‌రావులతో పాటు కొందరు సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, డిప్యూటీ సెక్షన్ ఆఫీసర్, ఎగ్జామినర్, అసిస్టెంట్లుగా పనిచేస్తున్న సిబ్బందిపై సుమోటోగా నమోదు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని హైకోర్టు సోమవారం మూసివేసింది. ప్రస్తుతం హైకోర్టులో తగినంత సిబ్బంది లేకపోవడం, ఉన్న సిబ్బంది తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ ఆ అధికారులు, సిబ్బంది పట్ల ఉదార వైఖరితో వ్యవహరిస్తున్నట్టు హైకోర్టు స్పష్టం చేసింది. ఆ అధికారుల బేషరతు క్షమాపణలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, భవిష్యత్‌లో కోర్టు ఆదేశాలను అమలు చేసే విషయంలో మరింత జాగ్రత్తతో, నిజమైన స్ఫూర్తితో వ్యవహరించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం తీర్పు వెలువరించారు.

**ప్రతివాదులకు నోటీసులు పంపకపోవడంతో..**

ఓ ఉద్యోగికి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా పదోన్నతి ఇచ్చే విషయంలో హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడం లేదంటూ కమిషనర్ ఆఫ్ సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్‌పై కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ప్రతివాదిగా ఉన్న సిద్ధార్థజైన్‌కు నోటీసు జారీ చేస్తూ.. 2020 నవంబర్ 30న ఉత్తర్వులు జారీ చేశారు. మరికొన్ని ధిక్కార వ్యాజ్యాల్లో కూడా ఇలానే ప్రతివాదులకు ధిక్కార నోటీసులు జారీ చేశారు. అయితే రిజిస్ట్రీ మాత్రం ప్రతివాదులకు నోటీసులు పంపలేదు. దీనిని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి హైకోర్టు రిజిస్ట్రార్ ఆలపాటి గిరిధర్, అప్పటి మరో రిజిస్ట్రార్ మురళీధరరావు (వీఆర్ఎస్ తీసుకున్నారు)తో పాటు పలువురు అధికారులు, సిబ్బందిపై సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించారు. కాగా, ఈ ధిక్కార వ్యాజ్యంలో న్యాయమూర్తి దేవానంద్ తాజాగా తీర్పు వెలువరించారు.

**గడువులోగా పోస్టుల భర్తీకి ఆదేశం**

ప్రస్తుతం హైకోర్టు 50 శాతం కన్నా తక్కువ సిబ్బందితో పని చేస్తోందని, తక్కువ సమయం ఇచ్చి హైకోర్టును విభజించడం వల్ల తగిన రవాణా, ఇతర కనీస సౌకర్యాలేవీ లేకుండానే హైకోర్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ పేర్కొన్నారు. ఇలాంటి అనేక అంశాలు ఉద్యోగుల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఆయన పలు సూచనలు చేశారు. నిర్దిష్ట గడువులోగా హైకోర్టులో ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని, ఉద్యోగులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఏటా జ్యుడిషియల్ సెక్షన్‌లోని 30 శాతం సిబ్బందిని ఇతర సెక్షన్లకు బదిలీ చేయాలని, దీనివల్ల ఉద్యోగులందరికీ అన్ని సెక్షన్లలో పనిచేసిన అనుభవం ఉంటుందని, ఇదే సమయంలో కొందరు ఉద్యోగుల గుత్తాధిపత్యానికి అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. ఈ తీర్పు కాపీని పరిశీలన నిమిత్తం ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

## ఐదు కోట్ల మందిని నట్టేట ముంచిన బాబు

- 806వ రోజు రిలే దీక్షల్లో బహుజన నేతలు




తాడికొండ: చంద్రబాబును నమ్మినందుకే ఐదుకోట్ల మంది రాష్ట్ర ప్రజలు నట్టేట మునిగిపోయారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 806వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ నమ్మిన వారిని నట్టేట ముంచడం బాబుకు తొలినుంచి అలవాటే అని, సొంత మామను వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న బాబు నేడు విభజన అనంతరం ప్రజలను కూడా రాజధాని పేరుతో నిలువునా మోసం చేశాడని మండిపడ్డారు. నాయకులు పెరికే వరప్రసాద్, బొలిమేర శామ్యూల్, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ పొదుపుపై చైతన్యం పెంచండి

- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి లేఖ



సాక్షి, అమరావతి: విద్యుత్ పొదుపుపై అధికారులు, ప్రజల్లో చైతన్యం పెంచేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపించారు. ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్న జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలను వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని విజయవంతంగా జరపాలంటూ ఆ లేఖలో కోరారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి, భావితరాలకు నిరంతర విద్యుత్‌ను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంధన పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యుత్ పొదుపు వల్ల ఆర్థిక వృద్ధి సాధించవచ్చని, విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి, కర్బన ఉద్గారాలను (సీఓ2) తగ్గించవచ్చని సీఎస్ ఆ లేఖలో పేర్కొన్నారు.

**ఫలిస్తున్న పొదుపు చర్యలు**

రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేయడం, పెర్ఫార్మ్, అచీవ్ అండ్ ట్రేడ్ (పాట్) పథకం, ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలు, వ్యవసాయ రంగంలో పాత పంపుసెట్ల స్థానంలో విద్యుత్ ఆదా చేయగల స్టార్ రేటెడ్ పంపుసెట్ల భర్తీ వంటి విద్యుత్ పొదుపు చర్యల కారణంగా ఏడాదిలో రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా చేయగలిగామని సీఎస్ జవహర్‌రెడ్డి వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) ఆధారిత వినూత్న సాంకేతికతను అమలు చేస్తున్నామని వెల్లడించారు.

**జిల్లాల్లో శక్తి పరిరక్షణ కమిటీలు**

విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాస్థాయి శక్తి పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేశామని, ఈ కమిటీకి విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల జిల్లా ఎస్ఈ కన్వీనర్‌గా ఉంటారని సీఎస్ వెల్లడించారు. ఏపీఎస్ఈసీఎం సమన్వయంతో అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ, ఎడ్యుకేషన్ వంటి అన్ని కీలక ప్రభుత్వ విభాగాలు ఈ వారోత్సవాల్లో పాల్గొని జిల్లా ప్రధాన కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. ఇందులో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. వారోత్సవాల పోస్టర్‌ను ఈ సందర్భంగా సీఎస్ విడుదల చేశారు.

## కిడ్నీకి రూ.7 కోట్లు ఇస్తామని..
# రూ.16.40 లక్షలకు టోకరా

- యూట్యూబ్‌లో ప్రకటన చూసి కిడ్నీ విక్రయించేందుకు సిద్ధమైన యువతి
- రూ.7 కోట్లకు టాక్స్ చెల్లించాలంటూ విడతల వారీగా రూ.16.40 లక్షల వసూలు
- నిలదీయడంతో ఢిల్లీ రావాలన్న మోసగాళ్లు
- మోసపోయినట్టు గ్రహించి పోలీస్ స్పందనలో ఫిర్యాదు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలానికి చెందిన ఓ ఆసామి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతని కుమార్తె హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతోంది. సోమవారం తన తండ్రితో కలిసి గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించిన 'స్పందన'లో ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌ను కలిసింది. కిడ్నీ విక్రయిస్తే రూ.7 కోట్లు ఇస్తామంటూ.. తన నుంచి రూ.16.40 లక్షల మేర వసూలు చేసిన గుర్తు తెలియని వ్యక్తులు తనను మోసగించారంటూ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తన తండ్రి ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో రూ.20 లక్షలు దాచాడు. తండ్రికి తెలియకుండా ఆ ఖాతాలో ఉన్న సొమ్ములో రూ.2 లక్షలను ఫోన్‌పే ద్వారా సొంతానికి ఖర్చు చేసింది.

**యూట్యూబ్ వల వేసి..**

కాగా, రూ.2 లక్షలు ఖర్చు చేసిన విషయం తండ్రికి తెలిస్తే మందలిస్తాడన్న భయంతో ఆ డబ్బుల్ని తానే సంపాదించి తండ్రికి తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించుకుంది. డబ్బు సంపాదించే మార్గం కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 26న యూట్యూబ్‌లో వెదికింది. అందులో కిడ్నీ దానం చేస్తే రూ.7 కోట్లు చెల్లిస్తామనే ప్రకటన ఆమెను ఆకర్షించింది. అందులో ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేసి.. ఆన్‌లైన్, వాట్సాప్ ద్వారా ఎదుటి వ్యక్తులతో మాట్లాడింది. శస్త్రచికిత్సకు ముందు రూ.3.50 కోట్లు, శస్త్రచికిత్స తరువాత రూ.3.50 కోట్లు చెల్లిస్తామని మోసగాళ్లు ఆ యువతికి చెప్పారు. పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించాలంటే పన్నుల రూపేణా ముందుగా నగదు చెల్లించాల్సి వస్తుందన్నారు. తండ్రి పేరుతో చెన్నైలోని ఓ బ్యాంక్‌లో ఖాతా తెరిచి, రూ.3.50 కోట్లు జమ చేసినట్టు ఆమెను నమ్మించారు. ఆ యువతి నుంచి విడతల వారీగా రూ.16.40 లక్షలను ఆన్‌లైన్ ద్వారా పంపించింది. ఎంతకీ డబ్బు రాకపోవడంతో తన డబ్బు తనకు తిరిగి ఇచ్చేయాలని కోరింది. సదరు మోసగాళ్లు ఢిల్లీ రావాలని సూచించగా.. ఆ యువతి అక్టోబర్ 8న విమానంలో ఢిల్లీ వెళ్లింది. వారిచ్చిన చిరునామాలో సంబంధిత వ్యక్తులెవరూ లేకపోవడంతో వెనక్కి వచ్చేసింది.

**ఇంటికి వెళ్లకుండా మొహం చాటేయడంతో..**

ఈ విషయం తండ్రికి తెలిస్తే తిడతాడనే భయంతో సదరు యువతి ఎన్టీఆర్ జిల్లాలోని స్నేహితుల వద్దకు వెళ్లి తలదాచుకుంటోంది. కుమార్తె అదృశ్యంపై ఎన్టీఆర్ జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆమెను గుర్తించి తండ్రికి అప్పగించారు. డబ్బులు విషయమై కుమార్తెను అడగ్గా జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పింది. దీనిపై ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ వేగవంతం చేయాలని కోరుతూ స్పందనలో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌కు వినతి పత్రం అందించారు. ఈ విషయమై ఎస్పీ హఫీజ్ మీడియాతో మాట్లాడుతూ.. ఐటీ కోర్ విభాగం ద్వారా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## క్లుప్తంగా...

### ఈడీ డైరెక్టర్ పదవీ కాలం ఎందుకు పొడిగించారు?

**న్యూఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డైరెక్టర్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని మూడుసార్లు ఎందుకు పొడిగించారో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్రంతోపాటు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ), ఈడీ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది. ఈడీ డైరెక్టర్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మూడోసారి పొడిగించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ నేత జయా ఠాకూర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీఆర్ గావై, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కేంద్రంతోపాటు సీవీసీకి నోటీసులు జారీ చేసింది. రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి దర్యాప్తు సంస్థలను కేంద్రం ఉపయోగించుకుంటోందని, తద్వారా ప్రజాస్వామ్య నిర్మాణాన్ని ధ్వంసం చేస్తోందని జయా ఠాకూర్ తన పిటిషన్‌లో ఆరోపించారు. సంజయ్‌కుమార్ మిశ్రాకు పొడిగింపు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వు జారీ చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోలేదని ఆక్షేపించారు.

### మహిళా రిజర్వేషన్ బిల్లు మనుగడలోనే ఉంది

**సవాయిమాధోపూర్:** మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో 11 ఏళ్ల క్రితం రాజ్యసభ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెడితే తమ పార్టీ మద్దతిస్తుందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ చెప్పారు. అప్పటి నుంచి రాజ్యసభ రద్దు కానందున ఇప్పటికీ ఆ బిల్లు మనుగడలోనే ఉన్నట్లు లెక్కని చెప్పారు. రాజస్తాన్‌లోని సవాయిమాధోపూర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభలో ఈ బిల్లును పెడితే మద్దతిస్తామని ప్రభుత్వానికి ఇప్పటికే పలు మార్లు తెలిపామన్నారు. కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియా గాంధీ కూడా ప్రధాని మోదీకి ఈ మేరకు లేఖ రాశారన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు మూడింట ఒక వంతు సీట్లను కేటాయించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని జైరాం రమేశ్ చెప్పారు. పార్టీ పదవుల్లో మహిళలకు 20% రిజర్వేషన్లు కల్పించిన ఏకైక రాజకీయ పార్టీ కాంగ్రెస్సేనని చెప్పారు.

### సెంట్రల్ వర్సిటీలు, ఐఐటీల్లో 11వేలకుపైగా ఖాళీలు

**న్యూఢిల్లీ:** కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) కాలేజీల్లో 11వేలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాలను వెల్లడించారు. మంత్రి చెప్పిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న 45 సెంట్రల్ వర్సిటీల్లో అనుమతించిన 18,956 పోస్టులకుగాను ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు సంబంధించి మొత్తంగా 6,180 పోస్టులు ఇంకా భర్తీచేయాల్సి ఉంది. ఐఐటీల్లో 11,170 పోస్టులకు ఇంకా 4,502 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఐఐఎంలలో 1,566 ఫ్యాకల్టీ పోస్టులకు ఇంకా 493 పోస్టులను భర్తీచేయాల్సి ఉంది. ' ఈ ఖాళీలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఈ అన్ని ఉన్నత విద్యా సంస్థలను ఇప్పటికే ఆదేశించాం' అని మంత్రి ప్రధాన్ చెప్పారు. కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐఎంలలో 961 ఎస్సీ, 578 ఎస్టీ, 1,657 ఓబీసీ, 643 ఈడబ్ల్యూఎస్, 301 పీడబ్ల్యూడీ రిజర్వ్‌డ్ పోస్టులు భర్తీచేయాల్సి ఉంది. దేశంలో 23 ఐఐటీలు, 20 ఐఐఎంలు ఉన్నాయి.

### ఉమర్ ఖలీద్‌కు బెయిల్

**న్యూఢిల్లీ:** ఈశాన్య ఢిల్లీ అల్లర్ల కేసులో 2020లో అరెస్టయిన జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్‌కు మధ్యంతర బెయిల్ మంజూరయింది. తన సోదరి వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వీలు కల్పించాలంటూ ఉమర్ ఖలీద్ పిటిషన్ వేశారు. దీంతో, ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ అడిషనల్ సెషన్స్ జడ్జి అమితాబ్ రావత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన తిరిగి 30వ తేదీన తప్పనిసరిగా సరెండర్ కావాల్సి ఉంటుంది.

### మూన్‌లైటింగ్ కూలీ

**బరంపూర్:** మూన్‌లైటింగ్. ఐటీ రంగంలో ఈ మధ్య బాగా పాపులరైన పదం. రెండు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ రెండు చేతులా సంపాదించడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. ఒడిశాకి చెందిన ఒక లెక్చరర్ కూడా మూన్‌లైటింగ్ చేస్తున్నారు. కానీ ఈయనది మనసుని కదిలించే కథ. పొద్దున్న పూట కాలేజీలో విద్యార్థులకు పాఠాలు. రాత్రయ్యే సరికి ఎర్రచొక్కా వేసుకొని రైల్వే స్టేషన్లలో కూలీ అవతారం. డబ్బు సంపాదించడం కోసం కాకుండా, తాను ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌లో పని చేసే వారికి జీతాలు ఇవ్వడం కోసం కూలీ పని చేస్తున్నారు. ఒడిశాలో గంజామ్ జిల్లాకు చెందిన 31 ఏళ్ల సీహెచ్.నగేశు పాత్రో బరంపూర్ రైల్వే స్టేషన్‌లో కూలీగా పనిచేసేవారు. కరోనా సమయంలో రైళ్లు నిలిచిపోవడంతో ఆయనకు పని లేకుండా పోయింది. ఎంఏ వరకు చదువుకున్న పాత్రో ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక నిరుపేద విద్యార్థుల కోసం ఒక కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పదో క్లాసు పిల్లలకి పాఠాలు చెప్పసాగారు. కోచింగ్ సెంటర్‌కి ఆదరణ పెరగడంతో 10 నుంచి 12 వేల జీతానికి కొందరు టీచర్లను నియమించారు. వారికి జీత భత్యాలు ఇవ్వడానికి రాత్రయ్యే సరికి మళ్లీ కూలీ పని చేస్తున్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు పాత్రో సూరత్‌లోని ఒక మిల్లులో, హైదరాబాద్‌లోని ఒక మాల్‌లో పని చేసి తాను సంపాదించిన డబ్బులతోనే చదువుకున్నారు.

# వరుసగా రెండోసారి

- గుజరాత్ సీఎంగా భూపేంద్ర పటేల్ ప్రమాణ స్వీకారం
- 16 మంది మంత్రుల ప్రమాణం
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా



పటేల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మోదీ

**గాంధీనగర్:** గుజరాత్ రాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా భూపేంద్ర పటేల్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజధాని గాంధీనగర్‌లో నూతన సచివాలయం సమీపంలోని హెలిప్యాడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. భూపేంద్ర పటేల్ సీఎంగా ప్రమాణం చేయడం వరుసగా ఇది రెండోసారి. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆయనతో ప్రమాణం చేయించారు. అలాగే 16 మంది మంత్రులు సైతం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో 8 మంది.. కానూ దేశాయ్, రిషికేశ్ పటేల్, రాఘవ్‌జీ పటేల్, బల్వంత్‌సింగ్ రాజ్‌పుత్, కున్వర్‌జీ బవాలియా, మూలూ బేరా, కుబేర్ దిండోర్, భానూబెన్ బబారియాకు కేబినెట్ ర్యాంకు దక్కింది. 11 మంది మాజీ మంత్రులకు మరోసారి మంత్రులుగా అవకాశం కల్పించారు. మంత్రివర్గంలో ఒక మహిళ ఉన్నారు. 16 మంది మంత్రుల్లో నలుగురు కోలీ సామాజిక వర్గానికి చెందినవారు. ముగ్గురు పాటిదార్లు, మరో ముగ్గురు ఓబీసీలు, ఇద్దరు గిరిజనులు, ఒకరు దళితుడు ఉన్నారు. అలాగే ఒకరు జైన్, మరొకరు బ్రాహ్మిణ్, ఇంకొకరు క్షత్రియుడు ఉన్నారు. ఉత్సాహం ఉరకలెత్తుతున్న ఈ మంత్రివర్గం గుజరాత్‌ను అభివృద్ధి పథంలో ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని భావిస్తున్నట్లు ప్రధాని మోదీ ట్వీట్‌చేశారు.

## మున్సిపాలిటీ సభ్యుడి నుంచి సీఎం స్థాయికి

భూపేంద్ర.. పటీదార్‌లోని కేడ్వా ఉపకులానికి చెందిన వ్యక్తి. సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన భూపేంద్ర తొలినాళ్లలో రాజకీయాల్లోకి వచ్చినపుడు అహ్మదాబాద్ జిల్లాలోని మేమ్‌నగర్ మున్సిపాలిటీ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1995–2006 వరకు మున్సిపాలిటీ సభ్యునిగా కొనసాగారు. అదే మున్సిపాలిటీకి రెండు సార్లు అధ్యక్షుడిగానూ సేవలందించారు. తర్వాత అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(ఏఎంసీ)కు స్థాయి కమిటీ చైర్మన్‌గా 2010నుంచి 2015దాకా పనిచేశారు. ఏఎంసీ అనేది గుజరాత్‌లోనే అత్యంత పెద్ద మున్సిపాలిటీ. ఆ తర్వాత ఆయన అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి 2015 నుంచి రెండేళ్లపాటు చైర్మన్‌గా పనిచేశారు. ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తుండే ఈయనను స్థానికంగా అందరూ 'దాదా' అని పిలుచుకుంటారు. పటీదార్ల సామాజిక, ఆర్థిక ప్రగతికి కృషిచేసే సర్దార్‌ధామ్ విశ్వ పటీదార్ కేంద్రానికి ట్రస్టీగా కొనసాగారు. రాజకీయాల్లో మరింత ఎదిగిన భూపేంద్ర ఆ తర్వాత మాజీ మహిళా ముఖ్యమంత్రి, ప్రస్తుత యూపీ గవర్నర్ అయిన ఆనందీబెన్ పటేల్ నియోజకవర్గమైన ఘట్లోడియా నుంచి తొలిసారిగా 2017లో ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. తాజాగా మరోసారి అదే నియోజకవర్గంలో ఏకంగా 1.17 లక్షల మెజారిటీతో గెలుపుబావుటా ఎగరేశారు. అహ్మదాబాద్‌లోని శిలాజ్ ప్రాంతంలో భార్య హేతల్‌బెన్‌తో నివసించే ఈయనకు క్రికెట్, బ్యాడ్మింటన్ అంటే ఎంతో ఇష్టం. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొంటారు. పటేల్ వర్గాల్లో ఆనందీబెన్ పటేల్‌కు సన్నిహితుడిగా పేరొందడం వల్లే ఈయనను సీఎం పదవికి బీజేపీ అధిష్టానం పరిశీలించిందని గతంలో వార్తలొచ్చాయి.

# ఎల్‌ఏసీ వద్ద ఘర్షణ

**భారత్, చైనా జవాన్లకు స్వల్ప గాయాలు**



గల్వాన్ లోయలో ఘర్షణ (ఫైల్)


**న్యూఢిల్లీ:** అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వద్ద యాంగ్‌త్సే సమీపంలో భారత్, చైనా సైనికుల నడుమ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నెల 9న జరిగిన ఈ సంఘటన వివరాలను భారత సైన్యం సోమవారం బహిర్గతం చేసింది. ఘర్షణలో ఇరు దేశాల జవాన్లు కొందరు స్వల్పంగా గాయపడ్డారని ఒక ప్రకటనలో వెల్లడించింది. కయ్యానికి కాలుదువ్విన చైనా జవాన్లను మన సైనికులు దీటుగా ఎదుర్కొన్నారని, గట్టిగా తిప్పికొట్టారని తెలియజేసింది. ఘర్షణ అనంతరం రెండు దేశాల సైనికులు ఘటనా స్థలం నుంచి పూర్తిగా వెనక్కి మళ్లారని వివరించింది. భారత సైన్యం కమాండర్ చైనా కమాండర్‌తో ఫ్లాగ్ మీటింగ్ నిర్వహించి, తాజా పరిణామాలపై చర్చించారని, సరిహద్దులో శాంతి స్థాపనకు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారని పేర్కొంది. అయితే, ఘర్షణలో ఎంతమంది గాయపడ్డారు? వారు ఎవరు? అన్న విషయాన్ని భారత సైన్యం వెల్లడించలేదు. భారత్ కంటే చైనా జవాన్లు అధిక సంఖ్యలో గాయపడినట్లు తెలుస్తోంది. గల్వాన్ ఘటన తర్వాత ఇరుదేశాల సైనికుల మధ్య ఈ స్థాయిలో ఘర్షణ జరగడం ఇదే మొదటిసారి. 2020 జూన్ 15న లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైన్యం మధ్య భీకర ఘర్షణ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇరువైపులా పదుల సంఖ్యలో జవాన్లు మృతిచెందారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో ఎల్‌ఏసీ వద్ద తమవేనని చెప్పుకుంటున్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్, చైనా 2006 నుంచి పహారా నిర్వహిస్తున్నాయి. గల్వాన్ ఘర్షణ తర్వాత 3,500 కిలోమీటర్ల పొడవైన ఎల్‌ఏసీ వద్ద భారత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.

**మోదీ సర్కారు వల్లే : కాంగ్రెస్**

సరిహద్దు విషయంలో నిజాలు బయటకు రాకుండా మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. మన ప్రభుత్వ వైఖరి వల్లే చైనా రెచ్చిపోతుందని అన్నారు. మోదీ సర్కారు మెతక వైఖరిని డ్రాగన్ ఉపయోగించుకుంటోందని చెప్పారు. రాజకీయ ప్రతిష్టను కాపాడుకోనేందుకు చైనాపై నోరు మెదపడం లేదని ధ్వజమెత్తారు. మన సైనికులు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలను చూసి గర్వపడుతున్నామన్నారు.

# ఆధారాల్లేకుండా ఆరోపించొద్దు

- అలా చేయడం సభా హక్కులను ఉల్లంఘించడమే
- రాజ్యసభ సభ్యులకు చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ హితవు



రాజ్యసభలో మాట్లాడుతున్న ధన్‌ఖడ్

**న్యూఢిల్లీ:** సభలో తగిన ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయకూడదని రాజ్యసభ సభ్యులకు చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ హితవు పలికారు. అలాంటి ఆరోపణలు చేయడం సభా హక్కులను ఉల్లంఘించడంతో సమానమని తేల్చిచెప్పారు. రాజ్యసభలో సోమవారం జీరో అవర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడారు. దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆక్షేపించారు. ప్రతిపక్ష నాయకులను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గత ఎనిమిదేళ్లలో ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా 3,000 సోదాలు నిర్వహించిందని, కానీ, కేవలం 23 మంది దోషులుగా తేలారని చెప్పారు. సంజయ్ సింగ్ వ్యాఖ్యలపై అధికార ఎన్డీయే ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కలుగజేసుకోవాలని సభాపతిని కోరారు. చైర్మన్ ధన్‌ఖడ్ స్పందించారు. సభలో ఎవరు ఏం మాట్లాడినా అది కచ్చితత్వంతో కూడినది అయి ఉండాలని సూచించారు. తగిన ఆధారాలతో మాట్లాడాలన్నారు. ఆధారాలు లేని గణాంకాలను సభలో చెబుతామంటే అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇష్టారీతిన తోచింది మాట్లాడడం సభా హక్కులను ఉల్లంఘించడంతో సమానమేనని ఉద్ఘాటించారు. ఇలాంటి అంశాలను తీవ్రంగా పరిగణిస్తానన్నారు. పత్రికల్లో వచ్చిన రిపోర్టులు లేదా ఎవరో వెల్లడించిన అభిప్రాయాలకు ప్రాముఖ్యం ఇవ్వబోమన్నారు. సభలో ఏదైనా ఆరోపణ చేసినప్పుడు చట్టబద్ధ డాక్యుమెంటేషన్ ఉండాలన్నారు. అనంతరం కేంద్ర మంత్రి గోయెల్ మాట్లాడారు. ఎనిమిదేళ్లలో ఈడీ 3,000 సోదాలు చేసిందనడం పూర్తిగా అవాస్తవమని తేల్చిచెప్పారు. కోర్టు ఆదేశాల మేరకే దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకుంటాయని అన్నారు. సంజయ్ స్పందిస్తూ.. అధికార పార్టీతో సంబంధాలున్న అవినీతిపరులపై దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు.

# అక్రమమార్గాల్లో పోటెత్తిన పసిడి

- ఈ ఏడాది నవంబర్ వరకు 3,083 కేజీల బంగారం పట్టివేత
- రాష్ట్రాలవారీగా చూస్తే కేరళ టాప్
- స్మగ్లింగ్ వివరాలు వెల్లడించిన కేంద్రం



**న్యూఢిల్లీ:** భారత్‌లో బంగారుఆభరణాలపై మక్కువతో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతుండటంతో అదే స్థాయిలో అక్రమమార్గాల్లో దేశంలోకి పుత్తడి పరవళ్లు పెరిగాయి. ఈ ఏడాది నవంబర్ వరకు మొత్తంగా 3,083 కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారని కేంద్రం పార్లమెంట్‌లో వెల్లడించింది. 2020ఏడాదిలో 2,154 కేజీలు, 2021 ఏడాదిలో 2,383 కేజీల బంగారం పట్టుకోగా ఈ ఏడాది అంతకంటే ఎక్కువగా 3,083 కేజీల స్మగ్లింగ్ బంగారాన్ని కస్టమ్స్, రెవెన్యూ ఇంటెలిజెన్స్, సంబంధిత విభాగాల అధికారులుస్వాధీనం చేసుకున్నారు. 2019 ఏడాదిలో ఏకంగా 3,673 కేజీల బంగారాన్ని పట్టుకోవడం గమనార్హం. తాజా వివరాలను సోమవారం ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్‌లో పేర్కొన్నారు. ఈఏడాది నమోదైన 3,588 కేసుల్లో 3,083 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. రాష్ట్రాలవారీగా చూస్తే కేరళలో అత్యధికంగా 690 కేజీల పసిడి అధికారుల చేతచిక్కింది. ఆ తర్వాత మహారాష్ట్రలో 474 కేజీలు, తమిళనాడులో 440 కేజీలు, పశ్చిమబెంగాల్‌లో 369 కేజీల బంగారం అక్రమరవాణాను అడ్డుకున్నారు. కాగా, భారత్‌లోకి దిగుమతులు సైతం విపరీతంగా పెరుగుతున్నాయి. 2021–22 కాలంలో గతంలో పోలిస్తే ఏకంగా 33 శాతం అధికంగా 46.14 బిలియన్ డాలర్ల విలువైన బంగారం దిగుమతులు జరిగాయి. చైనా తర్వాత ప్రపంచంలో అత్యంత ఎక్కువగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్న దేశం భారతదేశమే. స్మగ్లర్లు మయన్మార్ నుంచి ఎక్కువగా బంగారాన్ని భారత్‌లోకి అక్రమంగా తీసుకొస్తున్నారని డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ తన నివేదికలో పేర్కొంది. కాగా, అక్రమరవాణాదారులు ఎప్పటికప్పుడు వేర్వేరు మార్గాలు, పద్ధతుల్లో కొత్త పంథాలో పుత్తడిని భారత్‌లోకి తరలిస్తున్నారని మంత్రి పార్లమెంట్‌లో చెప్పారు.



స్నేహితురాలితో ప్రధాని మెలోని(ఎడమ)

# ఇటలీ కేఫ్‌లో కాల్పులు..

**ప్రధాని మెలోనీ స్నేహితురాలు సహా ముగ్గురు మృతి**

**రోమ్:** ఇటలీ రాజధాని రోమ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో దేశ ప్రధాని స్నేహితురాలు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. రోమ్‌లోని ఫిడెన్ జిల్లాలోని ఓ కేఫ్‌లో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం జరగాల్సిన తమ అపార్ట్‌మెంట్ కమిటీ రెసిడెంట్స్ కమిటీ సమావేశంపై చర్చించేందుకు కొందరు సభ్యులు ఓ కేఫ్‌లో సమావేశమయ్యారు. ఇంతలోనే తుపాకీతో అక్కడికి చేరుకున్న ఓ వ్యక్తి అందరినీ చంపేస్తానని అరుస్తూ ఒక్కసారిగా వారిపైకి కాల్పులకు దిగాడు. ఈ కాల్పుల్లో ముగ్గురు మహిళలు చనిపోగా మరో నలుగురు గాయపడ్డారు. అప్రమత్తమైన స్థానికులు దుండగుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన నికొలెట్టా గొలిసానో(50) తన స్నేహితురాలేనంటూ ప్రధాని జార్జియా మెలోనీ గతంలో ఆమెతో దిగిన సెల్ఫీని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీకి చెందిన మెలోనీ దేశ తొలి మహిళా ప్రధానిగా అక్టోబర్‌లో బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

## స్టాలిన్ కేబినెట్‌లోకి ఉదయనిధి



**చెన్నై:** తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కుమారుడు, అధికార డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి(45)కి త్వరలో మంత్రి యోగం దక్కనుంది. 14న రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఉదయనిధి మంత్రిగా ప్రమాణం చేయనున్నారని సోమవారం రాజ్‌భవన్ తెలిపింది. మంత్రివర్గంలోకి ఉదయనిధిని తీసుకోవాలంటూ డీఎంకే చీఫ్, ముఖ్యమంత్రి స్టాలిన్ పంపిన సిఫారసును గవర్నర్ రవి ఆమోదించారని పేర్కొంది. సినీ నటుడు, దర్శకుడు అయిన ఉదయనిధి మొదటిసారిగా 2021 ఎన్నికల్లో చెపాక్–తిరువల్లికెని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఉదయనిధికి మంత్రి పదవి కట్టబెట్టాలనే డిమాండ్ పార్టీ వర్గాలతోపాటు మంత్రుల నుంచి ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తోందని డీఎంకే నేతలు అంటున్నారు.

# జోడో యాత్రలో ప్రియాంక



**కోటా:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రాజస్తాన్‌లో కొనసాగుతున్న భారత్ జోడో యాత్రలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా, కూతురు పాల్గొన్నారు. బూందీ జిల్లాలో కొనసాగుతున్న యాత్రను సోమవారం మహిళా సాధికారతను చాటుతూ 'నారీశక్తి పాదయాత్ర'గా ప్రకటించారు. బబాయ్‌లోని తేజాజీ మహరాజ్ మండి నుంచి సవాయిమాధోపూర్ జిల్లా పీపల్‌వాడ వరకు కోటా–లాల్సోట్ హైవేపై సాగిన యాత్రలో 5 వేల మంది మహిళా కార్యకర్తలు పాలుపంచుకున్నారు. రోడ్డుకు రెండు వైపులా భారీ సంఖ్యలో బారులు తీరిన జనం యాత్రకు స్వాగతం పలికారు. రాజస్తాన్‌లో వారం రోజులుగా కొనసాగుతున్న ఈ యాత్ర ఈ నెల 21వ తేదీన హరియాణాలోకి ప్రవేశించనుంది.

## 2000 నోట్లను రద్దు చేయండి

**న్యూఢిల్లీ:** రూ.2,000 కరెన్సీ నోట్లను రద్దుచేయాలని సోమవారం రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ డిమాండ్ చేశారు. 'పెద్ద విలువైన నోట్లను అభివృద్ధి చెందిన దేశాలేవీ చెలామణిలో ఉంచట్లేవు. అలాంటపుడు భారత్‌లో పెద్ద నోటు రూ.1,000ను రద్దుచేసిన ప్రభుత్వం అంతకన్నా పెద్ద నోటు రూ.2,000ను తేవడం తర్కంలేని పని. మరోవైపు సంఘ వ్యతిరేక శక్తులు రూ.2,000 నోట్లను మాదకద్రవ్యాల రవాణాకు, మనీ లాండరింగ్‌కు వాడుతున్నాయి. ఈ కరెన్సీని ప్రభుత్వం రద్దుచేయాలి. ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 కరెన్సీ నోట్లను మిగతా కరెన్సీలోకి మార్చుకునేందుకు వారికి రెండు సంవత్సరాల గడువు ఇవ్వాలి' అని డిమాండ్‌చేశారు.

## సుప్రీం జడ్జిగా దీపాంకర్ ప్రమాణం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా జస్టిస్ దీపాంకర్ దత్తా సోమవారం ప్రమాణంచేశారు. ఢిల్లీలోని సర్వోన్నత న్యాయస్థానం కోర్టురూమ్ నంబర్1లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్.. దీపాంకర్ చేత ప్రమాణంచేయించారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ దత్తాను సుప్రీంకోర్టు జడ్జిగా నియమిస్తూ ఆదివారం కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేసిన విషయం విదితమే. జస్టిస్ దత్తా తండ్రి జస్టిస్ సలీల్ కుమార్ గతంలో కలకత్తా హైకోర్టులో జడ్జిగా సేవలందించారు. జస్టిస్ దత్తా ప్రమాణస్వీకారం తర్వాత సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్య 28కి పెరిగింది. భారత రాజ్యాంగ నిబంధనలప్రకారం చూస్తే సీజేతో కలుపుకుని సుప్రీంకోర్టులో గరిష్టంగా 34 మంది వరకు జడ్జీలు ఉండొచ్చు. జస్టిస్ దత్తా సుప్రీంకోర్టులో 2030 ఫిబ్రవరి ఎనిమిదో తేదీదాకా జడ్జిగా కొనసాగుతారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రధానిని చంపేద్దాం

- మైనారిటీలు, దళితుల సంక్షేమం కోసం ఇది తప్పదు
- హత్య చేసేందుకు సిద్ధంగా ఉండండి
- పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ నేత రాజా పటేరియా పిలుపు



**భోపాల్:** మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాష్ట్ర మంత్రి రాజా పటేరియా వ్యాఖ్యానాలు వివాదాస్పదమయ్యాయి. ఆదివారం పన్నా జిల్లాలోని పవాయ్ పట్టణంలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడినట్లుగా చెబుతున్న వీడియో ఒకటి సోమవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ' ఇక త్వరలో మోదీ ఎన్నికల తంతుకు మంగళం పాడుతారేమో. భాష, కులం, మతం ప్రాతిపదికన జనాలను విడగొడతారు. రాజ్యాంగ నియమాలను కాలరాస్తూ దళితులు, గిరిజనులు, మైనారిటీల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా చేస్తున్నారు. ఇకనైనా రాజ్యాంగ పరిరక్షణ జరగాలంటే మోదీని చంపేందుకు సిద్ధంకండి. చంపడమంటే ఓడించడమే' అని పటేరియా చెబుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. దీంతో మధ్యప్రదేశ్ హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా.. పటేరియాపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఆదేశించారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు, దళితులు, మైనారిటీల మధ్య విద్వేషాలు పెంచేలా వ్యాఖ్యలు చేశారంటూ పలు సెక్షన్ల కింద పవాయ్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదుచేశారు. ' పటేరియా వ్యాఖ్యలు చూస్తుంటే భారత్ జోడో యాత్ర చేపట్టిన పార్టీ అసలు రంగు ఏంటో బయటపడుతోంది. మోదీపై ఎంతగా కాంగ్రెస్ పార్టీ ద్వేషం పెట్టుకుందో ఈయన మాటలు చూస్తే అర్థమవుతోంది. మోదీని ఎన్నికల క్షేత్రంలో ఓడించలేక ఇలా చంపుతామని మాట్లాడుతున్నారు' అని సీఎం శివరాజ్ సింగ్ అన్నారు. ' నా ఉద్దేశం బీజేపీని, మోదీని ఓడించాలని. చంపాలని కాదు. నా వ్యాఖ్యలను వక్రీకరించారు' అని తర్వాత పటేరియా వివరణ ఇచ్చారు.

# శబరిమల కిటకిట



శబరిమలలో దర్శనం కోసం బారులుతీరిన వేలాదిమంది భక్తులు

**తిరువనంతపురం:** కేరళలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలకు భక్తులు పోటెత్తుతున్నారు. నిత్యం లక్ష మందికిపైగానే తరలివస్తున్నారు. అయ్యప్ప దర్శనానికి దాదాపు 12 గంటల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోతోంది. దర్శనం కోసం సోమవారం ఒక్కరోజే 1,19,480 మంది ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారులతో కలిసి సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శబరిమలలో భక్తుల రాక, దర్శనం ఏర్పాట్లపై చర్చించారు. పార్కింగ్ సదుపాయాలు పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీగా తరలివస్తున్న భక్తులను నియంత్రించడం కష్టతరంగా మారడంతో వారి సంఖ్యపై పరిమితి విధించాలని, ప్రతిరోజూ గరిష్టంగా 90,000 మందిని మాత్రమే దర్శనానికి అనుమతించాలని నిర్ణయించారు. అలాగే దర్శన సమయాన్ని మరో గంటపాటు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు.

**హైకోర్టు ఆదేశాలతో..**

భక్తుల రద్దీ నియంత్రణకు సంబంధించి కేరళ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై న్యాయస్థానం ఆదివారం సమావేశమై, విచారణ చేపట్టింది. రద్దీని నియంత్రించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని పత్తనంతిట్ట జిల్లా కలెక్టర్, ఎస్పీని ఆదేశించింది. నిత్యం 75,000 మందికిపైగా భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో భక్తుల సంఖ్యను 90,000కు పరిమితం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### తెల్లవారుజాము నుంచే..

అయ్యప్ప స్వామిని నిత్యం 90,000 మంది సులువుగా దర్శనం చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు ట్రావెన్‌కోర్ దేవాస్వోమ్ బోర్డ్(టీడీబీ) చైర్మన్ కె.అనంతగోపన్ చెప్పారు. దర్శన వేళల్లో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు స్వామిని భక్తులు దర్శించుకోవచ్చని చెప్పారు. ఇదిలా ఉండగా, శబరి దేవస్థానంలో నవంబర్ 17న ప్రారంభమైన 41 రోజుల మండల పూజ ఈ నెల 27న ముగియనుంది. అనంతరం ఆలయాన్ని మూసివేస్తారు. మకరవిళక్కు యాత్ర కోసం ఈ నెల 30న ఆలయాన్ని మళ్లీ తెరుస్తారు. 2023 జనవరి 14న మకర జ్యోతి దర్శనంతో మకరవిళక్కు యాత్ర ముగుస్తుంది. పూజలు పూర్తయ్యాక జనవరి 20న ఆలయాన్ని మూసివేస్తారు.

# సాక్షి
## విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 13 । డిసెంబర్ । 2022






### రైతుల గుండె చప్పుడు వైఎస్ జగన్

వ్యవసాయాన్ని లాభసాటి చేసిన సీఎం వైఎస్ జగన్ రైతుల గుండె చప్పుడయ్యారని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శనగపాడులో పీఏసీఎస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. -8లో



### ఆకలి మరణాల నివారణకే...

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లాలోని పలు పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. -8లో

### దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఇంద్రకీలాద్రి: దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి సోమవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదాలను అందించారు.

# మద్దతు ధరపై అక్కసు

## రైతుల అమాయకత్వంతో ఈనాడు అడ్డగోలు రాతలు

- తేమ శాతం పేరుతో దోపిడీ అంటూ కట్టు కథలు
- మద్దూరు గ్రామంలో క్షేత్రస్థాయి అధికారుల పరిశీలన
- దోపిడీ అవాస్తవమని నిగ్గు తేల్చిన అధికారులు
- నష్టం జరగలేదని అంగీకరించిన రైతులు



యనమదల రామ్మోహన్‌రావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

సాక్షిప్రతినిధి,విజయవాడ/కంకిపాడు(పెనమలూరు): రైతుల కష్టానికి ప్రతిఫలం దక్కాలని, వారికి కనీస మద్దతు ధర అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష. ఈ నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ అన్నదాతలకు మద్దతు ధర అందించేందుకు అధికారులు అహర్నిశలూ శ్రమిస్తున్నారు. తేమ శాతం, రవాణా, మద్దతుధర కల్పనలో ఎటువంటి లోటు పాట్లూ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు మద్దతు ధర ఇవ్వడం పచ్చపత్రిక 'ఈనాడు'కు నచ్చలేదు. 'ఇదేనా మద్దతు ధర?' శీర్షికన మద్దూరు గ్రామంలో 19 ఎకరాల్లో ధాన్యానికే రూ.90 వేల కోత అంటూ అభూత కల్పనలతో హడావిడిగా బురదచల్లే కథనం ప్రచురించి అక్కసు వెళ్లగక్కింది.

### క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిన నిజం

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం మద్దూరులో పర్యటించారు. తేమ శాతం పేరుతో దోపిడీ జరగటం లేదని వారి క్షేత్రస్థాయి పరిశీలనలో తేటతెల్లమైంది. ఆర్‌బీకే సిబ్బంది ఇచ్చే వివరాలను పూర్తిగా అవగాహన చేసుకోకపోవటం, ఎఫ్‌టీఓ జనరేట్ అయ్యే వరకూ ఆగి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లటంలో జాప్యమే అపోహలకు ప్రధాన కారణంగా తేలింది.

**మద్దూరులో ఏం జరిగిందంటే..**

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన యనమదల రామ్మోహన్‌రావు, యనమదల వెంకటేశ్వరరావు, రావి అప్పారావు ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేశారు. గొడవర్రు గ్రామ పరిధిలో 19 ఎకరాల పంటను విక్రయించగా తేమ శాతం తేడాతో రూ.90,168 నష్టపోయానన్నది రామ్మోహన్‌రావు అనుమానం. అయితే ఈ 19 ఎకరాల్లో పండిన ధాన్యాన్ని యనమదల రాజేష్, యనమదల బేబీ, యనమదల శిరీష, యనమదల రామ్మోహన్‌రావు పేరుతో ఈ నెల 5వ, 8వ తేదీల్లో ఆర్‌బీకే ద్వారా విక్రయించారు. 5న తరలించిన 599 ధాన్యం బస్తాలకు (40 కిలోల బ్యాగు) 17 శాతం తేమ నమోదవటంతో రూ.4,88,784, 8న తరలించిన 581 బ్యాగులకు (40 కిలోల బస్తా) 20 శాతం తేమ నమోదవటంతో రూ.4,74,096 అందాల్సి ఉంది. 17 శాతం కంటే తక్కువ తేమ ఉంటే రైతులకు మద్దతు ధర అందుతుంది. అంతకన్నా ఎక్కువ తేమ నమోదైతే క్వింటాకు ఒక్కొక్క శాతానికి కిలో చొప్పున తగ్గిస్తారు. 8న విక్రయించిన 581 బస్తాలకు తేమ శాతం 20గా నమోదవటంతో ఆ మేరకు ధర తగ్గించారు. దీనికి తోడు నిబంధనల మేరకు గోనె సంచి బరువును మినహాయించారు. ఇదే గ్రామానికి చెందిన యనమదల వెంకటేశ్వరరావు 35 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ నెల 6వ, 8వ తేదీల్లో మద్దూరు రైతు భరోసా కేంద్రం ద్వారా యనమదల వెంకటేశ్వరరావు, గొంది శ్రీనివాసప్రసాద్, వై.రంజిత్‌కుమార్ పేరుతో 743 బ్యాగులు (22.5 శాతం తేమ) తరలించగా 40 కిలోలు బస్తాకు రూ.816 చొప్పున రూ.6,06,288 సొమ్ము అందాల్సి ఉంది.

**తేమశాతం బట్టే ధర**

తేమశాతం బట్టే ధాన్యం ధర నిర్ణయం, ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు జరుగుతాయి. మద్దూరు కేంద్రంగా జరిగిన ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తే తేమశాతంలో ఉన్న తేడాలను రైతులు పరిగణనలోకి తీసుకోలేదు. తాము ఆర్‌బీకేకు తరలించిన బస్తాలు, రావాల్సిన సొమ్ము గురించే ఆలోచించారు. తేమ శాతం తేడా, గోనె సంచుల తరుగును తగ్గించాల్సిన నిబంధనలను విస్మరించారు. సర్వర్‌లో తలెత్తే సాంకేతిక సమస్యలతో రైతులకు సకాలంలో ఫోన్ మెసేజ్‌లు చేరకపోవటం కూడా గందరగోళానికి కారణమైంది. ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీఓ) జనరేట్ అయ్యాకే రైతులు తరలించిన ధాన్యం, అందనున్న సొమ్ముపై స్పష్టత వస్తుంది. ఈ లోపే తేమ పేరుతో మోసం జరిగిందంటూ ఇక్కడ ఓ వర్గం రైతులను పక్కదారి పట్టించింది. గత సీజన్లలో వ్యాపారులు, దళారులు, మధ్య వర్తుల ప్రమేయంతో ఇష్టానుసారంగా ధర నిర్ణయం, కొనుగోళ్లు జరిగాయి. ఈ దఫా వారి ఆగడాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. దీంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆ వర్గం తేమ శాతంతో మోసం జరుగుతోందని, నచ్చిన మిల్లు, దళారులకు విక్రయించడమే మంచిదనే ప్రచారాన్ని రైతుల్లోకి తీసుకెళ్లే యత్నం జరుగుతోందన్న విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

### సమాచార లోపంతో అపోహ



గొడవర్రు ఆర్‌బీకే ద్వారా ఈ నెల 5న 599 బస్తాలు, 8న 581 బస్తాల ధాన్యం తోలాను. తేమ శాతంలో తేడాలు, ఇతర వివరాలను ఆర్‌బీకే సిబ్బంది సరిగా చెప్పలేదు. దీంతో రూ.90 వేల నష్టం వచ్చిందని భావించా. ఎమ్మెల్యే పార్థసారథి మా గ్రామానికి వచ్చి అధికారుల సమక్షంలో లెక్కలు వేయించడంతో నేను నష్టపోలేదని గుర్తించాను. ఇప్పుడు సంతోషంగా ఉంది. నేను అడిగిన సమాచారం ఆర్‌బీకే సిబ్బంది చెబితే అసలు నాకు ఈ అపోహ వచ్చేదే కాదు.

\- యనమదల రామ్మోహన్‌రావు, రైతు, మద్దూరు

### తేమలో తేడా లేదు



మాది వల్లూరుపాలెం. నేను గొడవర్రులో 15 ఎకరాల్లో వరి సాగు చేశాను. ఇటీవలే 9 ఎకరాల ధాన్యం బాలాజీ మిల్లుకు తరలించా. ఆర్‌బీకేలో 17 శాతం తేమ వచ్చింది. మిల్లులోనూ అదే శాతం చూపింది. తేమలో ఎక్కడా తేడా లేదు. 606 బ్యాగులు మిల్లుకు తరలించాను. నాకు పూర్తి ధర అందింది. సిబ్బంది సమర్థంగా పని చేస్తున్నారు. నిబంధనలు పాటిస్తున్నారు.

\- సువర్ణగంటి రమేష్, రైతు, వల్లూరుపాలెం

### సమర్థంగా ధాన్యం సేకరణ



నేను గొడవర్రులో 3.36 ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట చేతికి వచ్చాక ఆర్‌బీకే సిబ్బందికి సమాచారం ఇస్తే టెక్నికల్ సిబ్బంది వచ్చి ధాన్యం శ్యాంపిల్ సేకరించి 17 శాతం తేమ ఉందని నిర్ధారించారు. 214 బ్యాగులు మిల్లుకు తరలించారు. తేమ శాతం తేడాలతో ఎక్కడా మోసం జరగలేదు. ఒక రైతుగా చెబుతున్నా ఈ దఫా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, సమర్థంగా జరుగుతున్నాయి.

\- యలమంచిలి సత్యమోహన్, రైతు, గొడవర్రు

### రైతులకు అన్యాయం జరగదు



ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం నిర్దేశించినట్లు ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. తుపాను నేపథ్యంలో మూడు రోజుల్లో 11 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం తరలించేందుకు వీలుగా 400 వాహనాలను వినియోగించాం. పనలపై ఉన్న వరి ధాన్యం కొంత మేర తడి చింది. రైతులు ఆరబెట్టి ధాన్యాన్ని తీసుకొస్తే కొంటాం. కొన్ని పత్రికల్లో వచ్చిన తప్పుడు వార్తలను చూసి ఆందోళన చెందొద్దు.

\- పి.రంజిత్‌బాషా, కలెక్టర్, కృష్ణా జిల్లా

## ఆర్బీకేల్లోనే తేమ శాతం నిర్ధారణ

- మిల్లర్లు కొలిచే దానిని పరిగణనలోకి తీసుకోం
- కృష్ణా జేసీ అపరాజితాసింగ్



మాట్లాడుతున్న కృష్ణా జేసీ అపరాజితాసింగ్, జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): రైతు భరోసా కేంద్రాల్లో ధ్రువీకరించిన తేమ శాతమే ఫైనల్ అని, మిల్లర్లు కొలిచే తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోబోమని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితాసింగ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో 262 రైతు భరోసా కేంద్రాలు ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 84వేల టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. మాండూస్ తుపాను సమయంలో ఎప్పటికప్పుడు పంటలను కాపాడుకునే విధంగా రైతులను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. తుపాను సమయంలో రైతులు ఇబ్బందులు పడకుండా కోసిన ధాన్యాన్ని 14 వేల టన్నులు సేకరించామని వివరించారు. ధాన్యాన్ని సేకరించిన రోజు నుంచి 21వ రోజులలోపు నగదును రైతు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. నగదు జమ కాలేదని ఇప్పటి వరకు ఏ రైతు ఫిర్యాదు చేయలేదని ఆమె తెలిపారు.

### సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర చెల్లించడంతో పాటు గోనె సంచులు, రవాణా ఖర్చులు, హమాలీ చార్జీలు అదనంగా భరిస్తోందని జేసీ తెలిపారు. ఈ విషయాల్లో ఎటువంటి సమస్యలు వచ్చినా తన కార్యాలయంలో కంట్రోల్ రూం నంబర్ 96520 14457, సివిల్ సప్లయీస్ డీఎం కార్యాలయంలో 83091 37215 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

- పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఆర్‌బీకేలలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించినప్పుడు ట్రక్ షీట్ జనరేట్ అయిన తర్వాత ఎఫ్‌టీఓ కాపీ తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు.
- జిల్లా వ్యవసాయ అధికారి మనోహరరావు మాట్లాడుతూ మాండూస్ తుపాను కారణంగా కురిసిన వర్షం నీరు పొలాల నుంచి బయటకు పోయేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు.

## న్యూస్‌రీల్

### ఇంటర్ బోర్డు పెన్షనర్ల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లా ఇంటర్ బోర్డు ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో సంఘం సర్వసభ్య సమావేశం జాయింట్ సెక్రటరీ జి.ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 2023-25 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సంపూర్ణరావు, ఉపాధ్యక్షులుగా పి.మధుసూదనరావు, టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కార్యదర్శిగా జి.ప్రభాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కటికల క్రిస్టోఫర్, ఎల్.శ్రీధర్, కోశాధికారిగా ఎ.గంగాధర్, గౌరవాధ్యక్షుడిగా కె.విశ్వనాథం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.కె.ఫణీంద్రరావు, ఈసీ సభ్యులుగా బి.బి.శశిభూషణ్, ఎస్.ఉషారాణి, ఎ.పద్మావతి, బి.వి.పార్వతిని ఎన్నుకున్నారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని, ప్రభుత్వానికి ఉద్యోగులకు వారధిగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

### కృష్ణా వర్సిటీ ఆర్చరీ జట్ల ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఆర్చరీ స్త్రీ, పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా విశ్వవిద్యాలయం జట్లను ఎంపిక చేసినట్లు విజయవాడ శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కె.శంకరరావు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఆర్చరీ పోటీలను శాతవాహన కళాశాల ఆధ్వర్యంలో మహానాడు రోడ్డులోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో సోమవారం నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో విజయ్ (వికాస్ కాలేజీ), అజయ్‌బాబు (డీఏఆర్ కాలేజీ), గాంధీ (పీబీ సిద్ధార్థ) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. ఈ పోటీల అనంతరం వర్సిటీ జట్లకు నిర్వహించిన పోటీల్లో ఇండియన్ రౌండ్ పురుషుల జట్టుకు విజయ్, అజయ్‌బాబు, గాంధీ, వంశీ, కాంపౌండ్ రౌండ్ పురుషుల జట్టుకు మనోజ్‌కుమార్, వెంకటాద్రి, కాంపౌండ్ రౌండ్ స్త్రీల జట్టుకు జ్యోత్స్న ఎంపికయ్యారని తెలిపారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు పంజాబ్‌లోని గురుకాశీ యూనివర్సిటీలో జరిగే అఖిల భాతర అంతర్ విశ్వవిద్యాలయాల ఆర్చరీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. జట్ల ఎంపిక కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, సి.హెచ్.సత్యనారాయణ, నిర్వహణ కార్యదర్శి డాక్టర్ సంగీతరావు వ్యవహరించారు.

### 15 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

విజయవాడ కల్చరల్: పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్, వైఎస్సార్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుంచి 40వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు పసుపులేటి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. తొలి రోజు సాతులూరి వారి ఓ రంగమ్మ కథ, హర్ష క్రియేషన్స్ వారి గురు గ్రహణం, 16న విశాఖపట్నం వారి ది లాస్ట్ జడ్జిమెంట్, కాకినాడ వారి చెత్త కుండీ, తిరుపతి వారి వార్నింగ్, 17న కొప్పోలు వారి పక్కింటి మొగుడు, ఏలూరు వారి మనసున మనసై, హైదరాబాద్ వారి దారుణం, 18న గుంటూరు వారి సూత్రం నాటికలను ప్రదర్శిస్తారని వివరించారు. చివరి రోజు విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

### 31లోపు ఫ్యాక్టరీ లైసెన్స్ రెన్యువల్ చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఫ్యాక్టరీల యజమానులు 2023 ఏడాదికి చెల్లించాల్సిన వార్షిక లైసెన్స్ ఫీజును ఈ నెల 31వ తేదీలోగా చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని ఉపప్రధాన తనిఖీ అధికారి కె.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ ఫీజును హెచ్‌టీటీపీ://సీఎఫ్ఎంఎస్‌డాట్‌ఏపీడాట్‌జీఓవీ డాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో సిటిజన్ చలాన్ ద్వారా చెల్లించాలని, అనంతరం ఆ చలానాను పటమటలోని కార్యాలయంలో దాఖలు చేయాలని సూచించారు. ఈ నెల 31వ తేదీలోపు ఫ్యాక్టరీల లైసెన్స్ రెన్యువల్ చేయకపోవతో నెలకు రెండు శాతం వడ్డీ విధిస్తామని ప్రకటించారు.

# గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

- 9 కి.మీ. మేర సాగే భవానీల పాదయాత్ర
- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు
- దారిలో మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు



ఫ్లై ఓవర్ దిగువన ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లు



గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్లకు మరమ్మతులు



గిరిప్రదక్షిణ చేస్తున్న భవానీ మాలధారులు (ఫైల్)

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్ష విరమణలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. దీక్ష విరమణల్లో అత్యంత కీలకమైన గిరి ప్రదక్షిణకు దేవస్థానం, నగర పాలక సంస్థ, ఇతర ప్రభుత్వ శాఖలు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాయి. తొమ్మిది కిలోమీటర్ల మేర సాగే గిరి ప్రదక్షిణలో భవానీలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వ యంత్రాంగం కల్పిస్తోంది. ఈ ఏడాది గిరి ప్రదక్షిణకు రికార్డు స్థాయిలో భవానీ మాలధారులు, భక్తులు, నగర వాసులు పాల్గొంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఉత్సవాల్లో నాల్గో రోజు ఆదివారం కావడంతో ఆ ఒక్క రోజే మూడు లక్షల నుంచి నాలుగు లక్షల మంది గిరిప్రదక్షిణలో పాల్గొనే అవకాశం ఉందని భావిస్తున్నారు. 14వ తేదీ సాయంత్రానికి భవానీలు విజయవాడకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఒక రోజు ముందుగానే ఏర్పాట్లను పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. దీక్షల విరమణకు విచ్చేసే భవానీలు, భక్తులు తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. స్నానఘాట్లలో ఏర్పాటు చేసిన క్లోక్ రూముల్లో తమ లగేజీని భద్రపరిచి, గురు భవానీల పర్యవేక్షణలో గిరి ప్రదక్షిణకు బయలుదేరుతారు. అమ్మవారి ఆలయం ఘాట్ రోడ్డు ప్రారంభంలో ఉన్న కామధేను అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరి కాయ కొట్టి గిరి ప్రదక్షిణ చేపడతారు.

**గిరిప్రదక్షిణ మార్గమిదే..**

ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే భవానీ మాలధారులు కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాలు, విద్యాధరపురం, చెరువు సెంటర్, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు సర్వీసు రోడ్డు మీదగా పాలప్రాజెక్టు, కలరా హాస్పిటల్, చిట్టినగర్, కేటీ రోడ్డు, శ్రీనివాస మహల్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదగా వినాయకుడి గుడికి చేరుకుంటారు. వినాయకుడి వద్ద ప్రారంభమయ్యే క్యూలైన్‌లోకి వెళ్లి ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. మొత్తం తొమ్మిది కిలోమీటర్ల మేర సాగే ఈ గిరిప్రదక్షిణను భవానీలు రెండున్నర నుంచి మూడు గంటల్లో పూర్తి చేస్తారు.

### కేటీ రోడ్డులో ప్రత్యేక జోన్

కేటీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా కార్పొరేషన్ అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిట్టినగర్ జంక్షన్ నుంచి నెహ్రూబొమ్మ సెంటర్ వరకు రోడ్డుకు ఒక వైపు మాత్రమే భవానీలు నడిచేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్న మార్గంలో వాహనాల రాకపోకలకు అనుమతిస్తారు. మరో వైపున గిరిప్రదక్షిణ మార్గంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ పనులు బుధవారం నాటికి పూర్తి చేసేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**మంచినీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు**

గిరిప్రదక్షిణ చేసే భవానీల దాహార్తి తీర్చేందుకు దేవస్థానం తొమ్మిది ప్రదేశాల్లో మంచినీటి ప్యాకెట్లను పంపిణీచేస్తుంది. కుమ్మరి పాలెం, చెరువు సెంటర్, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కలరా హాస్పిటల్, చిట్టినగర్, శ్రీనివాస మహల్, బ్రాహ్మణ వీధిలో మంచినీటి ప్యాకెట్ల పంపిణీ చేంద్రాలు ఉంటాయి. భవానీలకు ఎటువంటి ఆరోగ్య సమస్య తలెత్తినా వెంటనే వైద్యం అందించేందుకు ఆరు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

**20 మొబైల్ టాయిలెట్లు**

గిరి ప్రదక్షిణలో భవానీలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాలప్రాజెక్టు ఫ్లై ఓవర్ వద్ద 20 మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నీటి సదుపాయాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. మరో వైపు టాయిలెట్లను శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా 24 గంటలు పని చేసేలా సిబ్బందిని నియమించారు. గిరిప్రదక్షిణ మార్గంలోకి కీలక ప్రాంతాలైన సితార జంక్షన్, చిట్టినగర్ జంక్షన్, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధుల్లో ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను దాటుకుని భవానీలు రోడ్డుకు మరో వైపున చేరుకోవాల్సి ఉంది. దీంతో వారికి ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా మూడు షిఫ్టుల్లో పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారు.

## గడువులోగా అర్జీలను పరిష్కరించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, డీఆర్వో కె.మోహన్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలలో 75 శాతం వరకు రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటున్నాయని, డివిజన్, మండల సచివాలయ స్థాయిలోనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించిన వెంటనే అర్జీదారుని ఫొటో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టంచేశారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలకు సంబంధించి ప్రతి శనివారం సంబంధిత అర్జీదారులు, అధికారులతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నామ వివరించారు.

**స్పందనలో 85 అర్జీలు**

స్పందన కార్యక్రమంలో మొత్తం 85 అర్జీలు నమోదయ్యాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 22, పోలీస్ 14, మునిసిపల్ శాఖ 10, విద్య 9, వైద్యం 5, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 5, ఎంప్లాయిమెంట్ 5, పంచాయతీరాజ్ 4, వ్యవసాయం 3, మిగిలిన శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చిందని వివరించారు. జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ వర్చువల్‌గా మాట్లాడి కొన్ని వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. డ్వామా పీడీ జె.సునీత, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీదేవి, మార్కెటింగ్ డీడీ దివాకర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం.విజయభారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ బృందంతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు(ఫైల్)

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ గుర్తింపు లభించింది. కళాశాలలో మెరుగైన విద్యా బోధన, మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకున్న నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) నుంచి ఈ గుర్తింపు లభించిందని, ఈ మేరకు ఉత్తర్వులు అందాయని ప్రిన్సిపాల్ అట్లూరి పద్మావతి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రికల్ డిప్లొమా కోర్సుల విద్యార్థులకు అవసరమైన వర్క్ షాపు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, కమ్యూనికేషన్ ల్యాబ్‌లు, విశాలమైన ఆట స్థలం అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ బృందం కళాశాలలో వసతులను క్షుణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. ఆ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఎన్‌బీఏ గుర్తింపు కలిగిన మూడో కళాశాలగా తమ సంస్థ నిలిచిందని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో జాతీయ గుర్తింపు పొందిన, ఎలక్ట్రికల్ విభాగంలో రాష్ట్రంలో తొలి కళాశాలగా కూడా కీర్తి సాధించిదని వివరించారు. జాతీయ గుర్తింపు రావడానికి కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది, వర్క్ షాపు సిబ్బందికి అభినందనలు తెలిపారు. కాలేజీ మెకానికల్ కోఆర్డినేటర్ వి.ఎలిషా వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రాష్ట్ర రోయింగ్ జట్టుకు జెర్సీలు బహూకరణ



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ రోయింగ్ సబ్ జూనియర్ బాలబాలికల పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లకు ఆంధ్రప్రదేశ్ రోయింగ్, స్కల్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తరుణ్ కాకాని జెర్సీలను బహూకరించారు. హైదరాబాద్‌లో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన జట్లకు విజయవాడలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో జెర్సీలను సోమవారం అందజేశారు. అనంతరం బబ్బూరి భూపాల్ ఒక్కో క్రీడాకారుడికి రూ.5 వేలను వితరణగా ఇచ్చి జాతీయ పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

### సబ్‌జైలు తనిఖీ చేసిన జైళ్ల శాఖ డీఐజీ

అవనిగడ్డ: స్థానిక సబ్‌జైలును సోమవారం జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న భోజన వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమా అని ఆరా తీశారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆవేశంలోనో తెలిసో తెలియక చేసిన తప్పుల వల్లనో జైలుకు వచ్చి ఉండవచ్చని, సత్ప్రవర్తనతో మెలగడం ద్వారా పూర్వ జీవితాన్ని పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ అవనిగడ్డ సబ్‌జైలుకు రెండవ ఫేజ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం స్టోర్ రూం, జైలు గదులు, తాగునీటి వసతి, జైలు పరిసరాలను ఆయన పరిశీలించారు. అవనిగడ్డ సబ్ జైలులో పరిస్థితుల గురించి సబ్‌జైలు అధికారి కుశకుమార్, హెడ్‌వార్డర్ పెద్దిరాజును అడిగి తెలుసుకున్నారు.

### కేఎల్‌యూ ఆర్కిటెక్చర్ విద్యార్థికి బెస్ట్ థీసిస్ అవార్డు

తాడేపల్లి రూరల్: కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్చర్ విద్యార్థి టి.పవన్‌కుమార్ బెస్ట్ థీసిస్ అవార్డు దక్కించుకున్నారు. ఐఐఏ నిర్వహించిన పోటీలలో అవార్డు గెలుచుకున్నట్లు ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఎ.ప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆర్కిటెక్చర్ నిర్వహించిన పోటీలలో పవన్‌కుమార్ ప్రథమ స్థానాన్ని సాధించినట్లు చెప్పారు. విద్యార్థిని కళాశాల వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ సెల్వరాజ్ అభినందించారు.

## ఆకలి మరణాల నివారణకే మధ్యాహ్న భోజన పథకం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి



పరిటాల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

కంచికచర్ల: ఆకలి మరణాలు ఉండకూడదనే ఉద్దేశంతో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీతో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ శాఖ హాస్టళ్లలో విద్యార్థులను నాణ్యమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కంచికచర్ల, మండలంలోని పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నాల్గవ తేదీనుంచి ఇప్పటివరకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో తనిఖీలు చేశామని, తనిఖీలు నిర్వహించిన అన్నింటిలో మార్పు కనిపిస్తోందన్నారు. అధికారుల వల్ల లోపాలు వున్నా, వంట ఏజెన్సీ నిర్వాహకుల వల్ల లోపాలు ఉన్నా వెంటనే సరిచేసుకోవాలని, లేకపోతే చర్యలు తక్షణమే తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు భోజనం అందించే విషయంలో ఎవరూ కక్కుర్తి పడకూడదన్నారు. సివిల్ కోర్టు న్యాయమూర్తికి ఉన్న అధికారాలు తనకు పూర్తిస్థాయిలో ఉన్నాయన్నారు. కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 540 మంది విద్యార్థులుంటే కేవలం 200 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారని ఎందుకంటే వంట సక్రమంగా లేదని ఆరోపణలు వస్తున్నాయన్నారు. మరోసారి ఇదే స్కూల్‌కు వస్తానని పాఠశాలలో చదివే విద్యార్థులందరూ భోజనాన్ని తినేలా చూడాలని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీలను ఆదేశించారు. పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట బాగా తయారు చేస్తున్నారని, పాఠశాలలో ఉన్న విద్యార్థులందరితో పాటు తాను కూడా భోజనం చేశానని చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ మూర్తి, జిల్లా సివిల్ సప్లయి అధికారి కోమలి పద్మజ, డీవైఈఓ రవికుమార్, సీడీపీఓ లక్ష్మీభార్గవి, ఎంఈఓ ఎల్.చిట్టిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలశంకరరావు, డీటీ ఇస్మాయేలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అపోహలు సృష్టిస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- మద్దూరులో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటన
- ధాన్యం తేమశాతం పరిశీలనలో మోసం అనేది అవాస్తవం
- పచ్చమీడియా కథనంపై ఆగ్రహం



అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: రైతులను అయోమయానికి గురి చేస్తూ, అపోహలు సృష్టిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. రైతు ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన మద్దూరు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. తేమశాతం పేరుతో దోపిడీ జరుగుతోందంటూ ఓ పత్రికలో వచ్చిన కథనంపై ఎమ్మెల్యే పార్థసారథి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అధికారులు, రైతులతో ముఖాముఖి మాట్లాడారు. తేమ శాతం ఆధారంగానే ధర నిర్ణయం జరిగిందని, సర్వర్ సమస్యలతో రైతులకు ఫోన్ మెసేజ్ చేరలేదని, ఎఫ్‌టీఓ ప్రకారం సొమ్ము చెల్లింపులు జరుగుతాయని నిర్ధారించి, ఆ పత్రిక కథనం అవాస్తవం అని తేల్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 17 శాతం తేమ ఉండాలని, ఆపైన ఉంటే ఒక్కో శాతానికి ఒక్కో కిలో చొప్పున తగ్గించి ధర నిర్ణయం చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసి కనీస మద్దతు ధర అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో ధాన్యం కొనుగోలు సీజన్‌లో దళారులు, మిల్లర్ల ప్రభావంతో సరైన ధర అందక రైతులు నష్టాలను చవిచూశారన్నారు. దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపటం కోసం ఆర్‌బీకే వ్యవస్థను పటిష్టపరిచి రైతు పక్షాన ప్రభుత్వం నిలిచిందన్నారు. దళారులకు లబ్ధి చేకూరలేదనే సాకుతో ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయటం సరికాదన్నారు.

**తేమలో తేడా చూపితే మిల్లరుపై చర్యలు**

ఆర్‌బీకేలో ఒక తేమ శాతం, మిల్లరు వద్ద మరో తేమశాతం నమోదవుతుందని అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నామని రైతులు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ మిల్లరు తేమశాతం పేరుతో ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే తక్షణమే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. తనకు రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే సంబంధిత మిల్లరుపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించాలని రైతులు కోరగా గోనె సంచులు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా అవుతున్నాయని, రాష్ట్రంలోనే కంకిపాడులో అత్యధికంగా ధాన్యం సేకరణ జరిగిందన్నారు. లారీలు అందుబాటులో లేకపోతే ట్రాక్టర్ల ద్వారా కూడా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయీస్ డీఎం శ్రీధర్‌కు సూచించారు. సమీక్షలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రి బోర్డు చైర్మన్ చాట్ల విజయ్ బాబు, సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, తహసీల్దార్ టీవీ సతీష్, వ్యవసాయాధికారి పీఎం కిరణ్ పాల్గొన్నారు.

## రైతుల గుండె చప్పుడు వైఎస్ జగన్

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- శనగపాడులో ప్రభుత్వ విప్ ఉదయభానుతో కలిసి సొసైటీ భవన ప్రారంభం



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన ప్రారంభోత్సవంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, పక్కన ప్రభుత్వ విప్ ఉదయభాను

శనగపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతుల గుండె చప్పుడు అయ్యారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. గ్రామంలో రూ.31.55 లక్షలతో నిర్మించిన నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయంతో పాటు సహకార రంగాలను అభివృద్ధి చేస్తూ రైతుల ముఖాల్లో చిరునవ్వు చూస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి విక్రయం దాకా అన్ని రకాల సేవలను అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదే అన్నారు. పంటకు గిట్టుబాటు ధర, పంట నష్టపోతే వెంటనే నష్టపరిహారం అందిస్తున్న రాష్ట్రం ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న వ్యవస్థలు, పథకాలను చూసి ఇతర రాష్ట్రాల వారు వచ్చి అధ్యయనం చేసి వారి రాష్ట్రాల్లో అమలు చేయాలని చెబుతుంటే ఇక్కడ ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, అతని పచ్చమీడియాకు మాత్రం అవేమీ కనబడటం లేదన్నారు.

ప్రభుత్వవిప్ ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగ వ్యవస్థను బలోపేతం చేసే దిశలో భాగంగా సహకార శాఖ నూతన భవనాల నిర్మాణంతో పాటు బ్యాంకింగ్ సేవలు అన్నీ అందుబాటులోకి తెస్తున్నారన్నారు. సహకార సంఘాల ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు విదేశీ విద్యకు కూడా రుణాలు అందిస్తున్నారన్నారు. 2024లో రాష్ట్రంలో తిరిగి జగనన్న ప్రభంజనం ఖాయమన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, సొసైటీ అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, సర్పంచ్‌లు కీసర సైదులు, వేల్పుల పద్మరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**జన్మభూమి కమిటీలతో రాష్ట్రాన్ని దోచుకున్నారు**

గత చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగ నాగార్జున అన్నారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనం ప్రారంభోత్సవం, సెమీ క్రిస్మస్ వేడుకల అనంతరం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. గౌరవ వేతనంతో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా పనిచేస్తున్న వలంటీర్లపై పచ్చ మీడియా రాతలు దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, కుమారి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లోనూ వీరు పాల్గొన్నారు

### యార్డుకు 14,873 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 14,873 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 14,234 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.11,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.15,500 నుంచి రూ.23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.14,000 నుంచి రూ.21,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,952 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

## ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

స్పందనలో కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా



స్పందనలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ జాషువా

కోనేరుసెంటర్(మచిలీపట్నం): స్పందనలో అందిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో పాల్గొన్న ఆయన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలపై స్పందించిన ఎస్పీ బాధితులందరికీ తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికే స్పందన అని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించటమే పోలీసుల కర్తవ్యమన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. బాధితులతో అమర్యాదగా వ్యవహరించినా, సమస్యల పరిష్కారంలో అవినీతి ఆరోపణలు వచ్చినా ఉపేక్షించేది లేదన్నారు.

**ప్రధానమైన అర్జీలు ఇవే...**

- స్నేహితుడు ప్రభుత్వ ఫార్మా కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.5 లక్షలు తీసుకున్నాడని, డబ్బులు తీసుకుని ఏడాది కావస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోగా ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వడం లేదని పెనమలూరుకు చెందిన వంశీ వాపోయాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు.
- గూడూరుకు చెందిన వీరయ్య అనే వృద్ధుడు ఎస్పీని కలిసి తనకు ముగ్గురు సంతానం కాగా, కుమార్తెకు కట్నం ఇచ్చి వివాహం జరిపించానని, మిగిలిన ఇద్దరు కుమారులకు ఆస్తులను సమానంగా పంచి ఇచ్చానని చెప్పాడు. తన కోసం అట్టిపెట్టుకున్న వ్యవసాయ భూమిని తమ పేరు మీదకు రాయాలని కుమారులు ఇద్దరూ ఒత్తిడి తెస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరాడు.
- పమిడిముక్కల నుంచి మానస అనే వివాహిత ఎస్పీని కలిసి అధిక కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని, అత్తింటి వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం జరిగేలా చూడాలని ప్రాధేయపడింది.

### దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.32 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.3.32 కోట్లను కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 20 రోజులకు గాను 45 హుండీల ద్వారా రూ.3,32,54,847 మొత్తం నగదు ఆదాయంగా లభించినట్లు ఆలయ ఈవో భ్రమరాంబ అన్నారు. సగటున రోజుకు రూ.16.62 లక్షలు చొప్పున దేవస్థానానికి ఆదాయం సమకూరిందని అధికారులు అన్నారు. నగదుతో పాటు 909 గ్రాముల బంగారం, 8.672 కిలోల వెండి లభ్యమైంది. ఇక ఈ హుండీల ద్వారా రూ.76,480 విరాళాల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించారన్నారు. కానుకల లెక్కింపులో ఆలయ సిబ్బంది, సేవా సిబ్బందితో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### స్పా నిర్వాహకుల అరెస్ట్

పటమట(విజయవాడతూర్పు): మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న స్పా సెంటర్ నిర్వాహకులను సోమవారం పటమట పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణమండపం సమీపంలో ఉన్న కె.స్టూడియోలో మసాజ్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నారని, దీనిపై తమకు అందిన సమాచారంతో తాము దాడి చేసి ఇద్దరు నిర్వాహకులను, ఎనిమిది మంది యువతులను, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నామని సీఐ కాశీనాథ్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

### బైక్ ఢీకొని మహిళ మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు గ్రామానికి చెందిన గునగంటి వెంకట్రావు ఆదివారం నున్నలో ఉంటున్న బంధువుల గృహ ప్రవేశానికి కుటుంబ సమేతంగా హాజరయ్యాడు. ఫంక్షన్ పూర్తయిన తర్వాత తన ఆటోలో తిరిగి ఇంటికి బయలుదేరగా, పైపుల రోడ్డు వద్దకు వచ్చేసరికి వన్‌వేలో వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వెంకట్రావు తల్లి పద్మకు గాయాలు కాగా వెలగలేరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పద్మను పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషయంగా ఉందని, వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. దీంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే పద్మ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### డీజిల్ దొంగలు తండ్రీ కొడుకులు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): వాహనాల్లో డీజిల్ దొంగిలిస్తున్న తండ్రీ కొడుకులను చిలకలపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం రామానాయుడుపేటకు చెందిన జొన్నల కన్నయ్య సివిల్ సప్లయి కాంట్రాక్టర్ పనులు చేస్తుంటాడు. అతనికి పది లారీలు ఉన్నాయి. ఆ లారీలను మార్కెట్‌యార్డులో పార్కింగ్ చేసి ఉంచుతాడు. అయితే ఇటీవల కొంతకాలంగా పార్కింగ్ చేసి ఉన్న లారీల్లో డీజిల్ మాయం అవుతుండటంతో అనుమానం వచ్చిన కన్నయ్య స్థానికులను ఆరా తీయగా లారీలో డీజిల్‌ను ఇద్దరు వ్యక్తులు చోరీ చేస్తున్నట్లు చెప్పారు. దీంతో కన్నయ్య సోమవారం పోలీసుల సహాయంతో కాపు కాయగా సర్కారుతోటకు చెందిన నాంచారయ్య, అమలేశ్వర అనే ఇద్దరు లారీల్లో డీజిల్ దొంగిలిస్తూ కనిపించారు. పోలీసులు వారిరువురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పట్టుబడిన ఇరువురు తండ్రీకొడుకులుగా పోలీసుల విచారణలో తేలింది. నిందితులు ఇరువురిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

## భవానీ దీక్ష విరమణలకు ఇంద్రకీలాద్రి ముస్తాబు

విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతున్న ఆలయం



విద్యుద్దీపాలంకరణలో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి భవానీ దీక్షల విరమణలకు ముస్తాబైంది. ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే దీక్ష విరమణలకు సకల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. దీక్ష విరమణలలో భాగంగా అమ్మవారి ఆలయంతో పాటు మహామండపం, ఘాట్‌రోడ్డు, టోల్‌గేట్, దుర్గాఘాట్ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చైనా వాల్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. కనకదుర్గనగర్, మహా మండపం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత హోర్డింగ్‌లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. సోమవారం విద్యుత్ లైట్లను దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ఉత్సవాల ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూస్తున్నామని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

## ముగిసిన సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్‌బీఆర్‌సీఈ)లో మూడు రోజులుగా జరుగుతున్న సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు, ఎంపికలు సోమవారం ముగిశాయి. జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2021–22 ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగాయి. జేఎన్టీయూకే, కాకినాడకు చెందిన 18 కళాశాలలు, సెలక్షన్ కోసం వివిధ కళాశాలల నుంచి 40మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాజమండ్రికి చెందిన జీఐటీ కళాశాల ప్రథమ స్థానం సాధించగా, విజయనగరం ఎంవీజీఆర్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానాన్ని విజయవాడ పీవీపీఎస్ కళాశాల పొందింది. టోర్నమెంట్ సెలక్షన్స్ ఆధారంగా జేఎన్టీయూకే ఫుట్‌బాల్ టీమ్‌కు మొత్తం 20మంది విద్యార్థులను ఎంపిక చేయగా స్థానిక ఎల్‌బీఆర్‌సీఈ నుంచి ఆర్.గోపీకృష్ణ, జి.దేవీవరప్రసాద్‌ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, జేఎన్టీయూకే స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌కుమార్, ఇంటర్ కాలేజియేట్ సెక్రటరీ జీపీ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్వీ రాజ్‌కుమార్, ఎం బేబీరాణి, బి.నాగరాజును కళాశాల గౌరవ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, అభినందించారు.

## క్లుప్తంగా

### తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా నగరంలోని అన్ని డివిజన్లలో తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేందుకు అందరూ వీఎంసీ అందించిన మూడు రంగుల చెత్త బుట్టలను వినియోగించాలని వీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రధాన అధికారి డాక్టర్ పి. రత్నావళి తెలిపారు. సోమవారం క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్)లో భాగంగా ఈ నెల 18 నుంచి 22 వరకు వారం రోజుల పాటు నగరంలోని 64 డివిజన్ల పరిధిలోని 286 వార్డు సచివాలయాల ప్రాంతాల్లో వీటిని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సోమవారం 51వ డివిజన్లోని 161 సచివాలయ పరిధిలో, 40వ డివిజన్ పరిధిలోని 124 సచివాలయం వద్ద స్థానికులకు చెత్త బుట్టల పంపిణీ లక్ష్యాన్ని వివరించారని పేర్కొన్నారు. నగరంలోని మూడు లక్షల కుటుంబాలకు ఇళ్ల నుంచి వచ్చే చెత్తను అక్కడే తడి, పొడి ప్రమాదకర వ్యర్థాలుగా విభజించి, తడి చెత్తను ఆకుపచ్చ బుట్టలో, పొడి చెత్తను నీలిరంగు బుట్టలో, ప్రమాదకర వ్యర్థాలు ఎరుపు రంగు బుట్టలో వేసి పారిశుద్ధ్య నిర్వాహణ సిబ్బందికి అందించాలని తెలిపారు.

### ఎక్సెల్ ప్లాంట్ సందర్శన

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్ నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌ను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలసి పరిశీలించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ప్లాంట్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్లాంట్‌లో నూతనంగా రెండు ఎంట్రెన్స్ గేట్లను ఏర్పాటు చేయాలని, ఆ గేట్ల నుంచి వేబ్రిడ్జి వరకు రోడ్డు వేయాలని, ప్లాంట్ ఆవరణలో పనుల మ్యాప్‌ను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్సెల్ ప్లాంట్‌లో ఉన్న ఐకానిక్ పార్కులో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఈఈ ఏఎస్ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 20న ఔషధ పరిశోధనలపై సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మందుల పరిశోధనలలో ముఖ్యమైన మైలురాళ్లను నేటి తరానికి తెలియజేసేందుకు ఐకానిక్ మైల్ స్టోన్స్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ పేరుతో ఈ నెల 20వ తేదీన ఇండో–యూఎస్ సదస్సు నిర్వహించనున్నట్లు కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత తెలిపారు. ఆ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఈ సదస్సులో అమెరికాకు చెందిన టెక్సాస్ ఏఅండ్ఎం యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ డి.సాంబారెడ్డి, కేంద్ర ప్రభుత్వ పరిశోధనాసంస్థ సీఎస్ఐఆర్–ఐఐసీటీ సంస్థకు చెందిన సీనియర్ సైంటిస్టు డాక్టర్ కె.సురేష్‌బాబు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మకాగ్నసీ విభాగాధిపతి వి.కరుణశ్రీ పాల్గొన్నారు.

# ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదు

**వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్**



చెక్కులను అందజేస్తున్న దేవినేని అవినాష్

గుణదల (విజయవాడ తూర్పు): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు జనరంజకంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించి, అమలు పరుస్తున్న పథకాల ద్వారా పేదలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం పేదల పాలిట వరంగా మారిందన్నారు. వెయ్యి రూపాయలు పైబడిన వైద్య సేవలను సైతం ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చారని తెలిపారు. దీనికి తోడు ఇతర రాష్ట్రాలలో సైతం ఈ పథకం వినియోగపడేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెసులుబాటు కల్పించారని చెప్పారు. అనంతరం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 4, 21, 22 డివిజన్లకు చెందిన శేషమ్మ, భారతీ, వెంకటేశ్వరరావు, కుమారికి రూ.6 లక్షల సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుప్పాల కుమారి, తాడిపర్తి కొండా రెడ్డి, 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా రవి, వైఎస్సార్ సీపీ నాయకులు సొంగా రాజ్‌కమల్, పులి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు



మంత్రి సత్యనారాయణను సత్కరిస్తున్న విజ్ఞాన విహార్ నిర్వాహకులు



సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును సత్కరిస్తున్న నిర్వాహకులు

**సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు**

విజయవాడ కల్చరల్: విలువలతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. విద్యాభారతి అనుబంధ సంస్థ విజ్ఞాన విహార్ స్కూల్ సత్యనారాయణపురం బ్రాంచ్ 40 వార్షికోత్సవాన్ని దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లాది విష్ణు మాట్లాడుతూ బాల బాలికలలోని ప్రతిభను తల్లిదండ్రులు బాల్యంలోనే గుర్తించి, ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. విద్యావ్యాప్తి కోసం విద్యాభారతి సంస్థ కృషిని అభినందించారు. విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ శాఖ డాక్టర్ కేవీ ఆనందం మాట్లాడుతూ దేశభవిష్యత్‌ను నిర్ణయించేది బాల బాలికలలోని వారిని ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు విద్యాభారతి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజ్ఞాన విహార్ విద్యాసంస్థల అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి, కోశాధికారి కే శ్యాంభువు ప్రసంగించారు. బాల బాలికలు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, భక్తి గీతాలు, యోగా, మాక్ డ్రిల్, శాస్త్రీయ, లలిత సంగీతం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**సంస్కార వంతమైన జీవితం అలవాటు చేసుకోవాలి**

బాల బాలికలు సంస్కారవంతమైన జీవితం అలవాటు చేసుకోవాలని దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. భవిష్యత్‌ను తీర్చిదిద్దే చదువును విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. చదవుతోపాటు లలిత కళలను కూడా నేర్చుకోవాలన్నారు. నిర్వాహకులు మంత్రి కొట్టు సత్యనారాయణను ఆత్మీయంగా సత్కరించారు.

## కల్యాణ్ జ్యూయలర్స్‌లో తనిఖీలు

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని కల్యాణ్ జ్యూయలర్స్‌లోతూనికలు, కొలతల అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్య, అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. వజ్రాలు, రాళ్ల పొదిగిన ఆభరణాలు, స్టోన్ వెయిట్, బంగారు ఆభరణాలపై వేసిన ట్యాగ్‌లను, వెయింగ్ మిషన్లను పరిశీలించారు. రెండు గంటల పాటు తనిఖీలు సాగించిన అనంతరం పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని అధికారులు తెలిపారు.

## ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో 'హెల్త్ మేళా' ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలలో ఇక నుంచి ప్రతి నెలా 14వ తేదీన 'హెల్త్ మేళా'ను నిర్వహించనున్నామని, ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఎస్‌కే ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవి కోరారు. సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్త్ మేళాను సోమవారం ఆమె ప్రారంభించారు. ప్రధానంగా ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు 10 నుంచి 19 ఏళ్ల వయస్సులోపు చిన్నారులకు కౌమార దశలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లోని ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు కౌమారదశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించామని తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు దీటుగా నేడు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో అన్ని వసతులు కల్పించామని, ప్రజలు ముందుగా సమీపంలో ఉన్న హెల్త్ సెంటర్లను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనరల్ చెకప్‌తో పాటుగా కొత్తగా ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్‌లను కూడా వారంలో ఒక రోజు హెల్త్ సెంటర్‌లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కీళ్ల సంబంధిత వ్యాధులతో బాధపడే వారు కూడా అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా ఉచిత వైద్య సేవలను పొందుకోవచ్చన్నారు. డాక్టర్ సైరాభాను మాట్లాడుతూ హెల్త్ మేళా వల్ల ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారితో పాటు కౌమారదశలో ఉన్న పేద విద్యార్థులకు, యువతకు ఇటువంటి కార్యక్రమాల వల్ల మేలు జరుగుతుందన్నారు. వారికి అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడం, తరచూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించడం చేస్తున్నామన్నారు.

## అన్ని శాఖల సమన్వయంతో దీక్ష విరమణలు



ఘాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్



స్నానఘాట్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని, అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్ష విరమణలకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని పేర్కొన్నారు. భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని దుర్గగుడి, కెనాల్‌రోడ్డు, స్నానఘాట్లలో ఏర్పాట్లను సోమవారం డీసీపీ పరిశీలించారు. గిరి ప్రదక్షణ మార్గాలతో పాటు స్నానఘాట్లు, హోమగుండాలు, ప్రసాదం కౌంటర్లు, క్యూలు, అమ్మవారికి ఆలయంలోని మెట్లు, లిఫ్టుమార్గాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి దీక్ష విరమణలకు విచ్చేసే భవానీలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అందరికీ అమ్మవారి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ విశాల్‌గున్ని పేర్కొన్నారు. ముఖ్యంగా అమ్మవారి దర్శనంతో పాటు ఇరుముడి సమర్పణ, ప్రసాదాల కౌంటర్లు, స్నానఘాట్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. పర్యటనలో ట్రాఫిక్ డీసీపీ కె. శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏడీసీపీ టీ సర్కార్, సౌత్ ఏసీపీ డాక్టర్ బీ రవికిరణ్, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, వన్‌టౌన్ సీఐ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఘాట్ల పరిశీలన**

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 15 నుంచి జరగనున్న దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దీక్షా మాల విరమణల్లో ఘాట్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఆయన సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి భవానీఘాట్, దుర్గఘాట్, పున్నమి ఘాట్ తదితర ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అందుబాటులో ఉంచిన వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగితెలుసుకుని పలు సూచనలు చేశారు. ఘాట్లలో ఎప్పటికప్పుడు మెరుగైన పారిశుద్ధ్య పరిస్థితులను నెలకొల్పాలని ఘాట్‌ల వద్ద భక్తులను నది లోకి వెళ్లకుండా నదిలో ఏర్పాటు చేసిన ఇనుప మెస్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఘాట్‌ల వద్ద నిరంతరం సిబ్బంది విధులలో ఉంచి పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు శుభ్రపరచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వ్యర్థాలు, దుస్తులు నదిలో వేయకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఘాట్ ఇన్‌చార్జి అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఈఈ నారాయణమూర్తి, హెల్త్ ఆఫీసర్లు, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన స్పందనలో వీరిరువురూ నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అధికారులు స్పందనలో వచ్చే సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతివారం స్పందన సమస్యలపై నివేదికను తనకు అందించాలన్నారు. పరిష్కరించినవి, పరిష్కరించాల్సినవి, ఎందుకు ఆలస్యమయ్యిందో నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 19 అర్జీలు రాగా అందులో అదనపు కమిషనర్(జనరల్)–1, ప్రజారోగ్య విభాగం నుంచి –2, ఎస్టేట్స్ విభాగం నుంచి –1, ఇంజినీరింగ్–5, పట్టణ ప్రణాళిక విభాగం–4, రెవెన్యూ–3, పట్టణ సాధికారిత విభాగం –3 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్(జనరల్) ఎం.శ్యామల, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సాధికారాభివృద్ధి విభాగం ప్రాజక్టు అధికారి శకుంతల, డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, అమృత్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేబీఎన్ఎస్ లత, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాసు, మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**సర్కిల్ కార్యాలయాల్లో**

నగర పాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్ల పరిధిలో జరిగిన స్పందనలో సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో రెవెన్యూ–1, హౌసింగ్–1 ఫిర్యాదు రాగా, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో ఇంజినీరింగ్‌పై–1, పట్టణ ప్రణాళిక విభాగంపై–1 అర్జీలు వచ్చాయి. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో ఎలాంటి అర్జీలు రాలేదని అధికారులు తెలిపారు.

## రామ్‌కో సిమెంట్ కంపెనీ సహకారం అభినందనీయం



వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలకు రామ్‌కో సిమెంట్ లిమిటెడ్ సంస్థ సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థకు రూ.14.50 లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన టాటా వింగర్ వాహనాన్ని కలెక్టర్ ఢిల్లీరావు సోమవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక సేవా కార్యక్రమాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. వారు అందించే సేవలలో రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా రెడ్ క్రాస్ సంస్థ పలు సేవా కార్యక్రమాలతో పాటు మారుమూల ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలందించడం, వారికి అవసరమైన ఉపకరణాలు, మందులు, నిత్యావసర సరుకులు అందిస్తోందన్నారు. ప్రజలకు సేవలందించడంలోను, గ్రామాలలో పర్యటనలకు ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థకు కేవలం ఒక అంబులెన్స్ మాత్రమే ఉందన్నారు. ఈ సేవలను మరింత విస్తృత పరిధి సకాలంలో ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు ప్రత్యేక వాహనం అవసరం ఏర్పడిందన్నారు. ఈ విషయమై రామ్‌కో సిమెంట్‌ను సంప్రదించగా నూతన వాహనాన్ని బహూకరించారన్నారు. రెడ్ క్రాస్ సంస్థ అవసరాలకు రూ.14.50 లక్షల వ్యయంతో వాహనాన్ని అందించారు. ఈ వాహనం ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు దోహదపడుతుందన్నారు. రెడ్ క్రాస్ సంస్థ విరాళాలు కోరిన వెంటనే స్పందించి విరాళాలు ఇస్తున్న దాతలను కలెక్టర్ అభినందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జి. సమరం, ది రామ్ కో సిమెంట్ లిమిటెడ్ డీజీఎం యు.సీతారామరాజు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.చిదంబరం పాల్గొన్నారు.

## అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): మధ్యప్రదేశ్ విదిషాలోని ఎస్ఎస్ఎల్ జైన్ పీజీ కాలేజీ 1970 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం విజయవాడ గురునానక్ నగర్‌లోని సిల్వర్‌స్పూన్ హోటల్‌లో సోమవారం జరిగింది. అక్కడ చదువుకుని వివిధ రంగాల్లో తమ సేవలను అందించి విశ్రాంత జీవనం గడుపుతున్న వారంతా మళ్లీ ఒకచోట చేసి చేరి తమ జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు హాజరై ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. నాటి మధుర స్మృతులను తలచుకుంటూ సరదాగా గడిపారు. ఈ సమ్మేళనానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి, కృష్ణా జిల్లా మాజీ కలెక్టర్ ప్రభాకరరెడ్డి, విశ్రాంత ఐపీఎస్ అధికారి వీఆర్ మోహనరావుతో పాటు వ్యాపారవేత్తలు జె.కె. బాపిరెడ్డి, సిద్ధివినాయక బజాజ్ అధిపతి కె.వి.బాబులరెడ్డి, టి.ఆర్.కె. ప్రసాద్, కృష్ణారావు, వెంకటరత్నం, గంగాధరరావు, రామకృష్ణ, విష్ణువర్ధనరావు తదితరులు తమ కళాశాల్లో గడిపిన రోజులను మననం చేసుకున్నారు.

## కృష్ణా తరంగ్-2022లో సిద్ధార్థ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఈ నెల 9, 10 తేదిల్లో కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృష్ణా తరంగ్–2022 పేరుతో నిర్వహించిన అంతర్ కళాశాలల యువజనోత్సవాల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులను సోమవారం కళాశాల ఆవరణలో అభినందించారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ యువజనోత్సవాల్లో మొత్తం 27 అంశాల్లో పోటీలు నిర్వహించగా వాటిలో 23 పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు బహుమతులు పొందారని చెప్పారు. కర్నాటిక్, హిందూస్థానీ, గాత్ర సంగీతం, సాంప్రదాయ వాయిద్య పరికరాలు, లలిత సంగీతం, శాస్త్రీయ నృత్యం, మిమిక్రీ, వ్యంగ్య చిత్రాలు, క్విజ్, భారతీయ బృందగానం, జానపద వాయిద్య పరికరాలల్లో మొదటి బహుమతిని పొందారని పేర్కొన్నారు. కృష్ణా యువజనోత్సవాల్లో వరుసగా నాలుగో సారి తమ కళాశాల ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పుడు ఈ పోటిల్లో విజేతలైన విద్యార్థులు జనవరి మొదటి వారంలో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం తరపున తమ కళాశాల విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సహ కార్యదర్శి నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్, కళాశాల కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.

## యూత్‌ఫెస్టివల్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ



ఆల్‌రౌండ్ చాంపియన్స్ రన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట(విజయవాడతూర్పు): కృష్ణా యూనివర్సిటీ యూత్‌ఫెస్టివల్ కృష్ణతరంగ్‌లో నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆల్‌రౌండ్ చాంపియన్స్ రన్నర్స్‌గా నిలిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. తమ విద్యార్థులు మెహందీ, మైమ్, వెస్ట్రన్, గ్రూప్‌సాంగ్, క్లే మౌల్డింగ్‌లో ప్రథమ బహుమతులు పొందగా, స్పాట్ ఫొటోగ్రఫీ, క్లాసికల్ డ్యాన్స్, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంట్‌లో ద్వితీయ బహుమతులు పొందినట్లు తెలిపారు. కాగా స్కిట్, డిబేట్‌లలో తృతీయస్థానంలో నిలిచారన్నారు. ఇలా పలు విభాగాల్లో పతకాలు సాధించి ఆల్‌రౌండ్ చాంపియన్స్ రన్నర్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎ.విజయబాబు ప్రత్యేకంగా అభినందించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## కరాటే పోటీల్లో విజయవాడ క్రీడాకారుల హవా



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్, ప్రిన్సిపాల్

విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజయవాడలోని శ్రీరామ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ చిన్నారులు సత్తా చాటారు. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 11వ తేదీన ఈ పోటీలకు జరిగాయి. ఈ పోటీల కుమితే అండర్–14 బాలుర విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి వి.తులసికుమార్ గోల్డ్, అండర్–12 బాలుర విభాగంలో ఏడో తరగతి విద్యార్థులు ఎస్.అనీల్‌కుమార్ గోల్డ్, టి.గణేష్ బ్రౌంజ్, కటా అండర్–14 బాలికల విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.శివపార్వతి బ్రౌంజ్, అండర్–12 బాలుర విభాగంలో ఏడో తరగతి విద్యార్థి ఎ.ఈశ్వర్‌ఆదిత్య గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ కొడాలి రవిబాబును పాఠశాల ప్రిన్సిపాల్ బి.సురేష్‌కుమార్ పాఠశాలలో సోమవారం అభినందించారు.

## 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 16వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు. 16వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. 16వ తేదీ శుక్రవారం సాయంత్రం గోదాదేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, అనంతరం ప్రథమ పాశుర సేవా జరుగుతుందన్నారు. 19వ తేదీ సోమవారం ఏకాదశి, 26వ తేదీ సోమవారం శ్రవణా నక్షత్రం స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 2023 జనవరి 2వ తేదీ సోమవారం వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం నగరోత్సవ సేవ జరుగుతుందని తెలిపారు. 8వ తేదీ ఆదివారం 24వ పాశురాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ముత్యాల హారతి, 9వ తేదీ శ్రీ కృష్ణ జన్మోత్సవం, 10వ తేదీ మంగళవారం వస్త్ర ఆభరణ ఉత్సవం, 11వ తేదీ కుడారై ఉత్సవం, 12వ తేదీ తోటోత్సవం, 14వ తేదీ గోదాదేవి కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 1,436 దరఖాస్తులు

- ఈ వారంలో మెరిట్ జాబితా

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో 631 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 1,436 మంది దరఖాస్తు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల్లో 631 పోస్టుల భర్తీకి డీఎంఈ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 10న దరఖాస్తులకు గడువు ముగిసింది. ప్రస్తుతం భర్తీ చేసే 631 పోస్టుల్లో 278 పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నవి. వీటిలో 217 పోస్టులను ప్రత్యక్షంగా, 61 పోస్టులను లేటరల్ ఎంట్రీ రూపంలో భర్తీ చేస్తారు. మిగిలిన 353 పోస్టులు 2022–23 ప్యానల్ సంవత్సరానికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌లుగా పదోన్నతి కల్పించడం ద్వారా ఏర్పడే ఖాళీలు. వైద్యుల మెరిట్ లిస్ట్ ఆధారంగా పదోన్నతుల అనంతరం ఏర్పడే ఖాళీలను ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్నవారితో భర్తీ చేస్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భవిష్యత్‌లో పదోన్నతులు ద్వారా ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత నోటిఫికేషన్ జారీ చేశారు. మరోవైపు 1,458 సీనియర్ రెసిడెంట్ వైద్యుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానించగా శనివారం గడువు ముగిసే సమయానికి 1,140 మంది దరఖాస్తు చేసుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ వారంలో మెరిట్ జాబితాలను విడుదల చేయనున్నారు.

## రేపటి నుంచి వైద్య పోస్టులకు వాకిన్ ఇంటర్వ్యూలు

**సాక్షి, అమరావతి:** ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లోని 13 స్పెషాలిటీల్లో 250 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి బుధవారం నుంచి వైద్య శాఖ వాకిన్ ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. ఈ పోస్టుల్లో 78 పోస్టులు గిరిజన, 145 పోస్టులు గ్రామీణ, 27 పోస్టులు పట్టణ ప్రాంత ఆస్పత్రుల్లో ఉన్నాయి. విజయవాడలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయి. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాలకు 14న, గైనకాలజీ, అనస్థీషియా, ఈఎన్‌టీ, పాథాలజీ విభాగాలకు 16న, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తల్మాలజీ, రేడియాలజీ విభాగాలకు 19న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు http://hmfw.ap.gov.in/లో వివరాలు తెలుసుకోవచ్చు. హెల్ప్‌లైన్ 6301138782 నంబర్‌ను సంప్రదించొచ్చు.

## చిత్తూరులో రూ.250 కోట్లతో..
# అమరరాజా కొత్త ప్లాంట్

**2.15 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఆటో విడిభాగాల తయారీ యూనిట్**

- స్థానికంగా మరో 1,000 మందికి ఉపాధి కల్పన లక్ష్యం
- ఇక్కడ వ్యాపార విస్తరణకు కట్టుబడి ఉన్నాం : గల్లా జయదేవ్



**సాక్షి, అమరావతి :** చిత్తూరు జిల్లా తేనిపల్లి వద్ద రూ.250 కోట్లతో కొత్త తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు అమరరాజా గ్రూపు ప్రకటించింది. అమరరాజా గ్రూపునకు చెందిన మంగళం ఇండస్ట్రీస్ 2.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆటో బ్యాటరీ విడిభాగాల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్ ద్వారా దేశంలోని ప్రముఖ కంపెనీలకు సరఫరా చేసేలా ఆటో విడిభాగాలు, మెటల్ ఫాబ్రికేషన్, బ్యాటరీ విడిభాగాలను డిజైన్ చేసి సరఫరా చేయనున్నట్లు పేర్కొంది. ఇక ఈ ప్రాంతంలో తమ వ్యాపార విస్తరణకు కట్టుబడి ఉన్నట్లు కూడా అమరరాజా గ్రూపు సహ వ్యవస్థాపకుడు జయదేవ్ గల్లా ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. స్థానికులకు ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని, రానున్న కాలంలో ఈ కొత్త యూనిట్ ఏర్పాటు ద్వారా మరో 1,000 మంది స్థానికులకు ఉపాధి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. అమరరాజా గ్రూపు 15,000 మందికి ఉపాధి కల్పిస్తుండగా అందులో మంగళం గ్రూపు 3,000 మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు.

### ఇంధన పరికరాల ఉత్పత్తిపై దృష్టి

మరోవైపు.. సుస్థిర ఇంధన అవకాశాలపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నామని, ఇందులో భాగంగా సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన పరికరాల ఉత్పత్తిపై దృష్టిసారిస్తున్నట్లు మంగళం ఇండస్ట్రీస్ డైరెక్టర్ హర్షవర్ధన్ గోగినేని కూడా ఆ ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు.

## ఉపాధి హామీ బిల్లుల తక్షణ చెల్లింపు ఆదేశాలపై స్టే

- తదుపరి విచారణ 19కి వాయిదా

**సాక్షి, అమరావతి :** ఉపాధి హామీ పథకం పనుల బకాయిలను 12శాతం వార్షిక వడ్డీతో కలిపి తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై హైకోర్టు ధర్మాసనం స్టే విధించింది. ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, అందువల్ల బకాయిల చెల్లింపు ఆపామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి హామీ పనుల బిల్లుల బకాయిలపై హైకోర్టులో దాఖలైన అనేక పిటిషన్లపై సింగిల్ జడ్జి జస్టిస్ దేవానంద్ విచారణ జరిపారు. బకాయిలను 12 శాతం వడ్డీతో కలిపి తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ గత ఏడాది అక్టోబర్‌లో తీర్పునిచ్చారు. ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ ప్రభుత్వం దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాన్ని కూడా జస్టిస్ దేవానంద్ కొట్టేశారు. ఈ రెండు తీర్పులను సవాలు చేస్తూ పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి సీజే ధర్మాసనం ముందు విడివిడిగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై సీజే ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ముఖ్య కార్యదర్శి తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, ప్రభుత్వ న్యాయవాది (పంచాయతీరాజ్) వడ్లమూడి కిరణ్ వాదనలు వినిపిస్తూ.. ఉపాధి హామీ పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ విచారణలో బయటపడిందని చెప్పారు. సింగిల్ జడ్జి దృష్టికి ఈ విషయాలను తీసుకురాలేకపోయామని, ఈ విషయంలో తమదే తప్పని ఏజీ అంగీకరించారు. అక్రమాలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. పనులు చేయకపోయినా చేసినట్లు బిల్లులు సమర్పించారని వివరించారు. సింగిల్ జడ్జి తీర్పు వల్ల ప్రజాధనాన్ని అక్రమార్కులకు చెల్లించాల్సి వస్తోందన్నారు. బకాయిల కోసం పిటిషన్లు వేసిన వారి తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. సింగిల్ జడ్జి తీర్పుపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది.

## అనంత్ బాబుకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

**సాక్షి, న్యూఢిల్లీ:** తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ అనంత్‌బాబుకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఏపీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ బెయిల్ మంజూరు చేయాలని అనంత్‌బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు మెహఫూజ్ నజ్కీ, పోలంకి గౌతమ్, మృతుడు సుబ్రహ్మణ్యం తల్లి తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ అగర్వాల్, మీనాక్షి అరోరా, అనంత్ బాబు తరఫున సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ వాదనలు వినిపించారు. అనంతరం పిటిషనర్‌ను కస్టడీలో ఉంచడం సరికాదని అభిప్రాయపడుతున్నట్లు ధర్మాసనం పేర్కొంది. షరతులపై అనంత్ బాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను మార్చి14కి వాయిదా వేసింది.

## సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల వ్యాజ్యంపై ముగిసిన వాదనలు

**తీర్పు వాయిదా వేసిన హైకోర్టు**

**సాక్షి, అమరావతి:** తమ కుమారుడు సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ మృతుని తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంలో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు పిటిషనర్ల తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర పోలీసుల దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని, ఎన్నో సందేహాలున్నాయన్నారు. మృతుని శరీరంపై 32 గాయాలున్నాయని, అవన్నీ ఒక్క వ్యక్తే చేయడానికి ఆస్కారం లేదన్నారు. తర్వాత పోలీసుల తరఫున హోంశాఖ న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ దర్యాప్తు తీరుపై అసంతృప్తి, ఆందోళనల ఆధారంగా దర్యాప్తును సీబీఐకి అప్పగించడానికి వీల్లేదన్నారు. దర్యాప్తు సరైన దిశలోనే సాగుతోందన్నారు. ఈ వ్యాజ్యంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు తరఫు సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు చేస్తున్నవన్నీ నిరాధార ఆరోపణలన్నారు. పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు చేస్తున్న పిటిషనర్లు అందుకు సంబంధించి ఒక్క ఆధారాన్ని కూడా కోర్టు ముందుంచలేదన్నారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

తెలంగాణ

# హస్తినలో అరంగేట్రం!

- ప్రత్యేక విమానంలో ఢిల్లీకి పార్టీ అధినేత, సీఎం కేసీఆర్
- నేటి నుంచి రెండురోజుల పాటు రాజశ్యామల, నవచండీ యాగాలు
- రేపు బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ప్రారంభం



**సాక్షి, హైదరాబాద్/ సాక్షి, న్యూఢిల్లీ:** జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించడం లక్ష్యంగా భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) దేశ రాజధాని ఢిల్లీలో తొలి అడుగు పెట్టేందుకు శరవేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఢిల్లీలోని సర్దార్ పటేల్ రోడ్డులో ఈ నెల 14న బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం ప్రారంభం కానుంది. ఇందుకోసం ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సోమవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకున్నారు. అక్కడి నుంచి తుగ్లక్ రోడ్‌లోని అధికారిక నివాసానికి చేరుకున్న కేసీఆర్... పార్టీ కార్యాలయ భవన పనులపై ఎంపీలతో చర్చించారు. సీఎం సతీమణి శోభ, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత మంగళవారం ఉదయం ఢిల్లీకి చేరుకోనున్నారు. మంగళ, బుధవారాల్లో పార్టీ కార్యాలయంలో జరిగే రాజశ్యామల, నవచండీ యాగాల్లో కేసీఆర్ సతీసమేతంగా పాల్గొంటారు. తెలంగాణ నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిసింది. జేడీఎస్ అధ్యక్షుడు కుమారస్వామితోపాటు యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్, సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 14న జరిగే సమావేశంలో పార్టీ ఎజెండా, కార్యకలాపాలకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను ప్రకటిస్తారు. అదేరోజు మధ్యాహ్నం జాతీయ మీడియాతో జరిగే భేటీలో బీఆర్ఎస్ పార్టీ దేశ రాజకీయాల్లోకి రావలసిన పరిస్థితి ఎందుకు ఉత్పన్నమైందనే విషయాన్ని వివరించనున్నారు. పార్టీ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో వేగవంతం చేసేందుకు 15 మందితో పొలిట్‌బ్యూరోను ప్రకటించే అవకాశముంది.

## కళ్ల నుంచి నీళ్లు కాదు.. నిప్పులు వస్తాయి

- సీబీఐ దాడులకు జడిసేదే లేదు
- తెలంగాణ జాగృతి సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

**కవాడిగూడ(హైదరాబాద్):** తెలంగాణ ఆడపిల్లల కళ్ల నుంచి నీళ్లు కాదు.. నిప్పులు వస్తాయని, వారు ధైర్యవంతులని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. 'కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేకమంది నాయకులపై బీజేపీ ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తోంది. నాపై కూడా దాడులు జరిపిస్తోంది. అయినా వెనక్కి తగ్గేదే లేదు, ముందుకే పోతా'అని ఆమె స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆదివారం రోజంతా సీబీఐ విచారణ ఎదుర్కొన్న కవిత సోమవారం ముషీరాబాద్ భోలక్‌పూర్ డివిజనులో జరిగిన తెలంగాణ జాగృతి విస్తృతస్థాయి సమావేశంలో దూకుడు ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ నాడు రాష్ట్రం కోసం ఉద్యమించిన మనం ఇక నుంచి దేశం కోసం నడుంబిగించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ తరహాలో కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. 'దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోని కవులు, కళాకారులు, రచయితలు, విద్యార్థులు, మహిళలను ఏకం చేస్తాం, రైతులు, కార్మికులతో మాట్లాడుతాం. అన్ని గ్రామాల్లో చర్చలు పెడతాం. తెలంగాణ జాగృతి ఒక ప్రబలమైనశక్తిగా ఉంది. అనేక దేశాల్లో మన కమిటీలు పనిచేస్తున్నాయి. ఒక్క పిలుపు ఇస్తే ప్రతి రాష్ట్రంలో జాగృతి సంస్థకు శాఖ ఏర్పడే శక్తి ఉంది' అని కవిత అన్నారు.

## మైత్రీ మూవీ మేకర్స్‌పై 'ఐ'టీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నిన్నటివరకు రియల్ ఎస్టేట్ సంస్థలు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి విద్యాసంస్థల్లో దాడులు నిర్వహించిన ఆదాయ పన్ను శాఖ తాజాగా సినీ నిర్మాతలపై దృష్టి సారించింది. ప్రముఖ చలన చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కార్యాలయాలు, నిర్మాతల ఇళ్లలపై సోమవారం జీఎస్టీ అధికారులతో కలిసి దాడులకు దిగింది. ఏకకాలంలో ప్రారంభమైన సోదాలు మొత్తం 15 చోట్ల కొనసాగుతున్నాయి. ఈ చిత్ర నిర్మాణ సంస్థలో యలమంచిలి రవిశంకర్, ఎర్నేని నవీన్ భాగస్వాములుగా ఉన్నారు. ప్రముఖ సినీ హీరోలతో భారీ బడ్జెట్ సినిమాలు నిర్మించే మైత్రీ మూవీ మేకర్స్.. భారీ లాభాలు ఆర్జించినా ఆ మేరకు పన్నులు చెల్లించకుండా ఎగవేసిందనే అనుమానాలతో ఐటీ తనిఖీలకు దిగినట్లు తెలిసింది. ఈ సంస్థకు చెందిన తాజా చిత్రాలు 'వాల్తేరు వీరయ్య', 'వీరనర్సింహారెడ్డి' వచ్చే సంక్రాంతికి విడుదలకు సిద్ధమవుతున్నాయి. మంచి లాభాలు ఆర్జించిన 'పుష్ప' సినిమా సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప–2', 'వస్తాద్ భగత్‌సింగ్' లైన్‌లో ఉన్నాయి. మరోవైపు కేసినో కేసులో ఈడీ విచారణ కొనసాగుతూనే ఉంది. సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యక్తిగత సహాయకుడు అశోక్‌ను విచారించినట్లు తెలిసింది.

# నిరుద్యోగులకు సదవకాశం

**నేడు, రేపు జాబ్ మేళాలు**

**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు మంగళవారం మినీ జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. బందరురోడ్డులోని ఖజానా జ్యూవెలరీ షోరూమ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్, ఆఫీస్ బాయ్, హౌస్ కీపింగ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఆ షోరూమ్ ఆవరణలోనే ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు ఉన్న స్త్రీ, పురుషులు ఈ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్‌లోని కుశలవ హ్యూందాయ్ షోరూమ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ జనరల్ మేనేజర్, సర్వీస్ అడ్వైయిజర్, సర్వీస్ టెక్నీషియన్, సేల్స్ టీమ్ లీడర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, స్పేర్స్ పిక్కర్స్, సీనియర్ సర్వీస్ అడ్వయిజర్, సీనియర్ సర్వీస్ టెక్నీషియన్ పోస్టులకు ఆ కంపెనీ ఆవరణలోనే ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో జాబ్‌సీకర్ విభాగంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 94940 05725, 80743 70846లో సంప్రదించాల్సిందిగా కోరారు.

**రేపు ఉపాధి కార్యాలయంలో..**

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధి అధికారి డాక్టర్ పీవీ.రమేష్ కుమార్ తెలిపారు. ప్రజాశక్తి ప్రింటర్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్–7, డిజైనర్స్–2, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్స్–3, ఆపరేటర్స్, ఫీడర్స్, హెల్పర్స్–9 ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. ఇంటర్, డిగ్రీ, ఫొటోషాప్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని, ఉద్యోగాలకు ఎంపికైన వారికి శిక్షణ ఇస్తారని వివరించారు. ఆసక్తి అర్హతలు ఉన్న వారు ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని వారి మొబైల్ నంబర్‌కు వచ్చే ఐడీ ఆధారంగా జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో మేళాకు హాజరు కావాలని తెలిపారు.

# నెలనెలా హెల్త్ మేళా

**ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని పీహెచ్‌సీల్లో కార్యక్రమం ప్రారంభం**



లబ్బీపేట యూపీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ముబీన్

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా పెద్ద ఎత్తున నిధులు, వైద్యుల నియామకాలు చేపట్టడంతో పాటు, కొత్త కార్యక్రమాలను శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా గ్రామాలకు వైద్యులు వెళ్తుండగా, తాజాగా ప్రతినెలలో ఒకరోజు హెల్త్‌మేళా నిర్వహించేందుకు ప్రణాళిక చేసింది. ప్రతినెల 14వ తేదీన దీనిని నిర్వహించాలని నిర్ణయించింది. అందుకు గానూ సోమవారం ఎన్టీఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించింది. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ మేళాలు జరిపించింది. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది.

**సమగ్ర వైద్య పరీక్షలు..**

ప్రతినెలా 14వ తేదీన నిర్వహించే ఈ హెల్త్ మేళాలో మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక పరీక్షలు చేస్తారు. వీరితో పాటు ఇతర వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేస్తారు. హెల్త్ మేళాలు నిర్వహించే తేదీని ముందుగానే ఆ పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు ఆశాలు, ఏఎన్ఎంలు తెలియజేస్తారు.

### మంచి స్పందన వచ్చింది..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం తమ యూపీహెచ్‌సీలో హెల్త్‌మేళా నిర్వహించామని లబ్బీపేట యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ముబీన్ చెప్పారు. 42 మంది రోగులు వచ్చారన్నారు. వారికి బీపీ, సుగర్ వంటి పరీక్ష లు నిర్వహించి మందులు ఇచ్చి పంపించామన్నారు. వచ్చేనెల మళ్లీ 14వ తేదీన మేళా నిర్వహించనున్నట్లు తెలియజేశామని చెప్పారు. అనంతరం పటమటలంకలోని జిల్లా పరిషత్ స్కూల్‌కు వెళ్లి అక్కడి విద్యార్థులకు ఎనీమియాపై అవగాహన కల్పించామన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించామన్నారు.

**విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన**

ఇదే రోజు తమ పరిధిలోని ఏదో ఒక పాఠశాలకు వెళ్లి వైద్యులు విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారు. పోషకాహారం తీసుకోవడం, సమయానికి భోజనం చేయడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తారు. ఎనీమియా చిన్నారులకు గుర్తించి, వారిపై ప్రత్యేక ఫోకస్ పెడతారు.

## సౌత్‌జోన్ నేషనల్స్‌కు స్విమ్మర్లు ఎంపిక



**కంకిపాడు:** అంతర్ జిల్లాల ఈత పోటీల్లో సత్తా చాటి సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఈడుపుగల్లు స్విమ్మింగ్ పూల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 10, 11 తేదీల్లో ఏలూరులో ఆంధ్రా అంతర్ జిల్లాల సబ్‌జూనియర్స్, జూనియర్స్ శీతాకాల ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈడుపుగల్లు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న ఈడుపుగల్లు గ్రామ స్విమ్మర్లు బిళ్లా హర్షిత గ్రూప్–1లో 1500, 1800 మీటర్లు ఫ్రీస్టైల్‌లో రజత పతకాలు, 100, 200 మీటర్లు బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణపతకాలు, 100 మీటర్ల బటర్ ఫ్లైలో రజతం సాధించింది. బిళ్లా హర్షశ్రీ గ్రూప్–2లో 1500, 1800 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకాలు, 200 మీటర్లలో రజతం సాధించింది. ఈనెల 27, 28, 29 తేదీల్లో కేరళలోని తిరువనంతపురంలో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్స్‌కు హర్షశ్రీ, హర్షిత ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మీ, సీఈఓ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

## బాడీ బిల్డింగ్‌లో క్రీడాకారుల సత్తా


గెలుపొందిన క్రీడాకారులు

**పెనమలూరు:** రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన క్రీడాకారులు ఘన విజయం సాధించారని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ.. ఈ నెల 11న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో మూడో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా క్రీడాకారులు సత్తా చాటారన్నారు. 55 కేజీల విభాగంలో సీహెచ్ దుర్గాప్రసాద్, రెండు పతకాలు సాధించారన్నారు. 60 కిలోల విభాగంలో కె.బాలకృష్ణ మొదటి స్థానం, 70 కేజీల విభాగంలో వై.శ్రీకాంత్, ఎస్.గోపి నాలుగో స్థానంలో నిలిచారన్నారు. 75 కిలోల విభాగంలో ఆర్.గోపికృష్ణ మొదటి స్థానం, వై.సందీప్ మూడో స్థానంలో నిలిచారన్నారు. 80 కేజీల విభాగంలో కల్యాణ్ మూడో స్థానం, 85 కిలోల విభాగంలో ఎస్.ఉదయ్‌కుమార్ మొదటి స్థానం, పి.గోపికృష్ణ రెండో స్థానం సాధించారన్నారు. మాస్టర్స్ విభాగంలో కేవీ కోటేశ్వరరావు మొదటి స్థానం, ఓవరాల్ టైటిల్ మిస్టర్ ఆంధ్ర 2022గా ఉదయ్‌కుమార్ నిలిచారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కానూరులో డాక్టర్ అక్కినేని శివరాం, డాక్టర్ టీ.జయప్రకాష్ పలువురు ప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, గోల్డెన్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు సీహెచ్ రాజు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలను పెంచండి

**కృష్ణా కలెక్టర్ రంజిత్‌బాషా**


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

**చిలకలపూడి(మచిలీపట్నం):** జిల్లాలో ఉద్యాన శాఖ, మైక్రో ఇరిగేషన్ శాఖల ద్వారా అమలయ్యే కార్యక్రమాలు, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25వేల హెక్టార్లలో సాగు అవుతున్నాయని, ఈ విస్తీర్ణం పెంపుదలకు కృషి చేయాలన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా మామిడి, జామ వంటి పండ్లు, కూరగాయాల పంటలు ఉత్పత్తికి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. రూ.86 లక్షలతో ప్రణాళికలను రూపొందించామన్నారు. నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం ద్వారా ఆయిల్‌ఫామ్ విస్తరణకు రూ.7.25కోట్లతో ప్రణాళికను రూపొందించామన్నారు. ఉద్యాన పంటల్లో సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు జిల్లాలో 60 హెక్టార్లలో 71 యూనిట్లను మంజూరు చేశామన్నారు. మరో 50 యూనిట్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానశాఖాధికారి జె. జ్యోతి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం

**ఏపీ ఆర్డీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు**



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** రహదారులు తరచూ మరమ్మతులకు గురికాకుండా దీర్ఘకాలం మన్నికనిచ్చే విధంగా అధునాతన ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ, ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించి రహదారులను అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యోచిస్తోందని ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు చెప్పారు. హనుమాన్‌జంక్షన్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా దాదాపు 1000 కిలోమీటర్లు మేర రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. సముద్ర, నదీ పరివాహక ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురికావటంతో తరచూ మరమ్మతులు చేయాల్సి వస్తోందని, దీన్ని అధిగమించేందుకు ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ వినియోగించనున్నట్లు సుబ్బరాజు వివరించారు. ప్రధానంగా ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు.

**పైలెట్ ప్రాజెక్టుగా..**

పైలెట్ ప్రాజెక్టుగా తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో గజ్జరం నుంచి హుకుంపేట వరకు 7.7 కిలోమీటర్లు మేర ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఈ రోడ్డును కేంద్ర నిపుణుల బృందం కూడా తనిఖీ చేసి నాణ్యాతా ప్రమా ణాలపై సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఎఫ్‌డీఆర్ టెక్నాలజీతో నిర్మించిన రోడ్లు దాదాపు 15 ఏళ్ల పాటు దృఢంగా ఉంటాయని సుబ్బరాజు వివరించారు. ప్లాస్టి క్ వ్యర్థాలతో ప్రయోగాత్మకంగా తొలుత ఐదు కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని వివరించారు. ఇది విజయవంతమైతే మిగిలిన చోట్ల కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్లు నిర్మించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పూర్తి స్థాయిలో అధునాతన టెక్నాలజీ వినియోగించి నాణ్యమైన రోడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఉన్నారని సుబ్బరాజు తెలిపారు.

## దుర్గమ్మ సేవలో సీఎం ఓఎస్‌డీ



**ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):** సీఎం ఓఎస్‌డీ జి.వి.డి.కృష్ణమోహన్ సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కృష్ణమోహన్‌ను ఆలయ ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించిన కృష్ణమోహన్‌కు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలతో సత్కరించారు.

## బైపీసీ ర్యాంకర్ల సర్టిఫికెట్ల పరిశీలన

**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్–2022లోని బైపీసీ విభాగం విద్యార్థుల అడ్మిషన్ల కౌన్సెలింగ్ సోమవారం మొదలైంది. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆంధ్రా లయోలా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన చేశారు ఈ నెల 15 తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగనుంది. 19వ తేదీన విద్యార్థులకు సీట్లు అలాట్‌మెంట్ చేస్తామని, 20 తేదీ నుంచి 23 తేదీలోగా విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలలో సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని హెల్ప్‌లైన్ సెంటర్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.విజయసారథి చెప్పారు.

**నేడు, రేపు ప్రత్యేక కేటగిరీ వారికి..**

మంగళవారం నుంచి ప్రత్యేక కేటగిరీ విద్యార్థులైన ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, క్యాప్ (చిల్డ్రన్ ఆఫ్ ఆర్మ్‌డ్ పర్సన్స్) విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామని విజయసారథి తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి 45,001 నుంచి చివరి ర్యాంకుతో పాటుగా దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్స్ విద్యార్థులు ఒకటి నుంచి చివరి ర్యాంకు పొందిన వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తామని తెలిపారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు స్వయంగా హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని విజయ సారథి కోరారు. జనరల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లోనే పరిశీలిస్తామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ సిబ్బంది అభ్యర్థులకు ఫోన్ చేసి మాట్లాడతారని తెలిపారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే హెల్ప్ లైన్ సెంటర్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం ॥ 13-12-2022

జెండర్ ఈక్వాలిటీ

# గరుడ్ మార్కోస్‌లో స్త్రీ శక్తి



ప్రతీకాత్మక చిత్రాలు



భారత వాయుసేన, భారత నావికా దళం తమ ప్రత్యేక విభాగాలలో మహిళా సైనిక అధికారులు చేరడానికి పచ్చజెండా ఊపాయి. మహిళా సైనికుల శక్తిసామర్థ్యాల ప్రదర్శనకు పరిమితులు విధిస్తున్న 'నో–గో జోన్స్' లో క్రమంగా 'నో' మాయమవుతోంది. 'ఈ బాధ్యతలు నిర్వహించే బలం మీలో ఉంది' అని మహిళా సైనిక అధికారులకు పెద్దపీట వేస్తున్నాయి మన సైనిక విభాగాలు...

జెండర్ ఈక్వాలిటీ (లింగ సమానత్వం)ను ప్రమోట్ చేయడంలో భాగంగా భారత వాయుసేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్–ఐఎఎఫ్) తమ శక్తిమంతమైన ప్రత్యేక విభాగం 'గరుడ్ కమెండో ఫోర్స్'లో మహిళా సైనిక అధికారులు చేరడానికి అవకాశం కల్పించింది. గత సంవత్సరం తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం అమల్లోకి రానుంది. ఐఎఎఫ్‌లో 'గరుడ్ కమెండో ఫోర్స్' 2004లో ప్రారంభమైంది. ఈ ప్రత్యేక సైనిక విభాగంలో 1500 మంది సైనికులు పనిచేస్తున్నారు. ఉగ్రవాదుల పీచమణచడం నుంచి అమాయకులను రక్షించడం, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సహాయ కార్యక్రమాల్లో మెరుపు వేగంతో పనిచేయడం వరకు ఎన్నో విధులను నిర్వహిస్తోంది గరుడ్ కమెండో ఫోర్స్. ఐక్యరాజ్య సమితి తరపున కాంగోలో శాంతిపరిరక్షణ కార్యక్రమాలలో సమర్థవంతమైన పాత్ర పోషించి ప్రశంసలు అందుకుంది. గరుడ్ ట్రైనీలు 72 వారాల పాటు ఘజియాబాద్‌కు సమీపంలోని 'కౌంటర్ ఇన్‌సర్జెన్సీ అండ్ జంగిల్ వార్‌ఫేర్ స్కూల్'(సిఐజెడబ్ల్యూఎస్)లో కఠినమైన శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. మన సైన్యానికి సంబంధించిన ప్రత్యేక విభాగాలలో ఎక్కువ కాలం శిక్షణ ఇచ్చేది 'గరుడ్'లోనే. మరోవైపు భారత నావికా దళం (ఇండియన్ నేవి) తమ ప్రత్యేక విభాగమైన మెరైన్ కమెండోస్(మార్కోస్)లో మహిళా సైనిక అధికారుల ప్రవేశానికి పచ్చజెండా ఊపింది. అర్హతల ప్రాతిపదికగా ఈ విభాగంలోకి మహిళలను తీసుకుంటారు. 1987 లో మార్కోస్‌ను ప్రారంభించారు. భూమి, ఆకాశం, నీటిపై స్ట్రాటజికల్, ట్యాక్టికల్ ఆపరేషన్స్ నిర్వహించే 'మార్కోస్' తన ప్రొఫెషనలిజంతో అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషించింది.

సైన్యంలో మహిళలకు సంబంధించి 'నో–గో జోన్స్'లో 'నో'ను తీసివేసే ప్రక్రియ వాయుసేన, నావికా దళాల్లో గట్టిగా జరుగుతోంది.





గడచిన రెండు దశాబ్దాలుగా సాఫ్ట్‌వేర్ రంగమే అందరి గమ్యం అన్నట్లుగా సాగుతోంది. కానీ సైన్స్‌లోనే లైఫ్ ఉందని, సైన్స్‌తోనే కెరీర్‌లో ఎదగాలనుకునే వాళ్లు కూడా ఉంటున్నారు. వాళ్లు ప్రయోగాలతో నిశ్శబ్దంగా ఎదుగుతున్నారు. అది, ఇది అని కాదు... ఏదో ఒకటి సాధించాలనే తపన, ఉత్సాహం ఉంటే ఏ రంగంలోనైనా అవకాశాలు మెండుగానే ఉంటాయని నిరూపించారు బీఎస్సీ స్టూడెంట్స్ వడ్ల ప్రణవి, అనుపమ. వీళ్లిద్దరూ హైదరాబాద్, మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్‌లో చదువుతున్నారు. థర్మోకోల్‌కు బదులుగా ప్యాకింగ్‌లో ఉపయోగించడానికి బయో డీగ్రేడబుల్ మెటీరియల్‌తో ప్యాకింగ్ స్టఫ్‌కు రూపకల్పన చేశారు. తమ ఇన్నోవేషన్‌కు ఇటీవల వైఎఫ్‌ఎస్‌ఐ నుంచి ప్రశంస, పురస్కారాలందుకున్నారు.

# ఎకో ప్యాక్ విజేతలు

ప్యాకింగ్‌కు కొత్త రూపు

### లైఫ్ ప్రకృతితోనే

''మా కాలేజ్ ల్యాబ్‌లో ప్రయోగాలకు అవసరమైన వస్తువులతో వచ్చిన థర్మాకోల్ మెటీరియల్ ఓ పక్కన కనిపిస్తూ ఉంటుంది. ఇదంతా భూమికి హాని కారకం అని పిస్తూ ఉంటుంది కూడా. అలాగే ల్యాబ్‌లో పుట్టగొడుగులు పెంచిన తర్వాత మిగిలిపోయే వేస్ట్ కూడా మా కళ్ల ఎదురుగా కనిపిస్తూ ఉంటుంది. పుట్టగొడుగులు ఫుడ్ ఇండస్ట్రీకి వెళ్లిపోతాయి. వాటి పెంపకంలో వాడే గడ్డి, పుట్టగొడుగులు వలిచిన తరవాత మిగిలిపోయే కొంత భాగాన్ని (మష్రూమ్ రూట్) వృథాగా పడేయాల్సిందే. దాంతో ఏమీ చేయలేమా... అని కూడా అనిపిస్తుండేది. ఈ ఏడాది మే నెలలో ఫోర్త్ సెమిస్టర్ పరీక్షల సమయంలో మాకు ఓ ఆలోచన...థర్మాకోల్‌కు బదులుగా ప్యాకింగ్‌లో మష్రూమ్ వేస్ట్‌ని వాడవచ్చు కదా అనుకున్నాం. ఈ ఆలోచన రావడానికి కారణం మా సీనియర్స్ చేసిన ప్రయోగమే. వాళ్లు పూలు, పండ్లలో వృథాగా మిగిలిపోయే పదార్థాల నుంచి సౌందర్య సాధనాలను తయారు చేశారు.

### సైన్స్‌తోనే ఉత్సాహం

''మేము మా ఆలోచనను ప్రయోగాత్మకంగా ఆచరణలోకి తీసుకురావడానికి ముందు చాలా పరిశోధన చేశాం. అందుకు తగిన డాక్యుమెంట్ సిద్ధం చేశాం. ఆ తర్వాత మష్రూమ్ వేస్ట్ ని బ్యాగ్‌లో పెట్టి ఫంగస్ డెవలప్ అయ్యేటట్లు చేస్తాం. పది హేను రోజుల్లో ఫంగస్ బ్యాగ్ నిండుగా తయారవుతుంది. వంద నుంచి రెండు వందల డిగ్రీల దగ్గర వేడి చేస్తే ఫంగస్ చచ్చిపోతుంది. మష్రూమ్‌కి మరో పేరు పోర్సిని. మా ప్రయోగానికి అదే పేరు పెట్టాం. మొదటగా గ్లాస్‌వేర్ ప్యాకింగ్‌లో అవసరమయ్యే స్టఫ్ మీద దృష్టి పెట్టాం. బౌల్, స్పూన్, గ్లాసు ఆకారంలో మౌల్డ్‌లుంటాయి. ఈ కాన్సెప్ట్‌ని ఇంకా విస్తరించి అన్ని రకాల అవసరాలకు తగిన మౌల్డ్‌లు సిద్ధం చేసుకోవాలి.

చాలామంది 'సైన్స్ కష్టం' అనుకుంటారు. కానీ ఇది అపోహ మాత్రమే. లైఫ్ అంటేనే సైన్స్. మన యువతలో మేధ ఉంది. మనదేశంలో బయోటెక్నాలజీలో ప్రయోగాలకు అవకాశాలు సమృద్ధిగా ఉంటే మన దగ్గరే ఎన్నో కొత్త ఆవిష్కరణలు వస్తాయి. వీ హబ్, వైఎఫ్‌ఎస్‌ఐ వంటి పోటీలు చాలా ఉపయుక్తం. పోటీలకు వచ్చిన ఇతరుల ప్రయోగాలు తెలుస్తాయి. పరిశోధన దృష్టి విశాలమవుతుంది''

– అనుపమ, పోర్సిని పార్సిల్ రూపకర్త

### పరిశోధనకు ప్రోత్సాహం

అనుపమ, నేను మా ఐడియాని మా మెంటార్‌కు తెలియజేశాం. మొదట మా ఆలోచనను వి హబ్‌లో ఎన్‌రోల్ చేశాం. నలభై కాలేజ్‌ల నుంచి వచ్చిన ప్రయోగాల కాన్సెప్ట్‌ల నుంచి పదకొండింటిని షార్ట్ లిస్ట్ చేశారు. అందులో మా కాన్సెప్ట్ ఉంది. తర్వాత వైఎఫ్‌ఎస్‌ఐ(యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్)కి అప్లై చేశాం. అందులో టాప్ టెన్‌లో లిస్ట్ అయింది. అంతే కాదు మా ప్రయోగం కోసం పదివేల రూపాయల ప్రోత్సాహకం ఇచ్చారు, ఫైనల్‌గా ఐదు వేల రూపాయల బహుమతి, ప్రశంసాపత్రం ఇచ్చారు. ఒక ఘట్టం అయితే... ఆ వెంటనే మన దేశం నుంచి, యూఎస్ నుంచి ఎకో ఫ్రెండ్లీ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ కంపెనీలు మా ఐడియాని మరింత విస్తృతంగా రీసెర్చ్ చేయడానికి ఎంకరేజ్ చేస్తున్నాయి. మా మెంటార్ మా ఆవిష్కరణను లింక్‌డ్ ఇన్‌లో షేర్ చేయడంతో ప్రమోషన్ త్వరగా వచ్చింది''

– ప్రణవి, పోర్సిని పార్సిల్ రూపకర్త

ప్రకృతి నుంచి వచ్చిన ప్రతి వస్తువునూ నూటికి నూరుపాళ్లు ఉపయోగించుకోగలగాలి, అలాగే మన డైలీ రొటీన్‌లో ప్రకృతిలో కలిసిపోయే మెటీరియల్స్‌ని మాత్రమే ప్రోత్సహించాలి... అనేది సైన్స్ స్టూడెంట్స్‌గా మా లక్ష్యం'' అన్నారు ఈ యువ ఆవిష్కర్తలు.

– వాకా మంజులారెడ్డి

పురస్కారం

# సాహస భారతి



రాజస్థాన్‌లోని ఒక పల్లెలో బాల్యవివాహాన్ని అడ్డుకునే సమయంలో 'ఇది మా ఇంటి సమస్య. మీకు సంబంధం లేదు' అన్నాడు ఒకాయన కోపంగా. 'ఇది దేశానికి సంబంధించిన సమస్య' అంటూ సమాధానం ఇచ్చిన డా.కృతి భారతి రాజస్థాన్‌లోని ఎన్నో బాల్యవివాహాలను అడ్డుకుంది. బాధితులకు తన ట్రస్టు ద్వారా అండగా ఉంటోంది.

రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్‌లో పుట్టింది కృతి భారతి. తాను కడుపులో ఉన్నప్పుడు తండ్రి అమ్మను విడిచి వెళ్లిపోయాడు. దీంతో 'అబార్షన్ చేయించుకొని మరో పెళ్లి చేసుకో'అని బంధువులు భారతి తల్లి మీద ఒత్తిడి తెచ్చారు. అయితే వాటికి ఆమె లొంగలేదు. రెక్కల కష్టాన్ని నమ్ముకొని బిడ్డను పెంచింది. చిన్నప్పుడు భారతిని బంధువులు దగ్గరికి రానివ్వక పోగా, కొట్టేవారు, తిట్టేవారు. భారతికి తొమ్మిదేళ్ల వయసు ఉన్నప్పుడు విష ప్రయోగం జరిగింది. తాను కోలుకోవడానికి రెండు సంవత్సరాలు పట్టింది.


కాలేజీ రోజుల్లో ఎన్నో స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది భారతి. ఆ సమయంలోనే బాల్యవివాహాలపై ఆమె దృష్టి పడింది. సైకాలజీలో పీహెచ్‌డీ చేసిన భారతి 'సారథి ట్రస్టు' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను ఆరంభించింది. ఈ సంస్థ ద్వారా ఎన్నో బాల్యవివాహాలను అడ్డుకుంది.

డా.కృతి భారతి తాజాగా జెనీవా ప్రతిష్ఠాత్మకమైన 'యూత్ హ్యూమన్ రైట్స్ ఛాంపియన్' అవార్డ్ అందుకుంది.



- టొమాటోని పేస్ట్‌లా చేసి దానిలో అలోవెరా జెల్, పెరుగు కలిపి ముఖానికి పట్టించి, ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే మొటిమలతోపాటు వాటివల్ల ఏర్పడే మచ్చలు కూడా పోతాయి.
- ఒక గిన్నెలో అలోవెరా జెల్‌ని తీసుకోవాలి. దానిలో చిటికెడు పసుపు వేసి రెండింటిని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంమీద, మెడ మీద రాసి గుండ్రంగా మసాజ్ చేయాలి. తరువాత తడి టిష్యూతో శుభ్రం చేస్తే ముఖం మెరిసిపోతుంది.

# అరటి వీరుడు!



పిసాంగ్ రాజా (రెడ్) అరటి గెలతో వినోద్

పండుగా, కూరగా, మరెన్నో ఉత్పత్తులుగా.. అరటి పంట మన జాతి సంస్కృతిలో అనదిగా విడదీయరాని భాగమైపోయింది. వైవిధ్యభరితమైన అరటి రకాలను అంతరించిపోకుండా సాగు చేస్తూ పరిరక్షించుకోవటం ఎంతో ముఖ్యమైన విషయం. ఈ బృహత్ కార్యాన్ని నెత్తికెత్తుకున్న కేరళకు చెందిన ఓ రైతు స్ఫూర్తికథనం ఇది.

విలక్షణమైన అరటి రకాలను సేకరించి సాగు చెయ్యటమంటే కేరళకు చెందిన వినోద్(62)కు మహా ఇష్టం. ఇష్టం అనే కంటే పిచ్చి అంటే బాగా నప్పుతుందేమో. అందుకే ఆయనకు 'వలచెట్ట' అని పేరొచ్చింది. వలచెట్ట అంటే మళయాళంలో 'అరటి అన్న' అని అర్థం. తిరువనంతపురం నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన 4 ఎకరాల తోటలో 500 కంటే ఎక్కువ రకాల అరటి మొక్కల్ని నాటి ప్రాణప్రదంగా సాగు చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు అనేక విదేశాల్లో తిరిగి మరీ అరటి రకాలను సేకరించి నాటడం పనిగా పెట్టుకున్నాడు. సుసంపన్నమైన అరటి జీవవైవిధ్యానికి నిలయంగా మారిన తన క్షేత్రాన్ని 'అరటి గ్రామం' (వరుగ్రామం) అని పిలుచుకుంటున్నారు.


### శాస్త్రవేత్త ఇవ్వనన్నాడని...

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వినోద్‌కు చిన్నప్పటి నుంచే అరటి రకాలను సేకరించే అలవాటుంది. పదేళ్ల క్రితం ఎదురైన చేదు అనుభవం అతన్ని అరటి జీవవైవిధ్యానికి పట్టుగొమ్మగా మార్చేసింది. ఓ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తను తనకు ఇష్టమైన ఓ అరటి రకం మొక్క ఇవ్వమని అడిగితే అందుకు ఆయన నిరాకరించారు. ఆ సంఘటన వినోద్‌ను తీవ్రంగా బాధపెట్టింది. అరటి రకాల కోసం ఇకపై ఏ విశ్వవిద్యాలయంపై ఆధారపడకూడదని నిర్ణయించుకున్నాడు. అప్పటి నుంచి రకరకాల అరటి పిలకలను సేకరించి తన సొంత పొలంలో పెంచడం ప్రారంభించాడు. ఇప్పుడు ఆయన పొలంలో 500 కన్నా ఎక్కువ అరటి రకాల మొక్కలున్నాయి. ఆ రకాలలో ఎంతో వైవిధ్యం ఉంది. విశేషమేమిటంటే.. తిరువనంతపురం అనే ఓ అరటి రకం ఉండేది. ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. కానీ, వినోద్ పొలంలో ఉంది.



సాధారణంగా ఒక అరటి పువ్వుకు ఒక గెల వస్తుంది.. కానీ, ఈ గెలపై అనేక పూలున్నాయి. అంటే.. గెలపై అనేక చిన్న గెలలు వస్తాయన్న మాట!

పండుగా తినడానికి, పచ్చికాయలను కూర వండుకోవడానికి ఉపయోగపడే అరటి రకాలు మనకు తెలుసు. అంతేకాదు.. ఐస్ క్రీమ్‌లు, షేక్స్‌కు ఉపయోగపడే ప్రత్యేక అరటి పండ్లు ఉన్నాయి. 'పెయాన్' రకం అరటి కాయలతో కేరళలో కూర చేస్తారు, తమిళనాడులో దీన్ని ఎక్కువగా పండుగా తింటారు. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే సామర్థ్యం ఉన్న పండు ఇది. చక్క, వాయల్వాజా, కుల్లరకని, బారాబెన్‌లో, చిరపుంచి, పంథరాజ్, ఎఫ్‌హెచ్‌ఐఎ3, సబా మొదలైన పేర్లతోనూ దీన్ని పిలుస్తుంటారు. తక్కువ నీరు, ఎరువులతో పెరగటం దీని ప్రత్యేకత. అత్యధికంగా అమ్ముడయ్యే రకం అయినప్పటికీ రైతులకు ఈ రకం అరటి పిలకలు దొరక్క సాగు తగ్గిపోయింది. ఇవన్నీ ఇప్పుడు మన అరటి వీరుడు వినోద్ దగ్గర ఉన్నాయి!



– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

### అల్సర్‌ని తగ్గించిన అరటి!



'కన్నామంఫలం' పండ్లు చూపుతున్న వినోద్

మైసూరులో నవంబర్‌లో జరిగిన కిసాన్ స్వరాజ్ సమ్మేళనంలో వినోద్ తన తోటలో పండిన కనీసం 30 రకాల అరటి పండ్లను ప్రదర్శనకు పెట్టారు. మీకు బాగా ఇష్టమైన అరటి రకం ఏది అని 'సాక్షి సాగుబడి' ప్రతినిధి అడిగిన ప్రశ్నకు 'అన్నీ ఇష్టమే. ఒక్కో రకం రుచి, వాసన, సైజు వేరుగా ఉంటాయంతే' అన్నారు. అదిసరే గానీ.. ప్రత్యేకతలున్న అరటి రకాల గురించి చెప్పండి అనడిగితే.. 'కన్నామంఫలం' రకం అరటి పండ్లలో ఔషధ గుణాల గురించిన ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. ఆయన తండ్రికి కడుపులో అల్సర్ సమస్య ఉండేది. ఎవరో చెబితే 'కన్నామంఫలం' అరటి పండ్లు కొన్ని రోజుల పాటు తింటే అల్సర్ సమస్య తీరిపోయింది.

### బేబీ ఫుడ్ అరటి రకాలున్నాయి..



థౌంజెండ్ ఫింగర్స్ అరటి గెలతో వినోద్

పెద్దలకే కాదు శిశువులు, బాలలకు కూడా 'కన్నామంఫలం' మంచిదని.. 'కన్నమంఫలం' అంటే 'శిశువుల ఆహారం' అని అర్థమని వినోద్ వివరించారు. 'కన్నమంఫలం'తో పాటు కారయన్నన్, పొంకల్లి, కన్నన్‌పాఝ్, అడుక్కన్, కున్నన్.. ఇవన్నీ బేబీ ఫుడ్‌గా పనికొస్తాయన్నారు. ఈ రకాల అరటి పండ్లను ఎండబెట్టి పొడి చేసి చంటి పిల్లలకు తినిపిస్తారు. జీర్ణకోశ సమస్యలకు ఇది ఉత్తమంగా పనిచేస్తుందన్నారు.



'పేయన్' అరటి పండ్లు



శ్రీకృష్ణుడికి ఇష్టమైన 'కదళి' అరటి పండ్లు



'మట్టి' రకం అరటి

### ఏపీ, తెలంగాణలో ఏ రకాన్నయినా సాగు చేయొచ్చు!

మన దేశంలో ఎక్కువ రకాల అరటిని కలిగి ఉన్న రాష్ట్రాల్లో కేరళ ఒకటి. వినియోగం కూడా ఎక్కువే. అయినా అరుదైన అరటి పండ్ల రకాల పరిరక్షణపై అధికారులు ఆసక్తి చూపడం లేదన్నది వినోద్ ఫిర్యాదు. అందుకే కేరళలోని అన్ని జిల్లాల్లో తన పొలం మాదిరిగా 'అరటి జీవవైవిధ్య క్షేత్రాలను ఏర్పాటు చేయాలన్నది తన ఆశయమని వినోద్ చెబుతున్నారు. తన దగ్గర ఉన్న అరటి రకాలన్నీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నాటుకోవడానికి అనువైనవేనని వినోద్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. తాను సంరక్షిస్తున్న అరటి రకాల పిలకల(సక్కర్స్)ను విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. పది పిలకలను రూ. 4,200కు అమ్ముతున్నానని, ఆర్డర్ ఇస్తే కొరియర్‌లో పంపుతానన్నారు. ఫేస్‌బుక్‌లో 'వరుగ్రామం' గ్రూప్ నిర్వహిస్తున్నారు. వరు చెట్టన్ వాట్సప్: 94464 01615.

సాగుబడి

జ్యేష్ఠ కార్తె: డిసెంబర్ 15 వరకు
మూల కార్తె: డిసెంబ 16 నుంచి

తపసి చెట్టు, తగిరస మొక్కల ఆకులతో కషాయం, ద్రావణాలను వేర్వేరుగా తయారు చేసుకొని వాడితే పంటలను చీడపీడల బెడద నుంచి తక్కువ ఖర్చుతో రైతులు పరిరక్షించుకోవచ్చని వైఎస్సార్ జిల్లా వేంపల్లెకు చెందిన సేంద్రియ/ప్రకృతి సేద్య నిపుణుడు, రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయకుమార్ సూచిస్తున్నారు..

# టి.టి. ద్రావణం / కషాయం

తపసి చెట్టు శాస్త్రీయ నామం హొలోప్టేలియా ఇంటిగ్రిఫోలియా (ఉల్మసీ కుటుంబం). దీన్ని తపస్సిక, నెమలి నార చెట్టు అని కూడా పిలుస్తారు. పొలం గట్ల వెంట, అటవీ ప్రాంతాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఈ చెట్లు విరివిగా కనిపిస్తుంటాయి. దాదాపు 35–40 అడుగుల ఎత్తు పెరుగుతుంది. ఈ చెట్టు కొమ్మలు కొట్టి, తాట తీసి ఆ తాటతో తాళ్లు, తలుగులు, సేద్యపు మోకులు, మంచం నులకలు తయారు చేసేవారు. ఈ చెట్టు ఆకులు, కొమ్మలను కత్తిరించి దిబ్బ ఎరువుగాను, పచ్చి రొట్ట ఎరువుగాను రైతులు వాడుతుంటారు. వేప చెట్లకైనా ఎండు తెగులు వస్తుంది కానీ దీనికి రాదు.





తపసి/తపస్సిక/నెమలి నార చెట్టు



'తగిరస' మొక్క

'తగిరస' మొక్క శాస్త్రీయ నామం కాసియా తోర (గుల్‌మొహర్ కుటుంబం). తగిరస పూలు పసుపు పచ్చగా ఉంటాయి. ఎటువంటి నేలలో అయినా ఏపుగా పెరుగుతుంది. దీనికి ఎటువంటి చీడపీడలు ఆశించవు. ఈ మొక్క మూలికా వైద్యంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. తగిరస మొక్కను మూలికా వైద్యంలో వాడుతారు. ఈ ఆకుల వాసన ఘాటుగా ఉంటుంది కాబట్టి దోమలు కూడా ఆశించవు.

**కషాయం తయారీ/వాడే విధానం:**

రైతులు విపరీతమైన ఖర్చుకు పోకుండా టి.టి. కషాయం తయారు చేసుకొని పిచికారీ చేసుకొని ఉద్యాన పంటలను కాపాడుకోవచ్చు. తపసి ఆకులు 5 కిలోలు, తగిరస ఆకులు 5 కిలోలు తీసుకొని, మెత్తగా దంచి, 20 లీటర్ల నీటిలో బాగా మరగ కాచి, చల్లార్చి.. లీటరుకు 10 లీటర్ల నీరు కలిపి పిచికారీ చేయాలి.

**ద్రావణం తయారీ/వాడే విధానం:**

5 కిలోల తపశి ఆకులు, 5 కిలోల తగిరస ఆకులు మెత్తగా దంచి డ్రమ్ములో 100 లీటర్ల నీటిలో వేసి బాగా కలియదిప్పాలి. రోజూ కలియదిప్పుతూ ఉండాలి. 12 రోజుల తర్వాత వాడుకోవచ్చు. లీటరు ద్రావణానికి 10 లీటర్ల నీరు కలిపి పంటలపై 8 రోజులకోసారి, మూడు సార్లు పిచికారీ చేయాలి.

**ఏయే పంటలకు?**

ఈ రెండు రకాల ఆకులకు ఎటువంటి పురుగులు, చీడలు ఆశించవు. అందువలన డిసెంబర్ చివరి వారం–జనవరిలో మామిడి, చీనీ (బత్తాయి), నిమ్మ, జామ.. వంటి అన్ని పంటలకూ 8 రోజులకు ఒకసారి, మూడు సార్లు పంట బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

పూత రాక మునుపు, పూత మగ్గిన తర్వాత పిందె దశలోనూ బాగా పిచికారీ చేయాలి. పిందె దశలో రెండుసార్లు పిచికారీ చేస్తే కాయపై వచ్చే నల్లని మసి తెగులు పోతుంది. పూతపై వచ్చే మిన్నల్లి, కాయపై వచ్చే ఎర్ర మచ్చలు, అగ్గి తెగులు.. పసుపు పంటను ఆశించే బొబ్బ మచ్చలు, పిండినల్లి.. మిరప పంటను ఆశించే దోమ పైన సమర్థవంతంగా పనిచేస్తుంది. కంది పంట పైన పూత, మొగ్గ దశలోనూ పిందె దశలోను కాయ దశలోను చాలా బాగా పనిచేసింది.

– కొమ్మూరి విజయకుమార్ (98496 48498), రైతు శాస్త్రవేత్త, వేంపల్లె, వైస్సార్ జిల్లా

### బయో డైనమిక్ సాగుపై శిక్షణ

సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో విలక్షణమైనది బయోడైనమిక్ సాగు. గుజరాత్‌కు చెందిన సర్వదమన్ పటేల్ ఈ పద్ధతిలో కూరగాయలు, పండ్ల సాగులో ఆరితేరిన రైతు. ఆనంద్ జిల్లా రవిపురలోని భాయ్‌కాక కృషి కేంద్రంలో 2023 జనవరిలో రెండు విడతలుగా ఆయన రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ ఆంగ్లంలో ఉంటుంది. జనవరి 3 నుంచి 7 వరకు బయోడైనమిక్ సాగు మౌలిక సూత్రాలపై, జనవరి 8 నుంచి 11 వరకు ఈ పద్ధతిలో కూరగాయల సాగుపై సర్వదమన్ పటేల్ తన క్షేత్రంలో శిక్షణ ఇస్తారు. ఒక శిబిరానికి వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ కలిపి అభ్యర్థి ఒక్కరికి ఫీజు రూ. 12,500. రెంటికి కలిపి రూ. 23,000. రిజిస్ట్రేషన్ వివరాలకు.. మురుగేష్/లోక్‌నాథ్.. 99710 54784, 99161 39016. organichutbbk.com/



### ఇషా సింగ్‌కు రజతం

జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ రజత పతకం సాధించింది. భోపాల్‌లో సోమవారం ముగిసిన ఈ టోర్నీలో ఇషా సింగ్ జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం ఫైనల్లో 13–17తో హరియాణాకు చెందిన ఒలింపియన్ మను భాకర్ చేతిలో ఓడిపోయింది. సీనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కర్ణాటక షూటర్ టీఎస్ దివ్య విజేతగా నిలిచింది.



### భారత్‌కు రెండో విజయం

నేషన్స్ కప్ అంతర్జాతీయ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. స్పెయిన్‌లో సోమవారం జరిగిన పూల్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2–1 గోల్స్ తేడాతో 2018 ఆసియా క్రీడల చాంపియన్ జపాన్‌పై గెలిచింది. భారత్ తరఫున సలీమా టెటె (5వ ని.లో), బ్యూటీ డుంగ్‌డుంగ్ (40వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. జపాన్ జట్టుకు రుయ్ తకహిమా (49వ ని.లో) ఏకైక గోల్ అందించింది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంటే భారత్ సెమీఫైనల్ చేరుతుంది.

## 'డబ్ల్యూటీసీ ఫైనలే లక్ష్యం'

**భారత జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్**





టెస్టు సిరీస్ ట్రోఫీతో షకీబ్, కేఎల్ రాహుల్

**చటోగ్రామ్:** ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనలే లక్ష్యంగా పెట్టుకున్న తమకు ప్రతీ టెస్టు మ్యాచ్ కీలకమని భారత తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్ అన్నాడు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు 14 నుంచి ఇక్కడే జరుగుతుంది. సోమవారం టెస్టు సిరీస్ ట్రోఫీని బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్, భారత సారథి కేఎల్ రాహుల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ మీడియాతో మాట్లాడుతూ పలు అంశాలపై తన అభిప్రాయాలు వెల్లడించాడు. 'డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే మేం దూకుడు కొనసాగించాలి. ప్రతీ మ్యాచే కాదు... మ్యాచ్‌లోని ప్రతీ రోజు, ప్రతీ సెషన్‌పై బేరీజు వేసుకొని ముందుకు సాగుతాము' అని రాహుల్ అన్నాడు. ప్రస్తుతం భారత్ 52.08 శాతం పాయింట్లతో డబ్ల్యూటీసీ పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా (75 శాతం), దక్షిణాఫ్రికా (60 శాతం) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ గాయంతో దూరం కావడంపై రాహుల్ స్పందిస్తూ... 'కెప్టెన్ రోహిత్ జట్టులో కీలకమే కాదు... ఎంతో అనుభవజ్ఞుడైన ఆటగాడు. తొలి టెస్టుకు అతడు లేకపోవడం లోటే! అయితే రెండో టెస్టుకల్లా అతను కోలుకుంటాడని ఆశిస్తున్నాం' అని అన్నాడు.

**● మంచు దుప్పటిలో...**



సోమవారం మంచుతో నిండిపోయిన లండన్‌లోని ఓవల్ క్రికెట్ గ్రౌండ్

# ఎవరిదో పైచేయి!

**మెస్సీ మరోసారి అర్జెంటీనాను ఫైనల్‌కు చేరుస్తాడా? మోడ్రిచ్ వరుసగా రెండోసారి తమ జట్టును తుది పోరు వరకు తీసుకెళ్లగలడా? ఒకరు ఆల్‌టైమ్ గ్రేట్‌గా ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకొని తన జట్టుకు బలంగా నిలవగా... మరోవైపు సమష్టితత్వాన్నే నమ్ముకొని ముందుకు సాగిపోయిన టీమ్ మళ్లీ అంచనాలను తలకిందులు చేయగలదా? ఈ నేపథ్యంలో ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీలో మరో రసవత్తర సమరానికి సమయం ఆసన్నమైంది.**

- నేడు అర్జెంటీనా, క్రొయేషియా జట్ల మధ్య తొలి సెమీఫైనల్
- జోరు మీదున్న మెస్సీ సేన
- సమష్టితత్వమే మోడ్రిచ్ బృందం బలం
- అర్ధరాత్రి గం. 12:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం



మోడ్రిచ్



మెస్సీ

**దోహా:** రెండుసార్లు విజేత అర్జెంటీనా, గత వరల్డ్ కప్ ఫైనలిస్ట్ క్రొయేషియా నేడు జరిగే ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీ తొలి సెమీఫైనల్లో తలపడతాయి. 2014 వరల్డ్‌కప్‌లో మెస్సీ సారథ్యంలోనే అర్జెంటీనా ఫైనల్ చేరగా, మోడ్రిచ్ నాయకత్వంలోనే 2018లో క్రొయేషియా రన్నరప్‌గా నిలిచింది. అంచనాలు ఇప్పటికీ అర్జెంటీనాకు అనుకూలంగానే ఉండగా... క్రొయేషియాకు సంచలనాలు కొత్త కాదు. ఈ రెండు జట్లు గతంలో రెండుసార్లు ప్రపంచకప్‌లో లీగ్ దశలో ముఖాముఖిగా తలపడ్డాయి. 1998లో అర్జెంటీనా 1–0తో నెగ్గగా... 2018లో క్రొయేషియా 3–0తో గెలిచింది. నాకౌట్ దశలో మాత్రం తొలిసారి ఈ రెండు జట్లు 'ఢీ'కొంటున్నాయి.

**స్టార్ ముందుండి నడిపిస్తుండగా...**

తన కెరీర్‌లో వరల్డ్‌కప్ లేని లోటును పూరించేందుకు, అభిమానుల దృష్టిలో మరో మారడోనాగా మారేందుకు మెస్సీకి ఇది చివరి చాన్స్. 35 ఏళ్ల వయసులో కూడా అతని అద్భుత ప్రదర్శన జట్టును సెమీస్ వరకు తీసుకొచ్చింది. మెక్సికో, ఆస్ట్రేలియాలపై చేసిన గోల్స్‌తో పాటు నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో నాహుల్ మొలినాకు అతను ఇచ్చిన రివర్స్ పాస్ మొత్తం వరల్డ్‌కప్‌లోనే హైలైట్‌గా నిలిచాయి. అయితే మెస్సీ మినహా ఇతర ఆటగాళ్లు అంతంతమాత్రంగానే రాణించారు. అల్వారెజ్, ఫెర్నాండెజ్, మ్యాక్ అలిస్టర్ ఫర్వాలేదనిపించినా ప్రపంచ స్థాయి ప్రదర్శన మాత్రం రాలేదు. ఇప్పటి వరకు అర్జెంటీనా ఆటలో ఆశించిన వేగం, కొత్తదనం కనిపించకపోయినా నడిచిపోయింది. కానీ సెమీస్ వేదికపై కాస్త ఏమరుపాటుగా ఉన్నా క్రొయేషియా మ్యాచ్‌ను లాగేసుకోగలదు. మెస్సీ మినహా ఇతర ఆటగాళ్లను కోచ్ స్కలోని ఎంత సమర్థంగా వాడుకుంటాడనేది కీలకం. గోల్‌కీపర్ మార్టినెజ్‌పై అదనపు బాధ్యత ఉంది. క్రొయేషియా గోల్ కీపర్ లివకోవిచ్ మెరుపు నైపుణ్యంతో టోర్నీని శాసిస్తున్న తీరు చూస్తే... ఒకవేళ మ్యాచ్ పెనాల్టీల వరకు వెళితే మాత్రం మార్టినెజ్ అత్యద్భుత ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది.

**పోరాటతత్వమే బలంగా...**

బ్రెజిల్‌పై క్వార్టర్ ఫైనల్లో గెలిచిన తర్వాత చివరి వరకు ఓటమిని అంగీకరించని తమ పోరాటస్ఫూర్తి గుర్తించి క్రొయేషియా కోచ్ డాలిచ్ పదే పదే చెప్పుకుంటూ వచ్చాడు. గణాంకాల్లో అది కనిపించకపోయినా అదే వారి విజయ రహస్యమనేది వాస్తవం. సుదీర్ఘ సమయం పాటు బంతిని తమ అదుపులో ఉంచుకోగల మిడ్‌ఫీల్డర్లు మోడ్రిచ్, కొవాసిచ్, బ్రొజొవిచ్ జట్టు ప్రధాన బలం. దీనిని బద్దలు కొట్టాలంటే మెస్సీకి కూడా అంత సులువు కాదు. మ్యాచ్ సమంగా ఉన్న స్థితిలో దీనిని క్రొయేషియా కొనసాగిస్తే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. ఎందుకంటే ప్రధాన టోర్నీల్లో క్రొయేషియా ఆడిన గత 9 నాకౌట్ మ్యాచ్‌లలో 8 అదనపు సమయం వరకు వెళ్లాయి. ఆపై పెనాల్టీల ద్వారానే ఈ టోర్నీలో జపాన్‌పై, బ్రెజిల్‌పై జట్టు విజయం సాధించింది. అయితే అర్జెంటీనాతో పోలిస్తే జట్టులో దూకుడు తక్కువ. కెనడాపై మినహా మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో కలిపి ఆ జట్టు 2 ఫీల్డ్ గోల్స్ మాత్రమే చేయగలిగింది. 2018 ఫైనల్లో ఆ జట్టు ఫ్రాన్స్‌కు తొలి 65 నిమిషాల్లోనే 4 గోల్స్ సమర్పించుకుంది. అంటే ఆరంభంలో ప్రత్యర్థి దాడి చేయగలిగితే క్రొయేషియా మళ్లీ కోలుకునే అవకాశాలు తక్కువ. అయితే గోల్‌కీపర్ లివకోవిచ్ ఈసారి కూడా అడ్డుగోడగా నిలవాలని టీమ్ కోరుకుంటోంది.

**6** ప్రపంచకప్‌లో ఆరోసారి ఫైనల్ బెర్త్‌పై అర్జెంటీనా గురి పెట్టింది. గతంలో అర్జెంటీనా సెమీఫైనల్ చేరిన ఐదు పర్యాయాలు విజయం సాధించి టైటిల్ పోరుకు అర్హత పొందింది.

**4** అర్జెంటీనాపై క్రొయేషియా గెలిస్తే వరుసగా రెండు ప్రపంచకప్‌లలో ఫైనల్ చేరిన నాలుగో యూరోప్ జట్టుగా నిలుస్తుంది. గతంలో ఇటలీ (1934, 1938), నెదర్లాండ్స్ (1974, 1978), జర్మనీ (1982, 1986, 1990) మాత్రమే ఈ ఘనత సాధించాయి.

## 'రంజీ' సమరానికి వేళాయె...

**నేటి నుంచి 2022–2023 సీజన్ ప్రారంభం ● బరిలో మొత్తం 38 జట్లు**



**సాక్షి, హైదరాబాద్:** భారత దేశవాళీ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు నేటి నుంచి తెర లేవనుంది. 2022–2023 సీజన్‌కు సంబంధించి తొలి రౌండ్ గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు వివిధ నగరాల్లో ప్రారంభం కానున్నాయి. మధ్యప్రదేశ్ జట్టు డిఫెండింగ్ చాంపియన్స్‌గా బరిలోకి దిగనుంది. మొత్తం 38 జట్లను ఐదు గ్రూప్‌లుగా విభజించారు. ఎలైట్ విభాగంలో 'ఎ', 'బి', 'సి', 'డి' గ్రూప్‌లు ఉండగా... ప్లేట్ డివిజన్ గ్రూప్ వేరుగా ఉంది. ఎలైట్ విభాగంలోని నాలుగు గ్రూపుల్లో ఎనిమిది జట్ల చొప్పున మొత్తం 32 జట్లకు... ప్లేట్ గ్రూప్‌లో ఆరు జట్లకు చోటు కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 27వ తేదీతో గ్రూప్ లీగ్ దశ మ్యాచ్‌లు ముగుస్తాయి. ఎలైట్ నాలుగు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 31 నుంచి క్వార్టర్ ఫైనల్స్‌ను... ఫిబ్రవరి 8 నుంచి సెమీఫైనల్స్‌ను... ఫిబ్రవరి 16 నుంచి ఫైనల్‌ను నిర్వహిస్తారు. హైదరాబాద్, ఆంధ్ర జట్లు గ్రూప్ 'బి'లో ఉన్నాయి. ఈ రెండు జట్లు తమ తొలి రౌండ్ మ్యాచ్‌లను సొంతగడ్డపై ఆడనున్నాయి. ఉప్పల్ స్టేడియంలో తమిళనాడుతో హైదరాబాద్... విజయనగరంలో 41 సార్లు రంజీ చాంపియన్ ముంబైతో ఆంధ్ర తలపడనున్నాయి.

**ఎలైట్ గ్రూప్‌ల వివరాలు**

**గ్రూప్ 'ఎ':** హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, బరోడా, ఒడిశా, ఉత్తరాఖండ్, నాగాలాండ్.

**గ్రూప్ 'బి':** హైదరాబాద్, ఆంధ్ర, ముంబై, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, సౌరాష్ట్ర, అస్సాం.

**గ్రూప్ 'సి':** కర్ణాటక, కేరళ, జార్ఖండ్, గోవా, రాజస్తాన్, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్, సర్వీసెస్.

**గ్రూప్ 'డి':** మధ్యప్రదేశ్, విదర్భ పంజాబ్,, రైల్వేస్, గుజరాత్, త్రిపుర, జమ్మూ కశ్మీర్, చండీగఢ్.

**ప్లేట్ గ్రూప్:** బిహార్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరం, మేఘాలయ.

## ఇంగ్లండ్ 22 ఏళ్ల తర్వాత...

- పాక్ గడ్డపై టెస్టు సిరీస్ వశం
- రెండో టెస్టులో 26 పరుగులతో ఇంగ్లండ్ గెలుపు

మార్క్ వుడ్, బెన్ స్టోక్స్



**ముల్తాన్:** పాకిస్తాన్‌తో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ 26 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా ఇంకో మ్యాచ్ ఉండగానే 22 ఏళ్ల తర్వాత పాక్ గడ్డపై టెస్టు సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. సీమర్ మార్క్ వుడ్ (4/65) నాలుగోరోజు ఆటను శాసించాడు. క్రీజులో పాతుకుపోయిన బ్యాటర్స్‌ను వైవిధ్యమైన బంతులతో పెవిలియన్ చేర్చాడు. నాలుగో రోజు ఆటలోనే అతను 3 వికెట్లను పడగొట్టాడు. 355 పరుగుల లక్ష్యం ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 198/4తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 328 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్స్‌లో ఫహీమ్ అష్రఫ్ (10; 1 ఫోర్) ఆట మొదలైన కాసేపటికే రూట్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. కానీ మరో బ్యాటర్ సౌద్ షకీల్ (94; 8 ఫోర్లు) ఇంగ్లండ్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. నవాజ్ (45; 7 ఫోర్లు)తో కలిసి ఆరో వికెట్‌కు 80 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. షకీల్ సెంచరీకి చేరువైన దశలో వుడ్ తన వరుస ఓవర్లలో పరుగు తేడాతో మొదట నవాజ్‌ను తర్వాత షకీల్‌ను పెవిలియన్ చేర్చడంతో ఇంగ్లండ్‌కు విజయం ఖాయమైంది. 290/5తో పటిష్టంగా కనిపించిన పాకిస్తాన్ 291/7 స్కోరు వద్ద కష్టాల్లో పడింది. లంచ్ విరామనంతరం వుడ్, అండర్సన్, రాబిన్సన్ టెయిలెండర్ల పనిపట్టారు. జాహిద్ మహమూద్ (0) వుడ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. అబ్రార్ అహ్మద్ (17)ను అండర్సన్, మొహమ్మద్ అలీ (0)ని రాబిన్సన్ అవుట్ చేయడంతో పాక్ ఇన్నింగ్స్ కూలింది. సిరీస్‌లోని చివరిదైన మూడో టెస్టు శనివారం నుంచి కరాచీలో జరుగుతుంది.

## సినిమా

**● ఇయర్ రౌండప్**

# హాయ్ హాయ్... నాయికా



● ఆలియా భట్
● మృణాల్



● సయీ
● అనన్యా



● ఒలీవియా
● షిర్లే సేథియా

**2022లో తెలుగు సిల్వర్ స్క్రీన్ మురిసిపోయింది. ఎందుకంటే ఇక్కడి తెరపై కొత్తగా మెరిసిన నాయికలను చూసి.. వేరే భాషలో 'స్టార్' అనిపించుకున్న నాయికలు, కొత్తవారు ఈ ఏడాది తెలుగు తెరకు పరిచయం అయ్యారు. దేశీ భామలనే కాదు.. విదేశీ భామలను కూడా తెలుగు స్క్రీన్ చూపించింది. 'హాయ్ హాయ్.. నాయికా' అంటూ ఈ తారలను ఆహ్వానించింది.**

మామూలుగా ఉత్తరాది భామలు ఎక్కువగా తెలుగుకి వస్తుంటారు. ఈసారి కూడా వచ్చారు. అయితే హిందీలో స్టార్ అనిపించుకుని, తెలుగు తెరకు కొత్తగా పరిచయం అయ్యారు. దాదాపు పదేళ్లు హిందీలో హీరోయిన్‌గా సినిమాలు చేసిన ఆలియా భట్ ఈ ఏడాది తెలుగుకి పరిచయం కావడం విశేషం. రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రూపొందిన 'ఆర్ఆర్ఆర్'లో రామ్‌చరణ్‌కు జోడీగా సీత పాత్రలో ఆలియా నటించిన విషయం తెలిసిందే. ఇదే సినిమాలో ఎన్టీఆర్ ప్రేయసిగా చేసిన పాత్ర ద్వారా విదేశీ బ్యూటీ ఒలీవియా మోరిస్ తెలుగు తెరపై మెరిశారు. అలాగే ముంబై బ్యూటీస్ మృణాల్ ఠాకూర్, అనన్యా పాండే, సయీ మంజ్రేకర్‌ల టాలీవుడ్ ఎంట్రీ కూడా ఈ ఏడాదే జరిగింది. దుల్కర్ సల్మాన్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిన 'సీతారామం' హీరోయిన్‌గా తెలుగులో మృణాల్‌కు తొలి చిత్రం. మరో హిందీ భామ అనన్యా పాండే (నటుడు చుంకీ పాండే కుమార్తె) నటించిన తొలి తెలుగు చిత్రం 'లైగర్'. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఈ చిత్రం రూపొందింది. అలాగే బాలీవుడ్ దర్శక–నిర్మాత, నటుడు మహేశ్ మంజ్రేకర్ కుమార్తె సయీ మంజ్రేకర్ 'గని' చిత్రం ద్వారా పరిచయం అయ్యారు. వరుణ్ తేజ్ హీరోగా కిరణ్ కొర్రపాటి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రం తర్వాత సయీ 'మేజర్' (తెలుగు – హిందీ)లో ఓ హీరోయిన్‌గా నటించారు. ఇందులో అడివి శేష్ టైటిల్ రోల్ చేయగా శశికిరణ్ తిక్క దర్శకత్వం వహించారు. శ్రీ విష్ణు హీరోగా చేసిన 'అల్లూరి'తో నార్త్ ఈస్ట్ అమ్మాయి కయాదు లోహర్, విశ్వక్‌సేన్ 'ఓరి. ..దేవుడా'తో మిథిలా పాల్కర్, ఆకాష్ పూరి 'చోర్ బజార్'తో గెహ్నా సిప్పి.. ఇలా చాలామంది తెలుగుకి వచ్చారు. కాగా 'ఆర్ఆర్ఆర్'తో పరిచయమైన విదేశీ భామ ఒలీవియాలానే ఈ ఏడాది తెలుగు తెరపై కనిపించిన మరో విదేశీ భామ షిర్లే సేథియా. నాగశౌర్య హీరోగా నటించిన 'కృష్ణ బ్రింద విహారి' ద్వారా ఈ న్యూజిల్యాండ్ బ్యూటీ తెలుగుకి వచ్చారు. మరోవైపు మలయాళ కుట్టీల తెలుగు అరంగేట్రం కూడా ఈ ఏడాది బాగానే జరిగింది. మలయాళంలో అగ్ర తారల్లో ఒకరైన నజ్రియా ఎంట్రీ ఈ ఏడాది జూన్ 10న విడుదలైన 'అంటే.. సుందరానికీ!' చిత్రంతో కుదిరింది. నాని హీరోగా నటించిన ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకుడు. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో పవన్ కల్యాణ్, రానా హీరోలుగా రూపొందిన 'భీమ్లా నాయక్'లో ఓ హీరోయిన్‌గా నటించారు సంయుక్తా. ఈ చిత్రంలో రానా భార్య పాత్రలో కనిపిస్తారామె. కల్యాణ్ రామ్ హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందిన 'బింబిసార'లోనూ సంయుక్త నటించారు. మరోవైపు రవితేజ హీరోగా శరత్ మండవ డైరెక్షన్‌లో వచ్చిన 'రామారావు: ఆన్ డ్యూటీ'తో తెలుగు ప్రేక్షకులను పలకరించారు రజీషా విజయన్. కాగా 'బ్లఫ్‌మాస్టర్' తర్వాత హీరో సత్యదేవ్, దర్శకుడు గోపీ గణేష్ కాంబినేషన్‌లో వచ్చిన 'గాడ్సే'తో ఐశ్వర్యా లక్ష్మీ హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అలాగే మహేశ్‌బాబు హీరోగా పరశురామ్ దర్శకత్వంలో కీర్తీ సురేశ్ హీరోయిన్‌గా నటించిన 'సర్కారువారి పాట'లో సౌమ్య మీనన్ నటించారు. కీర్తి ఫ్రెండ్ పాత్రలో కనిపిస్తారు సౌమ్య. ఇంకోవైపు సత్యదేవ్ హీరోగా నాగశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గుర్తుందా.. శీతాకాలం'లో కన్నడ భామ కావ్యా శెట్టి హీరోయిన్‌గా చేశారు. విశ్వక్‌సేన్ 'ఓరి.. దేవుడా'లో ఓ హీరోయిన్‌గా చేసిన ఆశా భట్ కన్నడ బ్యూటీనే. **ఈ కథానాయికలకే కాదు... టాలీవుడ్ మరెందరో తారలకు స్వాగతం పలికింది. మొత్తానికి 2022 తెలుగు సిల్వర్ స్క్రీన్ కొత్త మెరుపులను చూపించింది.**



● నజ్రియా
● ఐశ్వర్యా లక్ష్మీ
● కయాదు




● మిథిలా పాల్కర్ ● రజీషా విజయన్ ● కావ్యా శెట్టి ● సంయుక్తా మీనన్ ● గెహ్నా సిప్పీ ● ఆశా భట్

## గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌కి ఆర్ఆర్ఆర్



● కీరవాణి





● రామ్‌చరణ్, ఎన్టీఆర్

**జాతీయ స్థాయిలో సత్తా చాటిన 'ఆర్ఆర్ఆర్'** ఇప్పుడు ప్రపంచ సినిమా వేదికపైనా సత్తా చాటుతోంది. ఇందులో భాగంగా తాజాగా ప్రతిష్టాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ 2023కి నామినేట్ అయ్యింది. రామ్‌చరణ్–ఎన్టీఆర్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది మార్చి 24న విడుదలై, బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. కాగా 'గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్' బెస్ట్ నాన్ ఇంగ్లిష్ ఫీచర్ ఫిలిం విభాగంలో ఈ సినిమా నామినేషన్ దక్కించుకుంది. అలాగే ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు..' నామినేట్ అయ్యింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీతదర్శకుడనే విషయం తెలిసిందే. కాగా లాస్ ఏంజెల్స్‌లో జనవరి 10 (భారతీయ కాలమానం ప్రకారం జనవరి 11 ఉదయం) న ఈ అవార్డుల ప్రకటన, ప్రదానం జరగనున్నాయి.

**కీరవాణికి రెండు అవార్డులు:** 'ఆర్ఆర్ఆర్'కి అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం అందించిన కీరవాణి ఇప్పటికే రెండు అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్నారు. లాస్ ఏంజెల్స్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డ్స్‌లో 'బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్'గా కీరవాణి ఎంపికయ్యారు. అలాగే బోస్టన్ సొసైటీ ఆఫ్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' అవార్డు అందుకున్నారు కీరవాణి.

## మెగా గుడ్ న్యూస్

మెగా ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్. హీరో రామ్‌చరణ్– ఉపాసన దంపతులు తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని హీరో, రామ్‌చరణ్ తండ్రి చిరంజీవి సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ''రామ్‌చరణ్–ఉపాసన తల్లిదండ్రులుగా తమ తొలి బిడ్డని త్వరలో ఆహ్వానించనున్నారు. ప్రేమతో మీ సురేఖ–చిరంజీవి, శోభన–అనిల్ కామినేని (ఉపాసన తల్లిదండ్రులు)' అని చిరంజీవి ట్వీట్ చేశారు. కాగా రామ్‌చరణ్, ఉపాసనల వివాహం 2012 జూన్ 14న జరిగిన విషయం తెలిసిందే.



● రామ్‌చరణ్, ఉపాసన

## నీకింకా సమజ్ కాలే...

చిరంజీవి హీరోగా కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఇందులో శ్రుతీహాసన్ కథానాయిక. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. కాగా ఈ చిత్రంలో హీరో రవితేజ కీలక పాత్ర చేశారు. ఆయన చేసిన ఏసీపీ విక్రమ్ సాగర్ పాత్రని పరిచయం చేస్తూ సోమవారం ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేశారు. 'ఏం రా వారీ.. పిస పిస చేస్తుండావ్.. నీకింకా సమజ్ కాలే.. నేను ఎవ్వనయ్యకీ యిననని' అని రవితేజ చెప్పిన డైలాగ్‌తో టీజర్ సాగుతుంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: ఆర్థర్ ఎ. విల్సన్.



● రవితేజ

## మాయే మాయే..

బెల్లంకొండ గణేష్ హీరోగా నటించిన చిత్రం 'నేను స్టూడెంట్ సార్!'. రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అవంతిక దస్సాని హీరోయిన్. 'నాంది' ఫేమ్ నిర్మాత సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మహతి స్వర సాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని తొలి పాట 'మాయే మాయే..' లిరికల్ వీడియోను డైరెక్టర్ గోపీచంద్ మలినేని విడుదల చేశారు. కృష్ణ చైతన్య సాహిత్యం అందించిన ఈ పాటను మహతి స్వర సాగర్‌తో పాటు కపిల్ కపిలన్ పాడారు. ''హీరోయిన్‌పై హీరోకి ఉన్న ప్రేమను 'మాయే మాయే..' పాట వర్ణిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● గణేష్, అవంతిక

సాక్షి
మంగళవారం
13-12-2022

# బిజినెస్

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 51 | 62,131 |
| నిఫ్టీ ▽ | 0.55 | 18,497 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,038 | △ | 33 |
| డోజోన్స్ | 33,744 | △ | 267 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,476 | ▽ | 31 |
| డాక్స్ | 14,307 | ▽ | 64 |
| షాంఘై | 3,179 | ▽ | 28 |
| నికాయ్ | 27,842 | ▽ | 59 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 53,908 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 53,693 |
| వెండి (కేజీ) | 66,022 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | నగదు | 81.78 | 83.45 |
| € | యూరో | నగదు | 85.37 | 88.39 |
| £ | బ్రిటన్ పౌండ్ | నగదు | 99.35 | 102.71 |
| ¥ | జపాన్ ఎన్ (100) | నగదు | 59.43 | 61.35 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | నగదు | 54.79 | 57.18 |
| S$ | సింగపూర్ డాలర్ | నగదు | 59.99 | 61.94 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.01 | 22.69 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.57 | 23.37 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.71 | 12.74 |

## పడిపోయిన పారిశ్రామికోత్పత్తి

**అక్టోబర్ నెలకు మైనస్ 4 శాతం**



**న్యూఢిల్లీ:** ఒకవైపు ద్రవ్యోల్బణం శాంతించగా, మరోవైపు పారిశ్రామికోత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. మైనస్ 4 శాతానికి అక్టోబర్‌లో క్షీణించింది. ప్రధానంగా తయారీ తగ్గడం, మైనింగ్, విద్యుత్ విభాగాల్లో వృద్ధి లేకపోవడం ఈ పరిస్థితికి దారితీసింది. ఈ వివరాలను ఎన్ఎస్ఓ విడుదల చేసింది. మైనింగ్ విభాగం కేవలం 2.5 శాతం వృద్ధిని నమోదు చేయగా, తయారీ విభాగం మైనస్ 5.6 శాతానికి పడిపోయింది. విద్యుత్ ఉత్పత్తి 1.2 శాతం పెరిగింది. క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 2.3 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగం 15 శాతం మేర, కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్‌లో 13.4 శాతం క్షీణత నమోదైంది. ఇంటర్‌మీడియట్ గూడ్స్ ఉత్పత్తి 2.8 శాతం తగ్గగా, ప్రైమరీ గూడ్స్ 2 శాతం, ఇన్‌ఫ్రా/కన్‌స్ట్రక్షన్ గూడ్స్ ఉత్పత్తి 1 శాతం వృద్ధిని చూశాయి. అంతకుముందు సెప్టెంబర్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 3.1 శాతం వృద్ధిని చూడగా, 2021 అక్టోబర్ నెలలోనూ 4.2 శాతం వృద్ధి నమోదు కావడాన్ని గమనించొచ్చు. మొత్తం మీద అక్టోబర్‌లో ఐఐపీ గణాంకాలు అంచనాల కంటే తక్కువగా రావడం గమనార్హం. 2020 ఆగస్ట్ నెలకు నమోదైన మైనస్ 7 తర్వాత, మళ్లీ ఇంత కనిష్టాలకు తయారీ రంగం పనితీరు పడిపోవడం ఇదే మొదటిసారి.

## తగ్గిన ధరల మంట

- 11 నెలల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- నవంబర్ నెలకు 5.88 శాతం

**న్యూఢిల్లీ:** సామాన్యుడికి ధరల మంట కాస్తంత తగ్గింది. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారోత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాయి. దీంతో నవంబర్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం 5.88 శాతానికి దిగొచ్చింది. ఇది 11 నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. అంటే ఏడాది తర్వాత మళ్లీ తక్కువ ధరలు చూస్తున్నాం. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (వినియోగ ధరల ఆధారిత సూచీ/రిటైల్ ద్రవ్యోల్బణం) గణాంకాలను జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) సోమవారం విడుదల చేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం ఇది వరుసగా రెండో మాసం. అంతకుముందు అక్టోబర్‌లో 6.77 శాతంగా ఉంది. 2021 నవంబర్ నెలలో ఇది 4.91 శాతంగా ఉండడం గమనార్హం. ఏడాది క్రితంతో పోలిస్తే ఇప్పటికీ 1% మేర అధికంగా ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ద్రవ్యోల్బణం కట్టడే ధ్యేయంగా ఆర్‌బీఐ వరుసగా వడ్డీ రేట్లను పెంచుతూ, వ్యవస్థలో లిక్విడిటీని తగ్గించే ప్రయత్నం చేస్తుండడం తెలిసిందే. ఈ నెల మొదటి వారంలో ముగిసిన తాజా ఎంపీసీ సమీక్షలోనూ కీలక రెపో రేటు 0.35% మేర పెరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి చూస్తే రెపో రేటు మొత్తం మీద 2.25% ఎగిసింది. వచ్చే జనవరి–మార్చి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 6%లోపునకు దిగొస్తుందని, రానున్న రోజుల్లో ధరల మంట కాస్తంత చల్లారుతుందని ఇటీవలి సమీక్ష అనంతరం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటించారు.

**ధరల తీరు...:** ఆహార ద్రవ్యోల్బణం అక్టోబర్‌లో 7.01 శాతంగా ఉంటే అది నవంబర్ నెలకు 4.67 శాతానికి క్షీణించింది. సీపీఐలో ఆహారోత్పత్తుల వాటా 40 శాతం. కూరగాయల ధరలు 8 శాతం మేర తగ్గాయి. ఇక వంట నూనెల ధరలు 0.63 శాతం, చక్కెర ధరలు 0.25 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. ధాన్యాలకు సంబంధించిన ద్రవ్యోల్బణం ఇంకా గరిష్ట స్థాయిలో 12.96% వద్ద ఉంటే, వంట దినుసులకు సంబంధించి 19.52 శాతం, పాల ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 8.16 శాతం, పప్పులకు సంబంధించి 3.15%గా నమోదైంది. చమురు, పొగాకు, మత్తు కారకాల రేట్లు క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఎక్కువలోనే ఉన్నాయి. వస్త్రాలు, పాదరక్షల ధరలు 9.83%, ఇళ్ల ధరలు 4.57% పెరిగాయి. 'డిసెంబర్‌లోనూ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడితే వచ్చే ఫిబ్రవరి సమీక్షలో పాలసీ రేట్ల సమీక్షలో కీలక అంశంగా మారుతుందని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు. ఊహించని విధంగా ద్రవ్యోల్బణం 6%లోపునకు దిగివచ్చినట్టు చెప్పారు.



**చర్యల ఫలితమే ఇది..**

ఆహార ధరల నియంత్రణకు ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా, ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత గరిష్ట పరిధి అయిన 6 శాతం లోపునకు దిగొచ్చింది. ధాన్యాలు, పప్పులు, వంట నూనెల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ చర్యల ఫలితాలు రానున్న నెలల్లో ద్రవ్యోల్బణంపై ఇంకా ప్రతిఫలిస్తాయి.

– కేంద్ర ఆర్థిక శాఖ ట్వీట్

## దగ్గు నివారణకు లీ హెల్త్ ఔషధం



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఫార్మా కంపెనీ లీ హెల్త్ డొమెయిన్.. దగ్గు నివారణకు ఆయుర్వేద ఔషధం వాసా తులసి ప్లస్ ప్రవేశపెట్టింది. వైద్యపరంగా నిరూపితమైన వాము పువ్వు, ప్రిమ్ రోజ్, తాలీస పత్రం, వస, తులసి, శొంఠి, దుష్టపు తీగ, అతి మధురం, పిప్పళ్లు, దాల్చిన చెక్క, లవంగం, నల్ల మిరియాలు, పుదీనా ఇందులో వాడారు. కఫాన్ని తొలగించడానికి వస, వాము సాయపడతాయి. శ్వాస తీసుకోవడంలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తుందని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ లీలా రాణి తెలిపారు. ఆస్తమా, దగ్గు–జలుబు, కోరింత దగ్గు, ఈసినోఫీలియా, గొంతు నొప్పి, బొంగురు గొంతు, సైనసైటిస్ నుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 13-12-2022 | |
|---|---|
| విశాఖ | 547-00 |
| చిత్తూరు | 543-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 534-00 |
| విజయవాడ | 534-00 |
| రిటైల్ ధర (డజను) | 78.00 |
| **12-12-2022 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 520-00 |
| వరంగల్ | 522-00 |
| రిటైల్ ధర | 5.80 |

## దాల్మియా చేతికి జేపీ సిమెంట్

- రూ. 5,666 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువ ప్రకారం డీల్
- దేశవ్యాప్త సిమెంట్ కంపెనీగా మరో అడుగు
- సిమెంట్ బిజినెస్ నుంచి 'జేపీ' ఔట్




**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ సంస్థ జైప్రకాష్ అసోసియేట్స్(జేఏఎల్), సహచర సంస్థ నుంచి సిమెంట్, సంబంధ ఆస్తులను కొనుగోలు చేయనున్నట్లు దాల్మియా భారత్ లిమిటెడ్ తాజాగా పేర్కొంది. ఇందుకు రూ. 5,666 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువ ప్రకారం తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. పూర్తి అనుబంధ సంస్థ దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్(డీసీబీఎల్) ద్వారా క్లింకర్, సిమెంట్, పవర్ ప్లాంట్ల కొనుగోలుకి జేపీ గ్రూప్ సంస్థలతో డీల్ కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. ఒప్పందంలో భాగంగా 9.4 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంగల(ఎంటీపీఏ) సిమెంట్ ప్లాంట్లతోపాటు.. 6.7 ఎంటీపీఏ క్లింకర్, 280 మెగావాట్ల థర్మల్ విద్యుత్ యూనిట్లను సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. ఈ ఆస్తులు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో విస్తరించి ఉన్నట్లు దాల్మియా పేర్కొంది. ఈ కొనుగోలుతో మధ్యభారతంలోనూ కార్యకలాపాలు విస్తరించనున్నట్లు తెలియజేసింది. ఇదే సమయంలో తమ వద్ద మిగిలిన సిమెంట్ ఆస్తులను విక్రయించడం ద్వారా సిమెంట్ బిజినెస్ నుంచి పూర్తిగా వైదొలగుతున్నట్లు జేపీ గ్రూప్ వెల్లడించింది. ఇందుకు దాల్మియా భారత్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. రుణ భారాన్ని తగ్గించుకునే వ్యూహంలో భాగంగా తాజా నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలియజేసింది.

**విస్తరణ లక్ష్యంతో...:** 2027కల్లా దేశవ్యాప్త సిమెంట్ కంపెనీగా ఆవిర్భవించే లక్ష్యంలో భాగంగా జేపీ ఆస్తుల కొనుగోలుతో దాల్మియా భారత్ ముందడుగు వేసింది. 2027కల్లా 75 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని అందుకోవాలని ఆశిస్తోంది. ఈ బాటలో 2031కల్లా 110–130 ఎంఎన్‌టీకి చేరాలని ప్రణాళికలు వేసింది. జేపీ ఆస్తుల కొనుగోలు ద్వారా దాల్మియా భారత్ సిమెంట్ తయారీ సామర్థ్యం వార్షికంగా 45.3 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్రస్తుత సామర్థ్యం 35.9 ఎంటీపీఏగా ఉంది. సిమెంట్ తయారీకి దాల్మియా ప్రస్తుతం దేశంలో నాలుగో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. అల్ట్రాటెక్, అదానీ సిమెంట్(ఇటీవలే ఏసీసీ, అంబుజాలను సొంతం చేసుకుంది), శ్రీ సిమెంట్ తొలి మూడు ర్యాంకులను ఆక్రమిస్తున్నాయి.

### రుణ భారం తగ్గింపు

ప్రస్తుతం జేపీ గ్రూప్ సంస్థలు జైప్రకాష్ అసోసియేట్స్(జేఏఎల్) 6 ఎంటీపీఏ, జైప్రకాష్ పవర్ వెంచర్స్(జేపీవీఎల్) 4 ఎంటీపీఏ చొప్పున సిమెంట్ సామర్థ్యాలను కలిగి ఉన్నాయి. రుణ భారాన్ని తగ్గించుకునే యోచనతో ఈ రెండు కంపెనీలూ సిమెంట్ బిజినెస్‌లతోపాటు, కీలకంకాని ఇతర ఆస్తులను విక్రయించనున్నట్లు అక్టోబర్‌లో ప్రకటించాయి. కాగా.. 2014–17 మధ్య కాలంలో రుణ పరిష్కార ప్రణాళికకింద జేఏఎల్ 20 ఎంటీపీఏ సిమెంట్ సామర్థ్యాన్ని ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్‌కు విక్రయించిన విషయం విదితమే. మరోవైపు 2015లోనే జేపీ గ్రూప్ 2 ఎంటీపీఏ సిమెంట్ సామర్థ్యాన్ని దాల్మియా గ్రూప్‌నకు విక్రయించింది.

## ఇంట్రాడే నష్టాలు రికవరీ

- సెన్సెక్స్ నష్టం 51 పాయింట్లు
- మిశ్రమంగా ముగిసిన సూచీలు
- పతనాన్ని అడ్డుకున్న బ్యాంకింగ్ షేర్లు



**ముంబై:** బ్యాంక్స్, మెటల్స్, ఇంధన షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం ఆరంభ నష్టాల నుంచి కోలుకున్నాయి. కీలకమైన రిటైల్ ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాల డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. యూఎస్ ఫెడ్ రిజర్వ్ సమావేశం(నేడు) ప్రారంభం నేపథ్యంలో అప్రమత్తత చోటు చేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందడంతో నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనై మిశ్రమంగా ముగిశాయి. ఇంట్రాడేలో 506 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరకు 51 పాయింట్ల నష్టంతో 62,131 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ 151 పాయింట్ల కనిష్టం నుంచి కోలుకుని ఆఖరకు అర పాయింటు స్వల్పలాభంతో 18,497 వద్ద నిలిచింది. ఐటీ, ఫార్మా, వినిమయ షేర్లు విక్రయాల ఒత్తిడికి లోనయ్యాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- యూనిపార్ట్స్ ఇండియా షేరు లిస్టింగ్ రోజే నష్టాలను మిగిల్చింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.577)తో పోలిస్తే అరశాతం నష్టంతో రూ.575 వద్ద లిస్టయ్యింది. మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల దృష్ట్యా షేరు మరింత పతనాన్ని చవిచూసింది. ట్రేడింగ్‌లో ఏడుశాతానికి పైగా క్షీణించి రూ.536 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 6.5% నష్టంతో రూ.540 వద్ద స్థిరపడింది.
- నష్టాల మార్కెట్లో ఎల్ఐసీ షేరు రాణించింది. బీఎస్ఈలో నాలుగు శాతం లాభపడి రూ.697 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నాలుగున్నర శాతం ర్యాలీ చేసి రూ.703 వద్ద మూడునెలల గరిష్టాన్ని తాకింది. ప్రైవేట్ రంగ బీమా కంపెనీల వ్యక్తులు ఎల్ఐసీ పగ్గాలు చేపట్టనున్నారనే వార్తల నేపథ్యంలో ఈ షేరుకు డిమాండ్ నెలకొంది.

### రూపాయి 23 పైసల పతనం

డాలర్ మారకంలో రూపాయి విలువ సోమవారం 23 పైసలు క్షీణించి 82.51 వద్ద స్థిరపడింది. ఈక్విటీ మార్కెట్లలోని అనిశ్చితి పరిస్థితులు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ అంశాలు సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచాయి. దీంతో రూపాయి మూడురోజుల ర్యాలీకి బ్రేక్ పడినట్టైంది.

# భవిత

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల ప్రత్యేకం-2022
ప్రముఖ సబ్జెక్ట్ నిపుణులు ప్రిపేర్ చేసిన 'తెలంగాణ హిస్టరీ ప్రాక్టీస్ టెస్టులు'

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 15 ఆరోగ్యమిత్ర పోస్టులు

ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఆరోగ్యమిత్ర పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 15

» **అర్హత:** బీఎస్సీ/ఎంఎస్సీ(నర్సింగ్) లేదా బీఫార్మసీ/డీఫార్మసీ లేదా బీఎస్సీ(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి.**వయసు:**65ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.15,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:**అకడమిక్ విద్యార్హత,కంప్యూటర్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తును డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆఫీస్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, నెల్లూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.12.2022
» **వెబ్‌సైట్:** www.spsnellore.ap.gov.in

### సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అనంతపురంలో 24 పోస్టులు

అనంతపురంలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్.. డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 25
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–02, అసోసియేట్ ప్రొఫెసర్–05, అసిస్టెంట్ ప్రొఫెసర్–09, అసిస్టెంట్ లైబ్రేరియన్–01, అసిస్టెంట్ రిజిస్ట్రార్–01, సెక్షన్ ఆఫీసర్–01, జూనియర్ ఇంజనీర్(సివిల్)–01, టెక్నికల్ అసిస్టెంట్–01, అప్పర్ డివిజన్ క్లర్క్–02, సెక్యూరిటీ అసిస్టెంట్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.12.2022
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 26.12.2022
» **వెబ్‌సైట్:** www.cuap.ac.in

### ఐఐటీ, తిరుపతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), తిరుపతి.. వివిధ విభాగాల్లో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా.. అసిస్టెంట్ ప్రొఫెసర్(గ్రేడ్–1, 2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్–ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటిక్స్–స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన/పరిశోధన /పారిశ్రామిక అనుభవం అవసరం. **వయసు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1కు 38 ఏళ్లలోపు ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2కు 35 ఏళ్లలోపు ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.12.2022
» **వెబ్‌సైట్:** iittp.ac.in

### ఐఐటీ తిరుపతిలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తిరుపతి.. రీసెర్చ్ ప్రాజెక్ట్‌లో భాగంగా..ఫిజిక్స్ విభాగంలో పోస్ట్ డాక్టోరల్ ఫెలో భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** ఎంఎస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ(ఫిజిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 36 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.80,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** arijit@iittp.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 21.12.2022
» **వెబ్‌సైట్:** iittp.ac.in

### టీఎస్‌పీఎస్సీలో 18 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. ఔషధ నియంత్రణ పరిపాలన విభాగంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 18

» **అర్హత:** డిగ్రీ(ఫార్మసీ/ఫార్మాస్యూటికల్ సైన్స్), ఫార్మాడీ లేదా మెడిసిన్(క్లినికల్ ఫార్మకాలజీ/మైక్రోబయాలజీ స్పెషలైజేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.51,320 నుంచి రూ.1,27,310 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.12.2022
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.01.2023
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

### బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పుణెలో 551 పోస్టులు

పుణెలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 551
» **పోస్టుల వివరాలు:** ఏజీఎం, చీఫ్ మేనేజర్, జనరలిస్ట్ ఆఫీసర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమా, సీఏ, సీఎఫ్ఏ, సీఎంఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.12.2022
» **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

## పోలీస్ కొలువుల నగారా

» 6,511 పోలీస్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం
» 411 ఎస్ఐ పోస్టులు, 6,100 కానిస్టేబుల్ పోస్టులు
» దరఖాస్తు తేదీలు, ప్రిలిమినరీ పరీక్ష తేదీల వెల్లడి
» మొత్తం నాలుగు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఆంధ్రప్రదేశ్‌లో పోలీస్ కొలువుల నగారా మోగింది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. 6,511 పోలీస్ ఉద్యోగాల(ఎస్ఐ-411, కానిస్టేబుల్ 6,100) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.కానిస్టేబుల్ పోస్ట్‌లకు ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఎస్ఐ పోస్ట్‌లకు ఈ నెల 14 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకానుంది.ఈ నేపథ్యంలో.. పోలీస్ పోస్ట్‌లకు ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..



ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్

### ఎస్ఐ-411, కానిస్టేబుల్ 6,100

- రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ), కానిస్టేబుల్ హోదాలో 6,511 పోస్ట్‌లను వివిధ విభాగాల్లో భర్తీ చేయనుంది.
- సబ్ ఇన్‌స్పెక్టర్–సివిల్: 315 పోస్ట్‌లు; రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఏపీఎస్పీ): 96 పోస్ట్‌లు; కానిస్టేబుల్ –సివిల్: 3,580 పోస్ట్‌లు; కానిస్టేబుల్(ఏపీఎస్పీ): 2,520 పోస్ట్‌లు. మొత్తం 6,511 పోస్ట్‌లు. ఏపీఎస్పీ విభాగంలోని పోస్టులకు కేవలం పురుష అభ్యర్థులనే అర్హులుగా పేర్కొన్నారు.

### విద్యార్హతలివే

- **ఎస్ఐ:** జూలై 1, 2022 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులైతే ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై.. మూడేళ్ల డిగ్రీ చదివుండాలి. **వయసు:** జూలై 1, 2022 నాటికి 21–27 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **కానిస్టేబుల్:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై.. ఇంటర్మీడియెట్ రెండేళ్లు పూర్తి చేసుకుని(ఉత్తీర్ణత సాధించినా, సాధించకపోయినా) ఉండాలి. **వయసు:** జూలై 1, 2022 నాటికి 18–24 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- రెండు పోస్ట్‌లకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు కల్పిస్తారు.

### నాలుగంచెల ఎంపిక ప్రక్రియ

ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్ట్‌ల భర్తీకి నాలుగంచెల ఎంపిక విధానాన్ని అనుసరిస్తున్నారు. అవి.. **మొదటి దశ:** ప్రిలిమినరీ రాత పరీక్ష; **రెండో దశ:** ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్; **మూడో దశ:** ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్; **నాలుగో దశ:** ఫైనల్ రిటెన్ ఎగ్జామినేషన్.

### ఎస్ఐ- ప్రిలిమినరీ రాత పరీక్ష

- ఎస్ఐ పోస్ట్‌లకు తొలిదశ ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో రెండు వందల మార్కులకు ఉంటుంది. రెండు పేపర్లుగా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.
- పేపర్ 1 అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్/మెంటల్ ఎబిలిటీ 100 ప్రశ్నలు–100 మార్కులకు; అలాగే పేపర్ 2 జనరల్ స్టడీస్ 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటాయి.

### రెండో దశ.. ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్

- రెండో దశలో ఫిజికల్ మెజర్‌మెంట్‌లో నెగ్గేందుకు అభ్యర్థులు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- **పురుషులు:** 167.6 సెం.మీ.ఎత్తు ఉండాలి. ఛాతీ 86.3 సెంటీ మీటర్లు ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు కనీసం మూడు సెంటీమీటర్లు పెరగాలి. మహిళలకు శారీరక ప్రమాణాల్లో సడలింపులు ఉంటాయి. మహిళలకు కనీస ఎత్తును 152.5 సెంటీ మీటర్లుగా నిర్దేశించారు.

### మూడో దశ.. ఫిజికల్ ఎఫిషీయన్సీ టెస్ట్

- ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించి, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లోనూ అర్హత సాధించిన వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్‌కు వంద మార్కులు కేటాయిస్తారు. దీన్ని మొత్తం మూడు ఈవెంట్ల(1600 మీటర్లు, వంద మీటర్ల పరుగు, లాంగ్ జంప్)లో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒక్కో ఈవెంట్‌ను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుంది.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నిర్వహించే ఈవెంట్లలోని 1600 మీటర్ల పరుగు పందెంలో తప్పనిసరిగా అర్హత సాధించాలి. ఇది కాకుండా మిగిలిన రెండు ఈవెంట్లలో ఒక ఈవెంట్‌లో అర్హత సాధిస్తే సరిపోతుంది. అయితే ఏపీఎస్పీ విభాగంలోని పోస్ట్‌లకు పోటీ పడే వారు మాత్రం మూడు ఈవెంట్లలోనూ అర్హత పొందాలి.

### ఫైనల్ రాత పరీక్ష

- ఎస్ఐ పోస్ట్‌లకు సంబంధించి ప్రిలిమ్స్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ మూడింటిలోనూ అర్హత సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. చివరగా ఫైనల్ రాత నిర్వహిస్తారు. ఈ పరీక్ష నాలుగు పేపర్లలో ఉంటుంది.
- పేపర్ 1 ఇంగ్లిష్(డిస్క్రిప్టివ్ టైప్) 100 మార్కులు; పేపర్ 2 తెలుగు/ఉర్దూ(డిస్క్రిప్టివ్ టైప్) 100 మార్కులు; పేపర్ 3 అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్/మెంటల్ ఎబిలిటీ(ఆబ్జెక్టివ్ టైప్) 200 ప్రశ్నలు–200 మార్కులు, పేపర్ 4 జనరల్ స్టడీస్(ఆబ్జెక్టివ్ టైప్) 200 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్1,పేపర్–2లను కేవలం అర్హత పేపర్లుగానే పేర్కొంటారు. పేపర్–3, పేపర్–4లలో పొందిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక జాబితా రూపొందించి.. నియామకాలు ఖరారు చేస్తారు.

### కానిస్టేబుల్.. నాలుగు దశల్లో

- కానిస్టేబుల్ పోస్ట్‌ల ఎంపిక ప్రక్రియ కూడా నాలుగు దశల్లో ఉంటుంది.
- తొలి దశ ప్రిలిమినరీ పరీక్షను 200 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
- రెండో దశలో ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ ఉంటుంది. పురుష అభ్యర్థులు 167.6 సెం.మీ ఎత్తు, 86.3 సెం.మీ. ఛాతి కలిగుండాలి.
- మహిళా అభ్యర్థులు 152.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్ట్‌లకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ విజేతలకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(1600 మీటర్లు,వంద మీటర్లు, లాంగ్ జంప్) నిర్వహిస్తారు. వీటిలో 1600 మీటర్ల టెస్టులో తప్పనిసరిగా అర్హత పొందాలి. అలాగే వంద మీటర్ల టెస్ట్, లాంగ్ జంప్‌ల్లో ఏదో ఒకదాంట్లో అర్హత సాధిస్తే సరిపోతుంది.

### ఫైనల్ రాత పరీక్ష

- ప్రిలిమినరీ, పీఎంటీ, పీఈటీలలో విజయం సాధించిన వారికి చివరగా ఫైనల్ రిటెన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.
- ఈ పరీక్ష మూడు గంటల వ్యవధిలో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఉంటుంది.
- ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్ట్‌లకు 200 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- ప్రిలిమినరీ, ఫైనల్ రాత పరీక్షల్లో.. ఇంగ్లిష్, అర్థమెటిక్, జనరల్ సైన్స్, హిస్టరీ, కరెంట్ అఫైర్స్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### విజయానికి అడుగులు ఇలా

#### అర్థమెటిక్

అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్ విభాగంలో ముఖ్యాంశాలుగా భావించే సగటు, కసాగు, గసాభా, సంఖ్యలు, వర్గ మూలాలు, ఘన మూలాలు, నిష్పత్తులు, భాగస్వామ్యం, వయసు, శాతాలు, లాభ-నష్టాలు, చక్ర వడ్డీ, సరళ వడ్డీ, కాలం–దూరం, కాలం–పని వంటి వాటిపై పట్టు సాధించాలి. అదే విధంగా మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, మ్యాట్రిసెస్, సెట్స్–రిలేషన్స్‌ను ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయాలి.

#### రీజనింగ్

రీజనింగ్‌లో.. నంబర్ సిరీస్, మిస్సింగ్ నెంబర్స్, కోడింగ్–డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్ వంటి వాటిపై పూర్తిగా పట్టు సాధించాలి. వెన్ డయాగ్రమ్స్, అసెంప్షన్ అండ్ రీజన్, ఆర్గ్యుమెంట్, సిలాజిజమ్, డేటా సఫిషియన్సీ విభాగాల్లో పట్టుతో వెర్బల్ రీజనింగ్‌లో రాణించే అవకాశముంది. ఆడ్‌మన్ ఔట్, డైస్ అండ్ క్యూబ్స్, వెన్ డయాగ్రమ్స్‌లపై అవగాహనతో నాన్ వెర్బల్ రీజనింగ్‌లో ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే నైపుణ్యం లభిస్తుంది. మెంటల్ ఎబిలిటీ విభాగంలో రాణించేందుకు టాబ్యులేషన్, డేటా సమీకరణ, డేటా విశ్లేషణలపై అవగాహన పెంచుకోవాలి.

#### జనరల్ స్టడీస్‌కు ఇలా

- హిస్టరీకి భారత, ఏపీ చరిత్రకు సంబంధించి ముఖ్యమైన ఘట్టాలు, చరిత్ర గతిని మార్చిన సంఘటనలు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలోని ప్రధాన ఘట్టాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
- జాగ్రఫీలో భారత, ఏపీ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, సముద్ర తీర ప్రాంతాలు, అడవులు, పంటలు, సాగు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ఎకానమీకి సంబంధించి కోర్ ఎకనామీ అంశాలతోపాటు సమకాలీన అంశాలు, దేశ ఆర్థిక రంగంలో అమలవుతున్న కొత్త విధానాల గురించి తెలుసుకోవాలి.
- పాలిటీకి సంబంధించి రాజ్యాంగం, రాజ్యాంగ రూపకర్తలు, రాజ్యంగంలోని ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు వంటి వాటితోపాటు తాజా రాజ్యాంగ సవరణలు, వాటి ఉద్దేశం, ప్రభావం వంటి అంశాలు తెలుసుకోవాలి.
- కరెంట్ అఫైర్స్‌లో జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న తాజా పరిణామాలు గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
- ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్య అంశాలు; భారత, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, ఆర్థికాభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, పునర్విభజన సమస్యల గురించి అధ్యయనం చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలు, లబ్ధిదారులు, బడ్జెట్ కేటాయింపుల గురించి తెలుసుకోవాలి.
- జనరల్ ఇంగ్లిష్, జనరల్ తెలుగు పేపర్ కోసం ఈ రెండు భాషలకు సంబంధించి బేసిక్ గ్రామర్ అంశాలు, యాంటానిమ్స్, సినానిమ్స్, ఫ్రేజెస్‌లపై పట్టు సాధించాలి.

## ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

### లోన్ యాప్‌ల అరాచకాలను అణచివేయండి

**జీరో అవర్‌లో కేంద్రానికి విజయసాయిరెడ్డి విజ్ఞప్తి**

**సాక్షి, న్యూఢిల్లీ:** తక్షణ రుణం పేరుతో ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లు సాగిస్తున్న అరాచకాలు, వేధింపులు, బలవంతపు వసూళ్లను అణచివేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభ జీరో అవర్‌లో సోమవారం ఆయన ఈ అంశంపై మాట్లాడారు. ఆర్థిక అవసరాలతో ఇబ్బందులు పడే అమాయకులను ఈ లోన్ యాప్‌లు ఆకర్షిస్తున్నాయని, ఆ తర్వాత రుణం మంజూరు చేస్తాయన్నారు. ఏపీలో ఇలాంటి ఉదంతాల కారణంగా రుణగ్రహీతలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు వెలుగుచూడటంతో ప్రభుత్వం వెంటనే యాప్ ఏజెంట్లను అరెస్టుచేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుందని వివరించారు. అయినప్పటికీ ఈ లోన్ యాప్‌ల కార్యకలాపాలు కొనసాగుతున్నందున ఐటీ మంత్రి జోక్యంచేసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

**మురికివాడల పునరుద్ధరణకు తరలింపే అవరోధం..**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద మురికివాడల పునరాభివృద్ధిలో నిర్వాసితుల తరలింపు అవరోధంగా మారిందని పట్టణ, గృహనిర్మాణ శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి తెలిపారు. మురికివాడల పునరుద్ధరణ కింద దేశంలో ఇప్పటికే 210 క్లస్టర్లను గుర్తించామని విజయసాయి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

**ఏపీలో లక్షా 90 వేల వీధి వర్తకులకు స్వానిధి రుణాలు**

ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు 1,90,433 మంది వీధి వర్తకులకు రుణాలు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి తెలిపారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు ఆయన ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ ఏడాది డిసెంబర్ 4 నాటికి రుణాల కోసం ఏపీ నుంచి సుమారు నాలుగు లక్షల దరఖాస్తులు అందాయన్నారు.

#### 2జీ ఇథనాల్ రిఫైనరీలకు ఆర్థిక సాయం

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపాలన్న లక్ష్య సాధనలో 2జీ ఇథనాల్ కీలకం కానున్నట్లు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తెలిపారు. 2జీ బయో ఇథనాల్ రిఫైనరీల ఏర్పాటుకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తుందని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఈ ఏడాది నవంబర్ 15 నాటికి ఆంధ్రప్రదేశ్ నుంచి 16.19 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను కొనుగోలు చేశాయని.. దేశవ్యాప్తంగా ఐదేళ్లలో 385.92 కోట్ల లీటర్లను అవి కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు.

#### ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదు

14వ ఆర్థిక సంఘం సిఫార్సులను అనుసరించి రాష్ట్రాలకు ప్రత్యేక హోదా అనేది ఉనికిలో లేని అంశమని కేంద్రం పునరుద్ఘాటించింది. గతంలో ప్రణాళిక సంఘం కొన్ని ప్రత్యేక లక్షణాలున్న రాష్ట్రాలకు మాత్రమే ఆ హోదాను మంజూరు చేసేదని తెలిపింది. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2015–20కుగానూ రాష్ట్రాలకు నికర భాగస్వామ్య పన్నుల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచామని 'ఆప్' సభ్యుడు విక్రమ్‌జిత్ సింగ్ ప్రశ్నకు స్టాటస్టిక్స్, ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ శాఖ సహాయ మంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అంతరాన్ని పూడ్చలేని రాష్ట్రాలకు పోస్ట్ డెవల్యూషన్ రెవెన్యూలోటు గ్రాంట్లు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

#### 2036 నాటికి పట్టణాల్లోనే 40 శాతం జనాభా

నేషనల్ కమిషన్ ఆన్ పాపులేషన్ ప్రకారం 2036 నాటికి పట్టణాల్లో 40 శాతం జనాభా ఉంటారని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

# ఆక్వా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతర కృషి

**ఆక్వా రైతుల అవగాహన సదస్సులో అప్సడా రాష్ట్ర వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్**

- గత ప్రభుత్వంలో ఆక్వా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు
- ప్రాసెసింగ్ ప్లాంట్లు వాటికి అనుకూలమైన రేట్లు నిర్ణయించేవి
- రైతుల కష్టాలు తెలిసిన వెంటనే సీఎం జగన్ ఎంపవర్ కమిటీ వేశారు
- రైతుకు గిట్టుబాటు ధర లభించేలా కమిటీ చర్యలు తీసుకుంది
- ఒక్క రూపాయి తక్కువ ఇచ్చినా చర్యలు తీసుకుంటాం
- 10 ఎకరాల్లోపు రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50 కే ఇస్తున్నాం
- 365 రోజులూ రొయ్యల కొనుగోలు జరుగుతుంది




సదస్సులో మాట్లాడుతున్న అప్సడా రాష్ట్ర వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్

**కాకినాడ సిటీ:** ఆక్వా రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, రైతులెవరూ అధైర్య పడవద్దని అప్సడా (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ) రాష్ట్ర వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ చెప్పారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆక్వా రైతుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో ఆక్వా రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులు వారికి అనుకూలమైన రేట్లు నిర్ణయించే వారన్నారు. ఆక్వా రైతుల కష్టాలు తెలుసుకున్న 24 గంటల్లోనే సీఎం వైఎస్ జగన్‌రొయ్యలకు గిట్టుబాటు ధర లభించేందుకు మంత్రులు, మత్స్యశాఖ అధికారులు, రైతులతో కలసి ఎంపవర్ కమిటీని వేయడంతో ఎన్నడూ లేని విధంగా రైతులు పంటను అమ్ముకోగలుగుతున్నారని తెలిపారు. ఆక్వా రైతుల సమస్యలపై చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలన్న సీఎం ఆదేశాల మేరకు ప్రాసెసింగ్ ప్లాంట్ల యాజమానులతో ఇప్పటికే ఐదు సార్లు సమావేశమై గిట్టుబాటు ధరకు రొయ్యలు కొనేలా చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వంలో రొయ్య 100 కౌంట్ రూ. 80కు కొనే వారని, ఇప్పుడు అదే కౌంట్ రూ. 210కి కొనాలని స్పష్టం చేశారు. రూపాయి తగ్గినా వెంటనే ఎంక్వైరీ కమిటీలో పెట్టి రైతులు, రైతు సంఘాల నాయకులు సమక్షంలోనే నిలదీసే పరిస్థితి ఉందన్నారు. ఏలూరు జిల్లా గణపవరంలో జరిగిన సమావేశంలో రైతుల వినతి మేరకు ఆక్వాజోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు ఉన్న రైతుకి రూ.1.50కే యూనిట్ విద్యుత్ ఇస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్ అక్కడికక్కడే ప్రకటించారన్నారు. గత ప్రభుత్వంలో జోన్ వ్యవస్థ మధ్యలో వదిలేస్తే, సీఎం సుదీర్ఘమైన జోన్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. దీని వల్ల 1,08,864 మంది రైతులు ఆక్వా జోన్‌లోకి వచ్చారన్నారు. వీరందరికీ యూనిట్ విద్యుత్ రూ. 1.50కే అందిస్తున్నట్లు తెలిపారు. పదిరోజులే రొయ్యల కొంటారంటూ కొందరు గుత్తేదారులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, 365 రోజులూ ప్రాసెసింగ్ ప్లాంట్లు రొయ్యలు కొంటాయని లేల్చి చెప్పారు. ఏ విధమైన అపోహలకు తావులేకుండా రైతులు నిర్భయంగా పంటలు పండించాలని సూచించారు.

**సమావేశం తీర్మానాలు**

- 2020 నాటి ధరలకే రైతులకు ఫీడ్ అందించాలి
- ప్రతి కంపెనీ 36, 32 ప్రొటీన్స్ ఉండేలా చూడాలి
- రొయ్యల రైతులకు చిన్నా పెద్దా తేడా చూపకుండా రూ.1.50కే విద్యుత్ అందించాలి



- కెమికల్స్ ధరలు 40 శాతం తగ్గించాలి
- రొయ్యల పంట అంతా ఎగుమతి కాకుండా దేశీయ మార్కెట్ అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద రొయ్యలు అమ్మేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

# వరదలవల్లే పోలవరం ఆలస్యం

**రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బోస్ ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**సాక్షి, న్యూఢిల్లీ:** భారీ వరదల కారణంగానే పోలవరం ప్రాజెక్టు ఆలస్యమవుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. నీటిపారుదల కాంపొనెంట్‌లో వందశాతం ఖర్చు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని స్పష్టంచేసింది. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు ఈ మేరకు సోమవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2016లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆమోదం మేరకు 1–4–2014 నుంచి పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నీటిపారుదల కాంపొనెంట్ ఖర్చు వంద శాతం కేంద్ర ప్రభుత్వమే అందిస్తుందని ఆయన తెలిపారు. ఏపీ విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటి నుంచి ఏపీప్రభుత్వం ప్రాజెక్టుపై రూ.15,970.53 కోట్లు ఖర్చుచేసినట్లు నివేదించిందని ఆయన వివరించారు. అయితే, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం సిఫార్సుల మేరకు ఏపీ ప్రభుత్వానికి ఇప్పటివరకూ రూ.13,226.04 కోట్లు రీయింబర్స్ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.483 కోట్ల క్లెయిమ్‌లను పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రీయింబర్స్ నిమిత్తం పంపిందన్నారు. ప్రస్తుతం అంచనా వేసిన కాలపరిమితి ప్రకారం మార్చి, 2024 నాటికి ప్రాజెక్టు, జూన్ 2024 నాటికి డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ పనులు పూర్తిచేయాల్సి ఉందన్నారు. అయితే, 2020, 2022ల్లో గోదావరికి వచ్చిన భారీ వరదల కారణంగా ప్రతిపాదిత షెడ్యూలులో జాప్యం జరిగే అవకాశముందని కేంద్రమంత్రి చెప్పారు. ప్రాజెక్టు పర్యవేక్షణ, సకాలంలో అమలు నిమిత్తం పీపీఏని ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ఇబ్బందులు గుర్తించి పరిష్కరించడానికి కేంద్ర స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తామని బిశ్వేశ్వర్ తుడు తెలిపారు.

## ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

### కొన్ని పంటలకే ప్రాధాన్యమా?

**జన్యుపరమైన పంటలపై వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు**

**సాక్షి, న్యూఢిల్లీ:** జన్యుపరంగా తయారైన కొన్ని పంటలకే ప్రాధాన్యం ఎందుకిస్తున్నారని కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నించారు. లోక్‌సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొన్ని పంటలకే అనుమతివ్వడంవల్ల ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు నిలిచిపోతున్నాయన్నారు. గత ఎనిమిది నెలలుగా కోళ్లు, రొయ్యల పరిశ్రమలకు మేత ధరలు విపరీతంగా పెరగడంతో వాటిని దిగుమతి చేసుకోవాలని కోరగా జన్యుపరంగా మార్పుచెందిన వాటిని దిగుమతి చేసుకోలేమని కేంద్రం చెప్పిందని గుర్తుచేశారు.

#### ఏపీలో 48 స్కిల్ హబ్‌లు

ప్రధానమంత్రి కౌశల్‌వికాస్ యోజన 3.0 పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 48 స్కిల్ హబ్‌లు ఏర్పాటుచేసినట్లు కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. అయితే, ఈ పథకం కింద ఆయా హబ్‌ల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయింపుల్లేవని లావు శ్రీకృష్ణదేవరాయలు మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

#### అంబేద్కర్ సర్క్యూట్‌కు ప్రత్యేక రైలు

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సర్క్యూట్‌ను ప్రజలు సందర్శించడానికి వీలుగా టూరిస్టు రైలు వేయాలని రైల్వేశాఖను కోరినట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు మార్గాని భరత్ రామ్ ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు.

#### మూడేళ్లుగా ఏపీలో కేవీ ఏర్పాటులేదు

2020–21 నుంచి 2022–23 వరకూ ఏపీలో కేంద్రీయ విద్యాలయం (కేవీ) ఏర్పాటుచేయలేదని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 35 కేవీలు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు గోరంట్ల మాధవ్ ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

#### ఏపీలో కొత్తగా ఎనిమిది ఈఎస్ఐ ఆసుపత్రులు

ఏపీలో కొత్తగా ఎనిమిది ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆసుపత్రులకు అనుమతిచ్చినట్లు కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. గుంటూరు, విజయనగరం , తూర్పుగోదావరి (కాకినాడ), అనంతపురం (పెనుకొండ), విశాఖపట్నం (విశాఖపట్నం, అచ్యుతాపురం), నెల్లూరు (శ్రీసిటీ, నెల్లూరు) జిల్లాల్లో వీటికి అనుమతించినట్లు వైఎస్సార్‌సీపీ సభ్యురాలు బీవీ సత్యవతి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

#### గేమింగ్ కంపెనీలు రూ.22,936 కోట్ల జీఎస్టీ ఎగవేత

దేశంలో గేమింగ్ కంపెనీలు ఏప్రిల్ 2019 నుంచి నవంబరు 2022 మధ్య సుమారు రూ.22,936 కోట్లు ఎగవేతకు పాల్పడినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. 6–12–22 నాటికి రూ.1,000 కోట్లు కంటే ఎక్కువ నేరాల్లో జప్తుచేసినట్లు వైఎస్సార్‌సీపీ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరిల ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

#### గతేడాది పన్నుల్లో వాటాగా ఏపీకి రూ.35,385 కోట్లు

గతేడాది రూ.8.82 లక్షల కోట్లు పన్నుల్లో వాటాగా 29 రాష్ట్రాలకు విడుదల చేయగా, అందులో తెలంగాణకు రూ.18,720 కోట్లు, ఏపీకి రూ.35,385 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో తెలిపారు. ఇక 2017–18 నుంచి 2021–22 వరకు తెలంగాణకు రూ.82,380.69 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.1,49,877.09 కోట్లు విడుదల చేసినట్లు బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.